ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 23.09.2025 | సంపుటి :12 సంచిక : 65 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370


సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## స్వరాష్ట్ర సాధనలో సింగరేణి పాత్ర కీలకం

### బొగ్గుఉత్పత్తిని ఆపి నాటి ప్రభుత్వంపై కార్మికులు ఒత్తిడి తెచ్చారు

- దేశంలో వెలుగులు విరాజిల్లుతున్నాయంటే.. కార్మికులు ఉత్పత్తి చేసిన బొగ్గే కారణం
- కాంట్రాక్టు కార్మికులకు కూడా పండగ బోనస్ ఇస్తున్నాం
- సింగరేణి మూతపడుతుందన్న దశలో కాకా వెంకటస్వామి సంస్థను ఆదుకున్నారు
- కార్మికులకు బోనస్ ప్రకటన సందర్భంగా మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ సాధనలో సింగరేణి కార్మికులు ప్రత్యేక పాత్ర పోషించారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. సింగరేణి కార్మికుల భాగస్వామ్యాన్ని ప్రభుత్వం ఎప్పటికి గుర్తుంచు కుంటుందని అన్నారు. సింగరేణి కార్మికులకు గుడ్‌న్యూస్ చెప్పింది ప్రభుత్వం. దసరా సందర్భంగా సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటించింది సర్కార్. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మూతపడుతుందన్న దశలో సింగరేణిని కాకా వెంకటస్వామి ఆదుకున్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో బొగ్గు ఉత్పత్తి మొత్తని స్తంభింపచేసి అప్పటి ప్రభుత్వాల మీద ఒత్తిడి తెచ్చినట్లు గుర్తు చేశారు. దేశంలో వెలుగులు విరాజిల్లుతున్నాయంటే.. సింగరేణి కార్మికులు ఉత్పత్తి చేసిన బొగ్గు కారణమని అన్నారు సీఎం రేవంత్. నిరంతరం కష్టపడి రాష్ట్ర ఆదాయంలో, దేశ ఆదాయంలో మిగతా 2లో..

### సింగరేణి కార్మికులకు దసరా బొనాంజా 2లో..

- లాభాల్లో 34శాతం బోనస్‌గా ప్రకటించిన ప్రభుత్వం
- సగటున ఒక్కొక్క కార్మికుడికి రూ.1.95 లక్షలు చెల్లింపు

### వీధి వ్యాపారులకు ప్రత్యేక వెండింగ్ జోన్స్ 2లో..

- వీధి దీపాలకు సోలార్ విద్యుత్ వినియోగం
- చెరువుల వద్ద పైలట్ ప్రాజెక్టుగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

### నేడు ముఖ్యమంత్రి రేవంత్ మేడారం పర్యటన 2లో..

### జాతీయ రహదారుల నిర్మాణంలో జాప్యం చేయొద్దు 2లో..

- నిర్దేశిత సమయంలో భూ సేకరణ, పరిహారం పంపిణీ పూర్తి చేయాలి
- అభివృద్ధి కేంద్రంగా భారత్ ఫ్యూచర్ సిటీ-అమరావతి-మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ హైవే
- పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి
- అటవీ భూములకు పరిహారంగా ప్రత్యామ్నాయం భూ కేటాయింపులు
- సత్వర అనుమతుల కోసం కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, భూపేందర్ యాదవ్‌లతో త్వరలో భేటీ
- జాతీయ రహదారుల నిర్మాణంపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

సూత్రప్రాయంగా..

## సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ అంగీకారం

- సీఎం విష్ణుదేవ్ సాయ్‌ని కలిసిన మంత్రి ఉత్తమ్
- ప్రాజెక్టు నిర్మాణానికి ఎన్‌వోసీ జారీ చేయాలని వినతి
- ముంపు పరిహారం, సహాయ, పునరావాస చర్యలు చేపడతామని హామీ
- ప్రాజెక్టుకు ఎన్‌వోసీ జారీకి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి సూత్రప్రాయంగా ఆమోదం



రాయ్‌పూర్(జనంసాక్షి): ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి గోదావరి నదిపై సమ్మక్కసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి ఎలాంటి అభ్యంతరం లేదని (ఎన్‌ఓసీ) మంజూరు చేయడానికి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. సోమవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీనియర్ అధికారులతో కలిసి రాయపూర్‌లో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిని కలిసి చర్చించారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, విష్ణుదేవ్ సాయి సానుకూల ప్రతిస్పందనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయం ప్రాజెక్టు సాధనలో ఒక సుదీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్న అడుగు అని ఆయన అభివర్ణించారు. ఛత్తీస్‌గఢ్‌లో భూసేకరణ, పరిహారం మరియు పునరావాస బాధ్యతను పూర్తిగా తెలంగాణ తీసుకుంటుందని వివరిస్తూ ఒక పత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. ఎన్‌ఓసీ అనేది కేంద్ర జల సంఘం ఆమోదం పొందడానికి అవసరమైన చివరి అంతర్రాష్ట్ర అనుమతిగా ఉందని, అది లేకుండా ప్రాజెక్టు ముందుకు సాగలేదని ఆయన స్పష్టం చేశారు. ఛత్తీస్‌గఢ్ సీఎంను ఉద్దేశించి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌లో ఉత్తమ్ కుమార్ రెడ్డి, సమ్మక్కసాగర్ బ్యారేజ్ ములుగు జిల్లాలోని తుపాకులగూడెంలో నిర్మాణంలో ఉందని వివరించారు. 83 మీటర్ల పూర్తి మిగతా 2లో..

### ఓటుకు నోటు కేసులో సుప్రీంలో ముగిసిన విచారణ తీర్పు రిజర్వు 2లో..

### టీజీపీఎస్సీ సభ్యులుగా మరో ముగ్గురి నియామకం

## స్వదేశీ ఉత్పత్తులే కొనండి.. విక్రయించండి

- దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహిద్దాం
- 'జీఎస్టీ పొదుపు ఉత్సవం' మొదలైంది
- అన్ని వర్గాల ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుతుంది
- శ్లాబుల తగ్గింపుతో ఆర్థిక వ్యవస్థ సరళీకృతం, వ్యాపార నిర్వహణ సులభతరం కానున్నాయి
- జీఎస్టీ సంస్కరణలపై దేశ ప్రజలకు ప్రధాని లేఖ



న్యూఢిల్లీ(జనంసాక్షి): జీఎస్టీ సంస్కరణలపై దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ లేఖ విడుదల చేశారు. ఈ లేఖలో ఆయన దేశ ప్రజలందరికీ స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని సూచించారు. దుకాణదారులు అందరూ 'భారతదేశంలో తయారు చేసిన' ఉత్పత్తులను విక్రయించాలని విజ్ఞప్తి చేశారు. 'మనం గర్వంగా చెప్పుకుందాం - మనం కొనేది స్వదేశీ, మనం అమ్మేది స్వదేశీ' అని ప్రధాని బహిరంగ లేఖలో పేర్కొన్నారు. దేశంలో నూతన ఏ÷ు సంస్కరణలు అమలులోకి రావడంతో తగ్గిన ఏ÷ు రేట్లు- 375 వస్తువులపై వర్తిస్తాయని పేర్కొన్నారు. ఆటోమొబైల్స్ నుంచి రోజువారీ వినియోగ వస్తువుల వరకు ఈ జీఎస్టీ తగ్గింపు జరిగిందని తెలిపారు. జాతినుద్దేశించి ఆదివారం ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ.. ఆదాయపు పన్ను సంస్కరణలతో పాటు-, నేటి నుంచి అమల్లోకి వచ్చే జీఎస్టీ రేటు- సవరణలతో మిగతా 2లో..

## అధికారులు ప్రజల ప్రతి పైసాకు జవాబుదారీగా ఉండాలి

- రాష్ట్రవ్యాప్తంగా వెల్లువలా కాంగ్రెస్ పార్టీలో చేరికలు
- రాష్ట్రాన్ని అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నాం
- నాడు 11.50 శాతం ఉన్న వడ్డీని 8 శాతానికి తెచ్చాం :డిప్యూటీ సీఎం భట్టి



ఖమ్మం(జనంసాక్షి): రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ పనిచేస్తున్న తీరును చూసి రాష్ట్రవ్యాప్తంగా వెల్లువలా కాంగ్రెస్ పార్టీలో చేరికలు జరుగుతున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం సాయంత్రం ముదిగొండ మండల టిఆర్ఎస్ పార్టీ నాయకత్వం మొత్తం కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం ప్రజల అభ్యున్నతి కే కాదు రాష్ట్ర ప్రగతి కి వేస్తున్న పునాదులను చూసి జిల్లా స్థాయి నాయకులే కాదు శాసనసభ్యులు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరడానికి వస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి తెచ్చిన ఏడున్నర లక్షల కోట్ల అప్పులు ఏమయ్యాయి అంటే 10 సంవత్సరాలు పరిపాలించిన నాయకులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఇస్తే తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగులు ప్రసరిస్తాయని భావించి సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. దురదృష్టకరం 10 సంవత్సరాలు ఈ రాష్ట్రం కెసిఆర్ కుటుంబం చేతిలో బందీ అయింది అన్నారు. ఆర్థికంగా, పాలన వ్యవస్థ ను పది సంవత్సరాల్లో విధ్వంసం చేశారని అన్నారు. వారి కుటుంబ అవసరాల కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని తెలిపారు. వ్యవస్థలను ఎత్తివేసి, వారు సృష్టించిన ఆర్థిక విధ్వంసాన్ని చూస్తుంటే కడుపు తరుక్కుపోతుంది, 24 గంటలు పనిచేసిన ఈ వ్యవస్థలను సర్ ఇది ఎందుకు సమయం సరిపోని పరిస్థితి నెలకొంది అన్నారు. అప్పుల భారం నుంచి రాష్ట్రాన్ని బయటపడేసేందుకు ప్రధానమంత్రిని, కేంద్ర ఆర్థిక మంత్రిని పలుమార్లు కలిసాం అన్నారు. రాష్ట్ర బడ్జెట్లో నెలకు 11 వేల కోట్లు మిగతా 2లో..



## అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌లో..

### మరో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు కట్టా రామచంద్రారెడ్డి, కడారి సత్యానారాయణ రెడ్డి మృతి

### ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు

### ఘటనా స్థలంలో ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం



చర్ల(జనంసాక్షి): ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ జరిగింది. ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఇద్దరు మృతి చెందారు. మృతులను మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు కట్టా రామచంద్రారెడ్డి అలియాస్ రాజు, కడారి సత్యానారాయణ రెడ్డి అలియాస్ కోసాగా గుర్తించారు. ఘటనా స్థలిలో ఏకే 47, ఆయుధాలు, పేలుడు పదార్థాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌ను బస్తర్ ఐజీ సుందర్ రాజ్ ధ్రువీకరించారు.

### కేటీఆర్‌కు క్షమాపణలు చెప్పడం కూడా అనవసరం

- పరువు నష్టంపై బండి కౌంటర్ దాఖలు
- ఫోన్ ట్యాపింగ్ నిందితుల వాంగ్మూలం ఆధారంగా ఆరోపణలు చేశానని వెల్లడి

2లో..





## ఆక్రమణదారులు ఎంతటివారైనా వదలం

- కబ్జాల తొలగింపులో వెనక్కి తగ్గం
- రూ. 50 వేల కోట్ల విలువైన భూమిని కాపాడాం
- 923 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించాం
- ప్రకృతి పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నాం
- జనవరినాటికి అందుబాటులోకి 6 చెరువులు : హైడ్రా కమిషనర్ రంగనాథ్
- 26న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా బతుకమ్మ కుంట ప్రారంభిస్తామని వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి): భారీ వర్షాలు ఒక వైపు.. కబ్జాల తొలగింపు మరో వైపు.. ఇలా మల్టీ టాస్కుతో హైడ్రా పని చేస్తోందని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైడ్రా ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకూ రూ. 50 వేల కోట్ల విలువైన 923.14 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడామన్నారు. ఇలా చెరువులు, కాలువల్లో ఆక్రమణలను తొలగించి.. ప్రకృతిని పరిరక్షించడం ద్వారా నగరానికి మంచి భవిష్యత్తును ఇవ్వడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. హైడ్రా కార్యకలాపాలను వివరించేందుకు సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు విలేకరులతో మాట్లాడారు. ఇప్పుడు హైడ్రా చర్యలన్నీ భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. హైడ్రా పట్ల నగర ప్రజలందరికి మంచి అభిప్రాయం ఉందని.. ఒకరిద్దరు విమర్శించినా భవిష్యత్తులో వాళ్లు కూడా మెచ్చుకుంటారని అన్నారు. మిగతా 2లో..

## మీ సమస్య పరిష్కరించకుంటే స్థానిక ఎన్నికలు బహిష్కరించండి

### నల్గొండ, సూర్యాపేట జిల్లాల ఆర్ఆర్ఆర్ బాధితులతో కేటీఆర్ భేటి

హైదరాబాద్(జనంసాక్షి): నల్గొండ, సూర్యాపేట జిల్లాకు చెందిన ఆర్ఆర్ఆర్ బాధితులంతా ఐకమత్యంగా ఉండాలని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ సూచించారు నల్గొండ, సూర్యాపేట జిల్లాల ట్రిపుల్ ఆర్ బాధితులు సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీ సమస్య పరిష్కరించకపోతే త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు బహిష్కరించాలని సూచించారు. స్థానిక ఎన్నికలు బహిష్కరించడం వల్ల మీ మిగతా 2లో..





## ఊహాజనిత కథనాలు దురదృష్టకరం

- పైలట్ల పనితీరుపై విమర్శలు సరికాదు.. అది బాధ్యతారాహిత్యమే
- అహ్మదాబాద్ విమాన ప్రమాదం ప్రాథమిక నివేదికపై సుప్రీం కీలక వ్యాఖ్యలు
- స్వతంత్ర దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్లపై స్పందన తెలియజేయండి
- కేంద్రం, డీజీసీఏ, ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరోకు నోటీసులు

న్యూఢిల్లీ(జనంసాక్షి): అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదానికి సంబంధించిన ప్రాథమిక నివేదికపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పైలట్ల పనితీరులో లోపాలు ఉన్నట్లు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదికను అత్యున్నత న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. ఈ నివేదికపై ఊహాజనిత కథనాలు దురదృష్టకరమని, అది బాధ్యతారాహిత్యమేనని పేర్కొంది. ఈ ప్రమాదంపై స్వతంత్ర మిగతా 2లో..

## మరోసారి కుంభవృష్టి

### హైదరాబాద్‌లో మళ్లీ భారీ వర్షం

### రోడ్లపైనిలిచిన వాననీరు

### పలుచోట్ల ట్రాఫిక్ ఇబ్బందులు

హైదరాబాద్(జనంసాక్షి): రాజధాని హైదరాబాద్ నగర వ్యాప్తంగా క్యూమిలో నింబస్ మేఘాలు అలుముకున్నాయి. దీంతో నగరంలో మరోమారు భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం మూడు గంటల నుంచి తేలికపాటి జల్లులు పడుతుండగా.. మిగతా 2లో..

### కెనెడాలో ఖలిస్తానీ ఉగ్రవాది అరెస్ట్

పన్నూకు అత్యంత సన్నిహితుడిగా పేరు 9లో..

## అధికారులు ప్రజల ప్రతి పైసాకు జవాబుదారీగా ఉండాలి

వడ్డీలు కట్టడానికే సరిపోయింది అన్నారు. ఈ రాష్ట్రం అభివృద్ధి చెందాలి ఆర్థిక వ్యవస్థ గాడిలో పడాలి అన్న సంకల్పంతో 26 వేల కోట్ల అప్పును గత పాలకులు 11.50 శాతంతో తీసుకువస్తే ఆ వడ్డీ రేటును 8 శాతానికి తగ్గించాం అన్నారు. ఈ రాష్ట్ర ప్రజలు ఉప్పు, పప్పు ఏది కొనుగోలు చేసిన పన్ను చెల్లిస్తున్నారు వారి పన్నులతోనే అధికారులు ఉద్యోగుల జీతాలు చెల్లిస్తున్నాం, గత పాలకులు తెచ్చిన అప్పులకు వడ్డీలు కడుతున్నాం ఈ రాష్ట్ర ఖజానాలోని ప్రతి పైసాకు అధికారులు, ఉద్యోగ వ్యవస్థ జవాబుదారీగా ఉండాలి అన్నారు. ఉద్యోగులు సకల జనుల సమ్మె చేసి ప్రత్యేక రాష్ట్రం కోసం కృషి చేస్తే గత పాలకులు ఉద్యోగులకు సంబంధించిన 15 వేల కోట్ల బకాయిలు చెల్లించకుండా పోయారు మా ప్రభుత్వం రాగానే నెలకు 700 కోట్ల చొప్పున ఉద్యోగుల బకాయిలు చెల్లించుకుంటూ వస్తున్నామని తెలిపారు. గత పది సంవత్సరాలు అభివృద్ధి అంటే ఏమిటో తెలియని పరిస్థితి ఉపాధి హామీలో భాగంగా 100 రోజుల పనిలో చేపట్టే కార్యక్రమాలకు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించే వారిని విమర్శించారు. గత పది సంవత్సరాలు రాష్ట్రంలో ఒక బడి ఒక రోడ్డు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు రాష్ట్ర ప్రజలకు దక్కలేదు అన్నారు. కృష్ణా నదిపై నిర్మించిన నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాల ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ హయాంలోనే నిర్మించాం కృష్ణా నదిపై ఒక్క ప్రాజెక్టు కట్టలేదు, అటు గోదావరిపై లక్ష కోట్లు అప్పు తెచ్చి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగి పోయింది అన్నారు. లక్ష కోట్ల అప్పు తెచ్చారు అవి ఏమైపోయాయో ఎవరికీ తెలియని పరిస్థితి రాష్ట్రంలో ఉంది అన్నారు. దివంగత నేత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేపట్టిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సుజల స్రవంతి ప్రాజెక్టు గత పాలకులు చంపేశారు, తిరిగి ఆ ప్రాజెక్టుకు ప్రజా ప్రభుత్వం జీవం పోస్తుందని తెలిపారు. మన ప్రభుత్వం వచ్చింది సరదాగా ఉందాం, నియోజకవర్గ ప్రజలతో సమయం కేటాయించి తిరుగుదాం అంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూస్తే కడుపు తరుక్కుపోతుంది. ఏ ఒక్క నిమిషం వృధా చేసిన రాష్ట్రానికి నష్టం చేసిన వారం అవుతాం అని భావించి యావత్ క్యాబినెట్ సభ్యులు రోజుకు 18 గంటల పాటు పనిచేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రిగా, ఆర్థిక విద్యుత్ శాఖ మంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి గారితో కలిసి రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు నిరంతరం శ్రమిస్తున్నాను, అందుకే మధుర నియోజకవర్గ ప్రజలకు వారు కోరుకున్న మేరకు సమయం కేటాయించలేకపోతున్నానని డిప్యూటీ సీఎం అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి మధుర నియోజకవర్గ ప్రజల విలువైన ఓటును వినియోగిస్తున్నానని అన్నారు. తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్లు రైతు భరోసా కార్యక్రమం కింద రైతుల ఖాతాల్లో జమ చేసి దేశ చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో ప్రజా ప్రభుత్వం రికార్డు సృష్టించింది అన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 21 వేల కోట్లు రైతు రుణమాఫీ కింద రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకులకు చెల్లించింది అన్నారు. 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నాం, పేదవాని కళ్ళల్లో ఆనందం చూసి ఇందిరమ్మ ప్రభుత్వం తన్మయం చెందుతుంది అన్నారు. పంటలకు మద్దతు ధర ఇవ్వడంతో పాటు సన్నధాన్యం సాగు చేసిన రైతులకు కింటాకు 500 చొప్పున బోనస్ చెల్లిస్తున్నామని తెలిపారు. 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు 24 గంటల ఉచిత విద్యుత్తును సరఫరా చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 51 లక్షల కుటుంబాలకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్తును సరఫరా చేస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువత కలలను సాకారం చేసేందుకు సర్వీస్ కమిషన్ను ప్రక్షాళన చేసి 56వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మరో 30 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. ఐదు సంవత్సరాల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు ప్రతి సంవత్సరం 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను అందించాలని నిర్ణయించి మొదటి సంవత్సరం లక్ష్యానికి మించి 21,635 కోట్లు పొట్టి లేని రుణాల మొత్తం మహిళా సంఘాలకు అందజేశామని తెలిపారు. రాష్ట్రంలోని లక్షలాది బిడ్డల చదువు ప్రజా ప్రభుత్వం బాధ్యత, రాష్ట్రవ్యాప్తంగా వసతి గృహాలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల డైట్ చార్జీలను 40% కాస్మోటిక్ ఛార్జీలు 200 శాతం పెంచామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి ఉచితంగా ప్రపంచ స్థాయిని విద్యను అందించేందుకు ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో ఒక్కో పాఠశాలను 200 కోట్లతో నిర్మిస్తున్నామని రాష్ట్రంలో ఒకేసారి 14 పాఠశాలల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశామని డిప్యూటీ సీఎం వివరించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మీ సమస్య పరిష్కరించకుంటే స్థానిక ఎన్నికలు బహిష్కరించండి

సమస్య ఢిల్లీకి వెళ్తుంది. అసెంబ్లీలో మాకు మైక్ ఇవ్వట్లేదు. మైక్ ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం భయపడుతోంది. కత్తి వాళ్ల చేతిలో పెట్టారు.. మమ్మల్ని యుద్ధం చేయమంటున్నారు. కాంగ్రెస్ నేతల భూముల్లో రోడ్డు వెళ్లకుండా అలైన్‌మెంట్ మార్చడం కొత్తేంకాదు. గతంలో ఔటర్ రింగ్ రోడ్డు వేసినప్పుడు కూడా అష్ట వంకర్లు తిప్పారు. గతంలో ఓఆర్ఆర్‌కు భూసేకరణ సమయంలో భూమికి బదులు భూమి ఇచ్చారు. ట్రిపుల్ ఆర్ వల్ల భూమి కోల్పోతున్న రైతులకు భూమి కావాలంటే పోరాటం చేయొచ్చు. అలైన్‌మెంట్ శాస్త్రీయంగా ఉండాలని ఉద్యమం చేద్దాం" అని కేటీఆర్ అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు జగదీశ్‌రెడ్డి, కర్నె ప్రభాకర్ పాల్గొన్నారు

**హైడ్రా బుల్డోజర్ పేదల ఇళ్లపైకే వెళ్తుంది..**

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చివేస్తోందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెలవు రోజుల్లో కూల్చివేతలు వద్దని హైకోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. కానీ ఆదివారం సెలవురోజునే గాజులరామారంలో పేదల ఇళ్లు కూల్చారని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే.. బుల్డోజర్ రాజ్యానికి లైసెన్స్ ఇచ్చినట్లే అని వ్యాఖ్యానించారు. హైడ్రా బుల్డోజర్ పేదల ఇళ్లపైకే వెళ్తుందని.. పెద్దల ఇళ్లకు వెళ్లదన్నారు."భారత రాష్ట్ర సమితి కార్యకర్త సర్దార్ ఇంటిని ప్రభుత్వం కూల్చివేసింది. ఆయనకు మళ్లీ ఇల్లు నిర్మించి ఇచ్చే బాధ్యత నాది. నిన్న మోదీ హెచ్1 బీ వీసా గురించి మాట్లాడతారని ఆశించాం. దాని గురించి మాట్లాడకుండా జీఎస్టీ పండగ అని చెప్పారు. నిన్నటి వరకు రక్తం తాగి.. ఇప్పుడు పండగ చేసుకో అంటున్నారు. జీఎస్టీ పేరు మీద 8 ఏళ్ల పాటు ప్రజల నుంచి ఎంతో భారం వేశారు. మోదీ గతంలో చెప్పినట్లు ప్రజలందరికీ రూ.15 లక్షలు ఇస్తే పండగ చేసుకుంటాం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## ఊహాజనిత కథనాలు దురదృష్టకరం

దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్లపై స్పందన తెలియజేయాలంటూ కేంద్రం, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్, ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో కు నోటీసులు ఇచ్చింది. జూన్ నెలలో అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. విమానం టేకాఫ్ అయ్యాక సెకన్ల వ్యవధిలో ఇంధన కంట్రోల్ స్విచ్‌లు ఆగిపోయినట్లు- ఏఏఐబీ నివేదికను సమర్పించింది. ఆ స్విచ్ ఎందుకు ఆఫ్ చేశావని ఒక పైలట్.. మరో పైలట్‌ను ప్రశ్నించాడని రిపోర్ట్‌లో పేర్కొంది. తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చినట్లు తెలిపింది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని ఏఏఐబీ వెల్లడించింది. ఈ రెండు స్విచ్‌లు ఒక సెకను తేడాతో ఒకదాని తర్వాత మరొకటి ఆగినట్లు- ఆ నివేదికలో వివరించింది. దర్యాప్తు కొనసాగుతోందని.. ప్రమాదానికి మూల కారణాలు, సిఫార్సులతో తుది నివేదికను విడుదల చేస్తామని తెలిపింది. ఆ తర్వాత అంతర్జాతీయ మీడియాలో వచ్చిన కథనాలు దిగ్భ్రాంతిని కలిగించాయి. ఎయిరిండియా విమానం పైలటే ఇంధన స్విచ్‌ను షట్‌డౌన్ చేశారంటూ ఊహాజనిత వార్తలు ప్రచురించాయి. దర్యాప్తు కొనసాగుతోన్న దశలో ఇటు- వంటి చర్యలు బాధ్యతారాహిత్యంతో కూడినవని అప్పట్లో ఏఏఐబీ ఖండించింది. ఈనేపథ్యంలో స్వతంత్ర దర్యాప్తు కోసం పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదించారు. అసలు ఏం జరిగిందో గుర్తించేందుకు ÷-లఫ్లైట్ డేటా రికార్డర్‌ను పరిశీలించేందుకు నిపుణులను అనుమతించాలని కోరారు. దీనిపై సుప్రీం ధర్మాసనం స్పందించింది

# తెలంగాణసాధనలో సింగరేణిది కీలకపాత్ర



కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులను సంస్థకు వచ్చిన లాభాల్లో భాగస్వామ్యం చేస్తోందని అన్నారు. ఒకప్పుడు సింగరేణి సంస్థ నష్టాల్లో కూరుకుపోయి మూతపడే దశలో ఉన్నప్పుడు కాకా వెంకటస్వామి కేంద్రంతో మాట్లాడి సంస్థను ఆదుకున్నారని అన్నారు. అప్పటి నుంచి వెనక్కి తిరిగి చూడకుండా లాభాల్లో నడుస్తుందని అన్నారు సీఎం రేవంత్. ఇప్పుడు సంస్థకు వచ్చిన లాభాల్లో కార్మికులకు వాటా ఇస్తూనే.. కార్మికుల భవిష్యత్తు కోసం చర్యలు చేపట్టామని అన్నారు. కార్మికులకు పండగ బోనస్ తో పాటు- భవిష్యత్ పెట్టు-బడుల కోసం కూడా నిధులు కేటాయిస్తున్నామని అన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కూడా పండగ బోనస్ ఇస్తున్నామని తెలిపారు సీఎం రేవంత్. సింగరేణి సంస్థ కార్పొరేట్ సంస్థలతో పోటీ పడి ఎదగాలని ఆకాంక్షించారు సీఎం రేవంత్.

**సింగరేణి ఓ ఉద్యోగాల గని: భట్టి**

హైదరాబాద్(జనంసాక్షి):సింగరేణి సంస్థ బొగ్గు గని మాత్రమే కాదని, అది ఒక ఉద్యోగ గని అని డిప్యూటి సిఎం భట్టివిక్రమార్క తెలిపారు. సింగరేణి సంస్థ రాష్ట్రప్రభుత్వానికి ఆత్మవంటిదని అన్నారు. సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటించిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణి సంస్థను జాగ్రత్తగా నడుపుతున్న కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న సింగరేణి యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. సింగరేణి సంస్థలో అన్ని రకాల ఉద్యోగులు కలిసి 71 వేల మంది ఉన్నారని, రాష్ట్రప్రభుత్వం, సింగరేణి సంస్థ కలిసి గొప్ప నిర్ణయం తీసుకున్నాయని అన్నారు. సింగరేణి లాభాల్లో కొంత మొత్తాన్ని ఉద్యోగులకు పంపిణీ చేయాలని నిర్ణయించామని, గత పదేళ్లుగా సింగరేణి సంస్థ కొత్త బ్లాక్ లకు వేలంలో పాల్గొనలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి లాభాల్లో 34 శాతాన్ని కార్మికులకు పంచాలని నిర్ణయం తీసుకున్నామని, ఒక్కో కార్మికుడికి బోనస్ రూ. 1,95,610 పంపిణీ జరుగుతుందని అన్నారు. మొత్తంగా రూ. 819 కోట్లను సింగరేణి కార్మికులకు పంపిణీ చేస్తామని, సింగరేణి సంస్థ మొత్తంగా రూ.6,394 కోట్లు- ఆర్జించిందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## జాతీయ రహదారుల నిర్మాణంలో జాప్యం చేయొద్దు

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ, పరిహారం పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. భూ సేకరణ విషయంలో మానవీయ కోణంలో వ్యవరించాలని... అదే సమయంలో రహదారుల నిర్మాణంతో కలిగే లాభాలను రైతులకు వివరించి ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. ఆర్బిట్రేషన్ కేసులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం.. అనుమతుల జారీ, నూతన ప్రతిపాదనలకు ఆమోదం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ), జాతీయ రహదారుల విభాగం (ఎన్‌హెచ్), జాతీయ రహదారులు, రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ (మోర్త్), రహదారులు, భవనాల శాఖ, అటవీ శాఖ అధికారులతో సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారులకు నెంబర్ల కేటాయింపు... సూత్రప్రాయ అంగీకారం తెలుపుతున్నా... తర్వాత ప్రక్రియలో ఆలస్యంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు.. చిన్న చిన్న కారణాలతో పలు రహదారుల పనుల్లో జాప్యం వాటిల్లుతుండడం సరికాదని.. వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు సీఎం సూచించారు. భూ సేకరణను వేగవంతం చేసి పరిహారం తక్షణమే అందేలా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని సూచించారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) నార్త్ నిర్మాణానికి సంబంధించి కేంద్రం లేవనెత్తిన ప్రతి సందేహాన్ని తాము నివృత్తి చేస్తున్నా ఎప్పటికప్పుడు కొత్త సమస్యలను ఎందుకు లేవనెత్తుతున్నారంటూ ఎన్‌హెచ్ఏఐ అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. సందేహాలన్నింటిని ఒకే సారి పంపాలని అధికారులకు సూచించారు.. ఆ అంశంపై తాము చర్చించుకున్నామని... ఎటువంటి సందేహాలు లేవని, ఏవైనా ఉంటే వెంటనే పంపుతామని ఎన్‌హెచ్ఏఐ అధికారులు సీఎంకు తెలియజేశారు. ఆర్ఆర్ఆర్ నార్త్.. సౌత్‌ను రెండు వేర్వేరు ప్రాజెక్టులుగా చూడవద్దని... సౌత్‌కు కూడా నార్త్‌కు ఇచ్చిన నెంబర్‌ను కొనసాగించాలని...వెంటనే అనుమతులు మంజూరు చేసి ఏకకాలంలో రెండింటి పనులు ప్రారంభమయ్యేందుకు సహకరించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులకు సీఎం సూచించారు. అందుకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు సుముఖత వ్యక్తం చేశారు. ఆర్ఆర్ఆర్ సౌత్ అలైన్‌మెంట్‌కు వెంటనే ఆమోదముద్ర వేయాని సీఎం కోరారు... భారత్ ఫ్యూచర్ సిటీ-అమరావతి-మచిలీపట్నం 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవేకు వెంటనే అనుమతులు ఇవ్వాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

## సింగరేణి కార్మికుకలు దసరా బొనాంజా

**భూపాలపల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** సింగరేణి సంస్థ 2024-25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన నికర లాభాలలో సింగరేణి ఉద్యోగులకు 34% లాభాల వాటా బోనస్ చెల్లిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో రూ.6,394 కోట్ల రూపాయల నికర లాభాలు సాధించగా, దీనిలో సింగరేణి సంస్థ చేపట్టే కొత్త ప్రాజెక్టుల కోసం రూ. 4,304 కోట్లను కేటాయించడం జరిగిందని, మిగిలిన రూ.2,360 కోట్లు నికర లాభాల్లో 34 శాతం సొమ్ము అనగా రూ. 819 కోట్ల రూపాయలను లాభాల వాటా బోనస్ గా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. సింగరేణిలోని సుమారు 41,000 మంది కార్మికులకు 34% లాభాల బోనస్ కింద ఒక్కొక్కరికి సగటున రూ.1,95,610 వరకు లభిస్తాయి. గత ఏడాదితో పోల్చితే సగటున ఒక్కో ఉద్యోగికి 4.4 శాతం అదనంగా రూ.8,289 మేర లాభాల బోనస్ లభించనుండటం విశేషం. గత ఏడాది సగటున ఒక్కో కార్మికుడి రూ.1,87,321 లాభాల బోనస్ చెల్లించడం జరిగింది. అలాగే సింగరేణి సంస్థలో పనిచేస్తున్న మరో 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు ఈ ఏడాది రూ.5,500 బోనస్ ను కూడా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది కాంట్రాక్టు కార్మికులకు సింగరేణి చరిత్రలో తొలిసారిగా 5,000 రూపాయల బోనస్ ను ప్రజా ప్రభుత్వం చెల్లించిందని పేర్కొన్నారు.

## వీధి వ్యాపారులకు ప్రత్యేక వెండింగ్ జోన్స్

హైదరాబాద్(జనంసాక్షి):వీధి వ్యాపారుల కోసం ప్రత్యేక వెండింగ్ జోన్స్‌ను ఏర్పాటు- చేయాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. మల్టీ స్టోరేజ్ బిల్డింగ్స్, ఫైర్ సేఫ్టీ అంశాలపై పలు సూచనలు చేశారు ముఖ్యమంత్రి. వీధి దీపాలకు సోలార్ విద్యుత్ వినియోగం, కొత్తగా పునరుద్ధరిస్తున్న చెరువుల వద్ద పైలట్ ప్రాజెక్టుగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు- అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు.

## నేడు సీఎం రేవంత్ మేడారం పర్యటన

ములుగు(జనంసాక్షి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం మేడారం సందర్శించనున్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో పంచాయితి రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క మేడారంలో అభివృద్ధి పనులను పరిశీలించారు. తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క సారలమ్మ తల్లులను మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్, ఎస్పి షబరిష్ లతో కలిసి దర్శించుకున్నారు. మంగళవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సమ్మక్క సారలమ్మ దేవాలయాన్ని సందర్శించనున్న నేపథ్యంలో పర్యాటక పనులను మంత్రి సీతక్క పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు, దిశా నిర్దేశర చేశారు. ఈ సమావేశంలో ఎ ఎస్ పి శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ- చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్ డిఒ వెంకటేష్, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గరావు, ఇఒ వీరస్వామి, ఎ పి ఓ వసంత రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు. సిఎం రేవంత్ పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు భారీ ఏర్పాట్లు- చేస్తున్నారు. మేడారం మహాజాతరకు సంబంధించిన పనులకు శంకుస్థాపన, గద్దెల మార్పుపై ఫైనల్ డిజైన్ విడుదల వంటి కీలక కార్యక్రమాలు ఈ సందర్శనలో భాగంగా ఉన్నాయి. మంత్రి సీతక్క ఈ సందర్భంగా పలు శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం పర్యటనలో ఎలాంటి లోటు-పాట్లు- లేకుండా చూడాలని, ప్రతి విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పర్యటన సజావుగా సాగేలా భద్రత, రవాణా, ఇతర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి హెలికాప్టర్ ద్వారా మేడారం చేరుకోనున్నారు. ఆయన తొలుత సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకుని, ఆ తర్వాత మేడారం మహాజాతరకు సంబంధించిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అదే సమయంలో, గద్దెల మార్పుకు సంబంధించిన ఫైనల్ డిజైన్‌ను కూడా విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమం మేడారం జాతరకు కొత్త ఒరవడిని అందించనుంది. మేడారం జాతర తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలుస్తుంది. సీఎం పర్యటన ఈ ప్రాంతంలో అభివృద్ధి, సాంస్కృతిక వారసత్వ సంరక్షణకు ఊతమిస్తుందని స్థానికులు ఆశిస్తున్నారు. ఈ సందర్భంగా జరిగే కార్యక్రమాలు రాష్ట్రంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటకాన్ని మరింత ప్రోత్సహించే అవకాశం ఉంది.

## టీజీపీఎస్సీ సభ్యులుగా మరో ముగ్గురి నియామకం

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు కొత్తగా మరో ముగ్గురు సభ్యులు నియమితులయ్యారు. సి.చంద్రకాంత్ రెడ్డి, ఐపీఎస్ అధికారి విశ్వప్రసాద్, ప్రొఫెసర్ ఎల్.బి లక్ష్మీకాంత్ రాథోడ్‌లను టీజీపీఎస్సీ నూతన సభ్యులుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరి నియామకానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపినట్లు సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ముగ్గురు సభ్యులు ఆరేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారని తెలిపారు.

**ఓటుకు నోటు కేసులో సుప్రీంలో ముగిసిన విచారణ**

## తీర్పు రిజర్వు..

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 22(జనంసాక్షి): ఓటుకు నోటు కేసు కేసుపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరిపి, తీర్పును రిజర్వు చేసింది. రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసులో నాలుగో నిందితునిగా ఉన్న జెరూసలెం మత్తయ్యపై నమోదైన ఎఫ్ఐఆర్ ను కొట్టివేస్తూ కొన్ని రోజుల క్రితం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. దీనిని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ఎఫ్ఐఆర్‌లో, ఛార్జిషీట్ లో నాలుగో నిందితునిగా ఉన్న జెరూసలెం మత్తయ్యపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాది మేనకా గురుస్వామి కోర్టుకు వెల్లడించారు. కేసు ప్రాథమిక దశలోనే నిందితునిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసిందని చెప్పారు. కేసులో కీలక నిందితునిగా ఉన్న జెరూసలెం మత్తయ్యపై ఎఫ్ఐఆర్ కొట్టి వేయటం మొత్తం దర్యాప్తుపై ప్రభావం చూపుతుందన్నారు. కోర్టు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేసి దర్యాప్తు కొనసాగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కాగా, జెరూసలెం మత్తయ్య తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ హైకోర్టు అన్ని అంశాలను పరిశీలించిన తరువాతే ఉత్తర్వులు ఇచ్చిందని వెల్లడించారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్.గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం దీనిపై తీర్పును రిజర్వ్ చేసింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేసులో సిఎం ఉన్నా నిందితునిపై నమోదైన ఎఫ్ఐఆర్ కొట్టి వేయటాన్ని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేయటం అభినందనీయ మన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాది మేనకా గురుస్వామి స్పందిస్తూ అది రాష్ట్ర ప్రభుత్వనికి ఉన్న నిబద్ధత అని పేర్కొన్నారు.

## స్వదేశీ ఉత్పత్తులే కొనండి

భారతీయులు ... 2.5 లక్షల కోట్లు- ఆదా అవుతుందన్నారు. ప్రధాని దీనిని 'బచత్ ఉత్సవ్' గా అభివర్ణించారు. తగ్గిన జీఎస్టీ రేట్లు- పేదలకు, మధ్యతరగతికి గొప్ప ఉపశమనం కలిగిస్తాయని చెప్పారు. ఈ సంస్కరణలతో యువత, రైతులు, మహిళలు, దుకాణదారులు, వ్యాపారులు, వ్యవస్థాపకులు అందరూ గొప్ప ప్రయోజనం పొందుతారని అన్నారు. పండుగ సీజన్‌లో జీఎస్టీ తగ్గింపు అనేది ప్రజలకు మరింత ఆదా అవుతుందన్నారు. కొత్త జీఎస్టీ విధానం మధ్యతరహా, చిన్న వ్యాపారాలపై చూపే సానుకూల ప్రభావాన్ని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. ఇది పోటీ-తత్వాన్ని, ఆర్థిక వ్యవస్థను పెంచుతుందని అన్నారు.

# సమ్మక్క సాగర్ ప్రాజెక్టు ఛత్తీస్‌గఢ్ అంగీకారం

రిజర్వాయర్ లెవల్ వద్ద 6.7 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో రూపకల్పన చేయబడిన ఈ ప్రాజెక్టు, ఇంద్రావతి సంగమం దిగువన గోదావరి నదిపై ఉందని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా బీడు మరియు ఫ్లోరైడ్ ప్రభావిత జిల్లాలైన నల్గొండ, వరంగల్‌లోని నీటి అత్యవసర అవసరాలను తీర్చేందుకు ఈ ప్రాజెక్టు రూపొందించబడిందని ఆయన వివరించారు. తాగునీటి కొరతను మాత్రమే కాకుండా భారీ స్థాయిలో సాగునీటి ప్రయోజనాలను కూడా ఈ ప్రాజెక్టు అందిస్తుందని ఆయన చెప్పారు.ప్రాజెక్టు ప్రణాళికల ప్రకారం, సమ్మక్కసాగర్ ప్రాజెక్టు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద 1.78 లక్షల హెక్టార్ల ఆయకట్టును స్థిరపరుస్తుంది మరియు రామప్ప - పాకాల లింక్ కెనాల్ కింద 12,146 హెక్టార్ల కొత్త ఆయకట్టును సృష్టిస్తుంది. ఈ అదనపు సాగునీటి సామర్థ్యం వరంగల్, సూర్యాపేట, మహబూబాబాద్, జనగామ ఖమ్మం జిల్లాలు మరియు నల్గొండకు లాభపడుతుంది. రైతులు సుదీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న అనిశ్చిత పరిస్థితులకు ఇది పరిష్కారం అవుతుందని మంత్రి తెలిపారు.తాగునీటి అంశాన్ని కూడా ప్రస్తావిస్తూ, నల్గొండ మరియు వరంగల్‌లోని కొన్ని ప్రాంతాలు అధిక ఫ్లోరైడ్ కారణంగా భూగర్భజల కలుషితం వల్ల చాలా కాలంగా ప్రభావితమవుతున్నాయని తెలిపారు. భూగర్భజలంపై ఆధారపడడం తగ్గించడానికి గోదావరి ఆధారిత సురక్షితమైన నీటిని అందించడానికి సమ్మక్కసాగర్ ప్రాజెక్టు రూపకల్పన చేయబడిందని ఆయన అన్నారు. సాగునీరు మరియు తాగునీటి అవసరాలను ఒకే సమయంలో తీర్చడం ద్వారా తెలంగాణలోలక్షలాది మందికి ఈ ప్రాజెక్టు ప్రాణాధారంగా మారుతుందని భావిస్తున్నారు.బ్యారేజ్‌తో పాటు ప్రాజెక్టులో విస్తృత సహాయక మౌలిక వసతులు ఉన్నాయి. కమాండ్ ప్రాంతాలకు నీటిని తరలించడానికి యాక్సెస్ ఛానెళ్ళు మరియు గ్రావిటీ కెనాల్స్ ఉండేలా ప్రణాళిక చేశారు. భారీ పరిమాణంలో నీటి ప్రవాహాన్ని నిర్వహించడానికి మూడు పంప్ హౌస్‌లు మరియు డెలివరీ సిస్టర్న్లు కూడా ఉన్నాయి. దాదాపు 90 కిలోమీటర్ల టన్నెల్ నెట్‌వర్క్, ఇది నాలుగు టన్నెల్‌లుగా విభజించబడింది, ఒక్కోటి 8 మీటర్ల వ్యాసంతో, 182 క్యూమెక్స్ ప్రవాహ సామర్థ్యాన్ని సరఫరా చేస్తుంది. ఈ టన్నెల్‌లు, క్రాస్ డ్రైనేజ్ పనులు, నియంత్రణలు కాలువలపై రోడ్డు వంతెనలు ప్రాజెక్టు ఇంజనీరింగ్ రూపకల్పనకు వెన్నెముకగా నిలుస్తాయి.తెలంగాణ విస్తృతంగా లాభపడినా కూడా ప్రాజెక్టు బ్యాక్ వాటర్స్ ఛత్తీస్‌గఢ్‌లోని బిజాపూర్ జిల్లాలోని భూపాలపట్నం తహసీల్‌లోకి విస్తరించి ముంపు కలిగిస్తుందని అంగీకరించారు. సుమారు 13.06 హెక్టార్ల భూమి, 54.03 హెక్టార్ల నది ప్రాంతం మరియు 6.35 హెక్టార్ల నాళా భూమి ప్రభావితమవుతుందని ఆయన వివరించారు. ఈ ప్రభా వంపై ఛత్తీస్‌గఢ్ ఇప్పటికే తన ఆందోళనలను వ్యక్తపరిచిందని ఆయన గుర్తు చేశారు. ఈ ఆందోళనలను తెలంగాణ గుర్తించి, తదనుగుణంగా వ్యవహరించిందని తెలిపారు. ముంపునకు సంబంధించిన అన్ని ఖర్చులను, ఛత్తీస్ గఢ్ పరిధిలోని భూసేకరణ పునరావాసాన్ని తెలంగాణ ఇప్పటికే భరించడానికి అంగీకారం తెలిపిందని ఆయన గుర్తు చేశారు. పరిహారం మరియు పునరా వాసం యొక్క అంచనా ఖర్చుల వివరాలను పొందడా నికి రాష్ట్రం అనేక సందర్భాల్లో ఛత్తీస్‌గఢ్‌తో సంప్ర దింపులు జరిపిందని తెలిపారు. ముంపును అధ్యయనం చేయడానికి ఛత్తీస్‌గఢ్ ఐఐటీ ఖరగ్‌పూ ర్‌ను నియమించిందని, ఆ అధ్యయన ఫలితాలను అంగీకరించి అమలు చేయడానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు.

## కేటీఆర్‌కు క్షమాపణలు చెప్పడం కూడా అనవసరం

హైదరాబాద్,సెప్టెంబర్ 22(జనంసాక్షి)

కేటీఆర్ వేసిన పరువు నష్టం బండి కౌంటర్ దాఖలు చేశారు. బండి సంజయ్ కుమార్ కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొన్న ప్రధాన అంశాలు.. తాను చేసిన వ్యాఖ్యలు ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయిన నిందితులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఉన్నాయని బండి సంజయ్ పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటు-ంబ సభ్యుల కోసం ఫోన్‌లు ట్యాప్ చేయబడ్డాయని నిందితులు ఒప్పుకున్నారని అఫిడవిట్‌లో తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో కేటీ-ఆర్ పాత్ర గురించి తనకు తెలియదని బండి సంజయ్ పేర్కొన్నారు. కేటీఆర్ తెలంగాణను అత్యంత సంపన్న రాష్ట్రంగా మార్చారన్న పిటిషనర్ వాదనను ఆయన తోసిపుచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో వ్యవసాయం, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో అవకతవకలు జరిగాయని బండి సంజయ్ ఆరోపించారు. 2014 నుండి 2023 నవంబర్ వరకు రాష్ట్ర అప్పులు భారీగా పెరిగాయని, అలాగే పెండింగ్ బిల్లులు కూడా పెరిగాయని ఆయన తెలిపారు. ఈ కేసులో కోర్టు ఇంజంక్షన్ మంజూరు చేస్తే, అది వాక్ స్వాతంత్ర్యానికి భంగం కలిగిస్తుందని బండి సంజయ్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడినందుకు తన భావ ప్రకటన స్వేచ్ఛను అడ్డుకోవడం సరికాదని ఆయన వాదించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుమారుడు కేటీ-ఆర్ ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసి ప్రతిపక్ష నాయకులు, న్యాయమూర్తులు, వ్యాపారవేత్తల ఫోన్‌లను ట్యాప్ చేయడానికి ఆదేశించారని బండి సంజయ్ ఆరోపించారు. కేటీ-ఆర్ కోరిన రూ. 10 కోట్లు- చెల్లించాల్సిన అవసరం లేదని బండి సంజయ్ అన్నారు. తాను చేసిన వ్యాఖ్యలు నిందితుల వాంగ్మూలం, ప్రభుత్వ పబ్లిక్ డాక్యుమెంట్ల ఆధారంగా ఉన్నందున క్షమాపణలు చెప్పడానికి కూడా నిరాకరించారు.

## హైదరాబాద్‌లో మరోసారి కుంభవృష్టి

ఆ తర్వాత అవి జోరువానగా మారాయి. దీంతో ఎక్కడిక్కడ నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ట్రాఫిక్ చిక్కుల్లో పడ్డారు. నగరంలో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలతోపాటు- అక్కడక్కడా జోరు వాన కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. బేగంపేట, సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. వర్షాల నేపథ్యంలో ముందస్తు హెచ్చరికలతోపాటు- జీహెచ్ఎంసీ, హైడ్రా, ట్రాఫిక్ సిబ్బందిని ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ఎల్బీనగర్, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్‌లో భారీగా వర్షం పడింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్, మణికొండ, గచ్చిబౌలి, హై-టె-క్ సిటీ-, నానక్ రామ్ గూడలో జోరువాన కురిసింది. రాం నగర్, అమీర్‌పేట్, ఎర్రగడ్డ, బోరబండ, యూసఫ్‌గూడ, సనత్‌నగర్, మూసాపేట్‌లోనూ వర్షం దంచికొట్టింది. కూకట్‌పల్లి, కేబీహెచ్‌బీ, మియాపూర్‌లోనూ ఇదే పరిస్థితి. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. వాహనదారులు తీవ్ర ఇక్కట్లు- పడ్డారు. పలు చోట్ల మ్యాన్ హోల్స్ పొంగిపొర్లాయి. అల్పపీడనం ప్రభావంతో హైదరాబాద్‌లో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట, ఖైరతాబాద్, ఎల్బీనగర్, పెద్దఅంబర్‌పేట తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులపై నీరు నిలిచింది. ఖైరతాబాద్-రాజ్‌భవన్ రోడ్డులో మోకాలి లోతు నీరు నిలిచి పోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అమీర్‌పేట, పంజాగుట్ట, ఖైరతాబాద్ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయింది. వరద నీరు నిలిచిన ప్రాంతాల్లో హైడ్రా, జీహెచ్ఎంసీ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

## ఆక్రమణదారులు ఎంతటివారైనా వదలం

తన సర్వీసులో విమర్శలు కొత్త కాదని.. తర్వాత రియలైజ్ అయిన ఘటనలున్నాయన్నారు. ఉదాహరణ 2007వ సంవత్సరం విజయవాడలో జరిగిన అయేషామీరా హత్య కేసులో నిందితుడిగా సత్యంబాబును గుర్తించడంతో పాటు.. నల్గొండ జిల్లాలో జరిగిన ప్రణయ్ పరువు హత్య కేసులో నిందితులకు శిక్ష పడేలా చేసిన దర్యాప్తులే ఇందుకు నిదర్శనమన్నారు. ఇప్పుడు హైడ్రా చర్యలు కాస్త కఠినంగా అనిపించినా.. నగర భవిష్యత్తు బాగుండాలంటే తప్పవని పేర్కొన్నారు. గొలుసుకట్టు చెరువులను, కాలువలను, ప్రభుత్వ భూములను కాపాడుకోలేకపోతే.. పర్యావరణం దెబ్బతింటుందని హెచ్చరించారు. ఔటర్ రింగు రోడ్డు పరిధిలో 923.14 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడినట్టు హైడ్రాకమిషనర్ రంగనాథ్ చెప్పారు. దీని విలువ రూ. 50 వేల కోట్ల వరకూ ఉంటుందని అంచనా. ఈ నెల 21న గాజుల రామారం, ప్రగతినగర్ మధ్యన 317 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాం. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్‌కు చెందిన ఈ భూమి కబ్జాలకు గురౌతుంటే.. స్థానికుల ఫిర్యాదుమేరకు విచారణ జరిపి.. ఆదివారం నాడు కబ్జాలను తొలగించాం. ప్రగతినగర్‌వైపు బడాబాబులు కబ్జాలుంటే.. పదుల ఎకరాల్లో వెంచర్లను తొలగించి ప్రభుత్వ భూమిని కాపాడాం. ఇలా ఇప్పటి వరకూ 581 ఆక్రమణలను తొలగించాం. ఇందులో బడాబాబుల కబ్జాలే ఎక్కువగా ఉన్నాయి. గండిపేటలో ప్రముఖ రాజకీయనాయకుల రిసార్టులు, ప్లే ఏరియాలు తొలగించాం. మూసీ నది ప్రవాహంపై ప్రభావం పడే విధంగా ఉన్న ఆక్రమణలు భారీ మొత్తంలో తొలగించాం. ఇందులో ప్రభుత్వ భూములు 424 ఎకరాలు కాగా.. నాలాలు, రహదారులు, పార్కులు, చెరువులు, అనుమతులు లేని నిర్మాణాలు వెలిసిన చోట తొలగించిన ఆక్రమణలు కలిపితే మొత్తం 923.14 ఎకరాల భూమిని కాపాడామని చెప్పారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 22(జనంసాక్షి) :** సోమవారం ఎస్ఎస్ తాడ్వాయి మండలం లోని మేడారం సమ్మక్క సారలమ్మ తల్లుల ను రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, ఎస్పీ షభరిష్ లతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సమ్మక్క సారలమ్మ దేవాలయంను సందర్శించనున్న నేపద్యం లో చేపట్టుతున్న పనులను మంత్రి సీతక్క పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు, దిశా నిర్దేశించారు. మేడారంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికార యంత్రాంగంతో పాటు సమ్మక్క సారలమ్మల పూజారులతో సమీక్ష చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రతి విభాగానికి మార్గనిర్దేశం చేస్తూ, చేపట్టాల్సిన పనులపై ఆదేశాలు ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో చేయాల్సిన మార్పులపై పూజారుల అభిప్రాయాలను తెలుసుకుంటూ, వారి సూచనలను అధికారులు అనుసరించేలా చర్యలు చేపట్టారు. అనంతరం అభివృద్ధి పనులు వేగవంతమవుతాయని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్డీఓ వెంకటేష్, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గరావు, ఈఓ వీరస్వామి, ఏపిఓ వసంత రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి లబ్దిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్



**మంచిర్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి అందేలా అధికార యంత్రాంగం సమన్వయంతో చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు పట్టణంలోని శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జైపూర్ ఎ.సి.పి. వెంకటేశ్వర్లు, తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి అందించడం జరుగుతుందని తెలిపారు. నిరుపేద ప్రజలకు గూడు కల్పించే ఉద్దేశంతో రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3 వేల 500 ఇందిరమ్మ ఇండ్లు చొప్పున అందించడం జరుగుతుందని, డిసెంబర్ - 2025 తరువాత చెన్నూర్ నియోజకవర్గానికి 3 వేల 500 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించి అర్హత గల లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అర్హత కలిగి ఉండి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కానీ వారు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. విద్యావ్యవస్థను పటిష్టపరిచే చర్యలలో భాగంగా జిల్లాలోని సోమనపల్లి గ్రామంలో 200 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేయడం జరుగుతుందని, అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించి నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. చెన్నూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను 2 కోట్ల 20 లక్షల రూపాయలతో అభివృద్ధి చేయడంతో పాటు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డి.ఎం.ఎఫ్.టి./ సి.ఎస్.ఆర్. క్రింద 1 కోటి రూపాయలు మంజూరు చేసి అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. విద్యావ్యవస్థ బలోపేతం చేసే దిశగా దాదాపు 10 వేల మంది నిష్ణాతులైన ఉపాధ్యాయులను భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని, ఈ విద్య సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గం పరిధిలోని పాత ప్రభుత్వ పాఠశాల భవనాలను గుర్తించి అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెన్నూరు పట్టణంలో 6 పడకలుగా ఉన్న డయాలసిస్ సెంటర్ ను 10 పడకలుగా అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామాలకు 20 లక్షల రూపాయల నుండి 30 లక్షల రూపాయల వరకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం 500 రూపాయలకే రాయితీ గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, 10 లక్షల రూపాయల పరిమితితో రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయనిది, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి అందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మండలంలోని 78 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ముదిరాజ్ కులాన్ని బీసీ-ఏ గ్రూప్‌లోకి మార్చండి

- మంత్రి వాకిటి శ్రీహరికి విన్నపం

**మంచిర్యాల ప్రతినిధి , సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** ముదిరాజ్ కులాన్ని బిసి డి గ్రూప్ లో నుండి ఏ గ్రూప్ లోకి మార్చాలని మంత్రి వాకిటి శ్రీహరికి ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి దబ్బెట తిరుపతి విన్నవించారు. సోమవారం హైదరాబాద్‌లో మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి ముదిరాజ్ సమస్యలపై విన్నవించినట్లు తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వడ్డీ లేని రుణాలు అందించాలని కోరారు. గ్రామీణ ప్రాంత ముదిరాజ్ లకు చేపల చెరువులు కేటాయించాలని విన్నవించారు. జిల్లాలో మహాసభకు సహకరించాలని కోరారు.

## కోవర్ట్ ఆపరేషన్‌లో భాగమే కేంద్ర కమిటీ సభ్యుల హత్య

- పౌర హక్కుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** కోవర్ట్ ఆపరేషన్‌లో భాగంగానే కేంద్ర కమిటీ సభ్యుల హత్య జరిగిందని పౌర హక్కుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు ఆరోపించారు. చత్తీస్ ఘడ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలోని ఆభుజ్ మాడు అడవుల్లో 20 సెప్టెంబర్ నాడు జరిగిందని చెప్పబడుతున్న ఎన్‌కౌంటర్లో ఇద్దరు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చనిపోయారని వార్తలు వచ్చాయని, కట్ట రామచంద్రారెడ్డి అలియాస్ రాజు, కడారి సత్యనారాయణ రెడ్డి అలియాస్ కోస మృతి చెందినట్లు చత్తీస్‌ఘడ్ పోలీసులు ప్రకటించారని, ఈ ఎన్కౌంటర్ నిర్ద్వందంగా ప్రకటించారు. కేంద్ర కమిటీ సభ్యులు సాధారణంగా పటిష్టమైన గార్డుల రక్షణ వలయంలో ఉంటారని, వీరు చనిపోయారంటే రక్షణగా నిలిచిన గార్డులు కూడా మృత్యువాత పడాలని, రక్షణ వలయానికి సంబంధించిన సమాచారం పోలీసులు ప్రకటించలేదని తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్ కచ్చితంగా కోవర్ట్ ఆపరేషన్ లో భాగంగా జరిగినట్లుగా అర్థమవుతున్నదని, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో అనైతిక యుద్ధం గత 21 నెలలుగా కొనసాగిస్తున్నది. ఈ యుద్ధాన్ని వెంటనే నిలిపివేసి ప్రజా సమస్యల పరిష్కారం పైన దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఆదివాసీల జీవితాలతో చెలగాటమాడటం కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని, దండకారణ్యంలో మోహరించిన అన్ని రకాల బలగాలను వెంటనే ఉపసంహరించాలని, ఈ ఎన్కౌంటర్ పైన న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ రూరల్, సెప్టెంబర్ 22(జనం సాక్షి) :** జిల్లాలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బతుకమ్మ పండుగ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నవరాత్రుల్లో ప్రతి రోజు బతుకమ్మ వేడుకలు వైభవంగా జరగాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమ తమ కార్యాలయాల్లో సంప్రదాయ బద్ధంగా బతుకమ్మ పండుగ జరపాలని, సద్దుల బతుకమ్మ రోజున ఊరేగింపులో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. విద్యార్థులలో రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాలపై అవగాహన పెంచేందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించి,విజేతలకు బహుమతులు అందజేయాలని ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బతుకమ్మ సంబరాలు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువుల వద్ద బతుకమ్మ నిమజ్జనం ప్రాంతాల్లో లైటింగ్,పారిశుద్ధ్యం,భద్రతా చర్యలు మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పట్టణంలో సద్దుల బతుకమ్మను నిర్వహించేందుకు ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'పోషణ మాసం'కు సంబంధించిన గోడ ప్రతిని అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆర్డీవో రత్నకళ్యాణి, డీఆర్డీవో విజయలక్ష్మి,డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి,డిపిఓ శ్రీనివాస్,డీఈఓ భోజన్న,డి పి ఆర్ ఓ విష్ణువర్ధన్,ఉద్యాన వన శాఖ అధికారి రమణ,మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్,డి.ఈ హరిభువన్,సిడిపిఓ సరిత, డాక్టర్ సురేష్,తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్ డైలీవేజ్ వర్కర్ల సమ్మె

- 11వ రోజు భిక్షాటన చేసి నిరసన
- మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేత
- సమస్యలు పరిష్కరిస్తామని సీతక్క హామీ



**ఏటూరు నాగారం, సెప్టెంబర్ 22(జనంసాక్షి) :** గిరిజన ఆశ్రమం పాఠశాలలు హాస్టల్ వర్కర్ల నిరవధిక సమ్మె 11 వ రోజు భిక్షాటన చేసి నిరసన తెలియజేశారు. ఇతర కార్యక్రమాల నిమిత్తం ఐటిడిఏ కు వచ్చిన మంత్రి సీతక్క ను కలిసి తమ జీతాలు తగ్గకుండా చూడాలని వేడుకుంటూ వినతి పత్రం అందజేశారు. స్పందించిన సీతక్క రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండి దావూద్, రత్నం రాజేందర్ మాట్లాడుతూ, ఇపుడు ఇస్తున్న వేతనాలు తగ్గించొద్దు అని వర్కర్లు సమ్మె చేస్తుంటే డైలీ వేజ్ వర్కర్లను ఔట్ సోర్సింగ్ చేయాలని అధికారులు ఫైల్ పుట్ అప్ చేశారని అన్నారు. దీనివల్ల ప్రైవేట్ ఏజెన్సీ లకు ప్రజా ధనం దోచిపెట్టడమే తప్ప కార్మికులకు ఒరిగేది ఏమీ లేదని అన్నారు. ఔట్ సోర్సింగ్ చేసే బదులు నల్లగొండ జిల్లాలో లో 20 మంది వర్కర్లకు టైమ్ స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నారని అదేవిధంగా ఇక్కడ కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే పాత పద్ధతి కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్రం ప్రభుత్వం వెంటనే స్పందించి వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో హాస్టల్ వర్కర్స్ నాయకులు ఎం నాగలక్ష్మి, జి విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి, కమల, జయలక్ష్మి, నాగమణి, సరోజన, లలిత, రాజు, సారబాబు, శాంతమ్మ, రాజమ్మ లతో పాటు సుమారు 140 మంది పాల్గొన్నారు.

## బతుకమ్మ ఆడుతూ గుండెపోటుతో మహిళ మృతి

- మృతురాలు కొత్తగూడ జనం సాక్షి రిపోర్టర్ పరశురాం భార్య



**మహబూబాబాద్ (జనం సాక్షి) :** బతుకమ్మ ఆడుతూ మహిళ గుండెపోటుతో కుప్పకూలింది. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెం గ్రామానికి చెందిన... జనం సాక్షి విలేఖరి శెట్టి పరశురాం భార్య శెట్టి మౌనిక ఉదయం నుండి ఇద్దరు కూతుర్లు. కొడుకుతో కలిసి ఎంతో ఆనందంతో తీరొక పూలను తెంపుకొచ్చి ఆపూలతో బతుకమ్మను పేర్చింది. సాయంకాలం సమయంలో స్థానిక దేవాలయంలో కుటుంబ సభ్యులతో ఎంగిలిపూల బతుకమ్మ సంబరాల్లో పాల్గొని పాటలు పాడుతూ కోలాటాలు వేస్తూ బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఒక్కసారిగా కుప్ప కూలిపోయింది.... దీంతో పరిస్థితి విషమంగా ఉండడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. దీంతో పండగ పూట ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## టేకులకుంట తండాలో పసిపాప మాయం!

- రూ.50 వేలకు విక్రయించినట్లు ప్రచారం...

**చెన్నారావుపేట, సెప్టెంబర్ 22 (జనం సాక్షి):** మూడు నెలల పసిపాప మాయమైన సంఘటన మండలంలోని టేకులకుంట తండాలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఇదే తండాకు చెందిన వాంకుడోతు యాకూబ్ భార్య మౌనిక జూలై 17న నర్సంపేట ఏరియా ఆసుపత్రిలో ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. వారం రోజుల తర్వాత ఆమెను పసిపాపతో సహా డిశ్చార్జ్ చేసుకొని కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకు వెళ్లారు. ఈనెల 18వ తేదీ నుండి పాప ఇంటి వద్ద కనిపించడం లేదు. ఈ విషయం స్థానిక అంగన్వాడీ టీచర్ వీరమ్మ కు తెలియడంతో దీక్షకుంట్ల క్లస్టర్ ఐసిడిఎస్ సూపర్వైజర్ హేమలతకు సమాచారం అందించింది. ఆమె టేకులకుంట తండా గ్రామానికి చేరుకుని సోమవారం తల్లి మౌనికను విచారణ చేపట్టింది. దీంతో నా భర్త యాకూబ్ రూ.50 వేలకు నా బిడ్డను అమ్మకం చేపట్టాడని ఒప్పుకున్నట్లు తెలిపింది. దీంతో ఐసిడిఎస్ సూపర్వైజర్ హేమలత టేకులకుంట తండాలో మూడు నెలల పసిపాప కనిపించడం లేదని ఆమె ఆచూకి కనుక్కొని అప్పగించాలని చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది.గతంలో వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. మూడవ సంతానంలో మళ్లీ పాప జన్మించడంతో అమ్మకం చేపట్టినట్లు ప్రచారం జోరుగా కొనసాగుతుంది.

## మనవాళలకు ఆటంకంగా మారిన అమెరికా విధానాలు

- కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంది: పొన్నం



**సిద్దిపేట, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** హుస్నాబాద్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో కుటుంబ సమేతంగా అమ్మవారిని మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్ట సుందరీకరణ, సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమెరికాతో దౌత్య సంబంధాల్లో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది అని ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా దేశానికి సంబంధించిన నియమ నిబంధనలు మనవాళ్లు చదువుకోవడానికి ఉద్యోగాలు చేయడానికి ఆటంకంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇక, మన దేశానికి సంబంధించి 100 మంది సీఈఓలు ఇతర దేశాల్లో ఉన్నారు అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వారి తెలివి తేటలను మన దేశంలో పెట్టాలని కోరుతున్నాను.. ఇక్కడి ప్రభుత్వాలు రెడ్ కార్పెట్ వేసి కంపెనీలకు స్వాగతం పలుకుతున్నాయి. ఇక, విదేశాల్లో ఉన్న తెలంగాణ వారంతా తెలంగాణలో పెట్టు-బడులు పెట్టాలి అని కోరారు. గ్రామీణ ప్రాంతాలను పారిశ్రామికంగా సాంకేతికంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను అని పొన్నం ప్రభాకర్ చెప్పారు.

## బస్ ఢీకొనడంతో గాయపడ్డ బైకర్

- వెంటనే ఆస్పత్రికి తరలించిన మంత్రి సీతక్క

**ములుగు, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** బైకును బస్సు ఢీకొట్టడంతో బైకు పైన ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఏటూరు నాగారం వెళ్తున్న బస్‌ని చిన్నబోయిన పల్లి నుంచి వస్తున్న బైకర్ ప్రమాదానికి గురయ్యారు. అయితే తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మ సన్నిధికి మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్లనున్నారు. దీంతో ఆ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క అనంతరం మంగపేట మండల పర్యటనకు వెళ్తున్న క్రమంలో గాయాలతో ఉన్న వ్యక్తిని చూశారు. వెంటనే దగ్గరుండి అతడిని హాస్పటల్‌కు పంపించి మానవత్వం చాటుకున్నారు.



## కొబ్బరి బోండాల లారీ బోల్తా

- బస్తాలు, సంచుల్లో బోండాలు ఎత్తుకెళ్లిన ప్రజలు

**సూర్యాపేట, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** సూర్యాపేటమండలం రాయన్నగూడ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. సోమవారం తెల్లవారుజామున నెల్లూరు నుంచి హైదరాబాద్‌కు కొబ్బరిబోండాల లోడుతో వెళ్తున్న లారీ జాతీయ రహదారిపై అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో రోడ్డుపై కొబ్బరిబోండాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. విషయం తెలుసుకున్న స్థానికులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కొబ్బరి బోండాల కోసం ఎగబడ్డారు. బస్తాలు, సంచుల్లో అందినకాడికి ఎత్తుకెళ్లారు. అటు-గా రోడ్డుపై కార్లలో వెళ్తున్న వారు కూడా కొబ్బరికాయలు తీసుకెళ్లారు. దీంతో సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని లారీ డ్రైవర్ వెల్లడించారు.

## పామాయిల్ ఫ్యాక్టరీ రైతుల జీవితాలకు గేమ్ ఛేంజర్

- నర్మెట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ మనకు ఎమోషన్
- ఎమ్మెల్సీలతో కలసి ఫ్యాక్టరీ సందర్శించిన హరీష్ రావు



**సిద్దిపేట, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** నర్మెట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ మనకు ఎమోషన్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీ రైతుల జీవితాలకు గేమ్ ఛేంజర్‌లాంటిదని తెలిపారు. 2018లో తేమ తక్కుందని ఆయిల్ పామ్ సాగుకు ఐఐఓపీఆర్ అనుమతి ఇవ్వలేదని, కాళేశ్వరం నీటితో ఎండల్లోనూ చెరువులు, చెక్ డ్యాములు మత్తళ్లు దుంకినయ్ అని.. భూముల్లో తేమశాతం పెరగడంతో ఆయిల్ పామ్‌కు అనుమతులు ఇచ్చారని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఏం చేయకుండానే ఇదంతా సాధ్యమైందా? అని హరీశ్ ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో హరీశ్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ శివారులోని పామాయిల్ ఫ్యాక్టరీలో ఉత్పత్తిని ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు వంటేరు ప్రతాపరెడ్డి, యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్‌తో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్మెట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ మనకు ఎమోషన్ అని.. ఈ ఫ్యాక్టరీ వేలాది మంది రైతుల జీవితాల్లో గుణాత్మక మార్పును తీసుకువస్తుందన్నారు. మనం చాలా ఫ్యాక్టరీలు చూస్తుంటామని.. కానీ, ఇది భిన్నమైందన్నారు. ఈ ప్రాంత రైతుల నవశకానికి ఈ ఫ్యాక్టరీ నాంది అని తెలిపారు. గాలిలో తేమ ఎక్కువ ఉన్న చోటనే పామాయిల్ పండుతుందని.. కేసీఆర్ కృషితో రాష్ట్రమంతా పామాయిల్‌కు అనుకూలంగా మారిందన్నారు. ఒక్కసారి పంట వేస్తే 30 సంవత్సరాల వరకు రైతుకు ఆదాయం వస్తుందన్న ఆయన.. ఉద్యోగులకు నెల రోజుకు జీతం వస్తే.. పామాయిల్ రైతులకు 20 రోజులకే డబ్బులు చేతికి అందుతాయన్నారు. ఇక్కడికి నీళ్లొచ్చినా.. ఆయిల్‌పామ్ సాగవుతున్నా అంతా కాళేశ్వరం పుణ్యమేనన్నారు. 2022 జూన్ 5న రామచంద్రాపూర్‌లోని మడుపు ఎల్లారెడ్డి పొలంలో మొదటి మొక్కతో నాంది పలికామని.. అందరినీ బ్రతిమాలి నాదే బాధ్యత అని భరోసా ఇస్తే పామాయిల్ సాగు చేశారని హరీశ్‌రావుకు గుర్తు చేశారు. చుట్టు-పక్కల ఐదు జిల్లాల రైతులకు ఈ ఫ్యాక్టరీతో ప్రయోజనం ఉంటు-ందన్నారు. మొక్కలు నాటి ఆయిల్‌పామ్ సాగు చేసి ఫ్యాక్టరీ పెట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. అత్యాధునిక -టె-క్నాలజీతో ఈ ఫ్యాక్టరీని నిర్మించామన్నారు. ఆ ఫ్యాక్టరీ ప్రారంభించేందుకు కాంగ్రెసోళ్లు జేబులో కత్తెర పెట్టు-కొని తిరుగుతున్నారని సె-టైర్లు వేశారు. మన ప్రభుత్వం ఉంటే ఏడాది ముందే ఫ్యాక్టరీ ప్రారంభమయ్యేదన్నారు. వంద టన్నుల ఆయిల్ పామ్ గెలలకు 19 టన్నుల పామాయిల్ వస్తుందని హరీశ్‌రావు తెలిపారు. గోద్రెజ్, పతంజలి సహా అనేక కంపెనీల ప్రతినిధులు ఈ ఫ్యాక్టరీని చూసిపోతున్నారన్నారు. రాష్ట్రంలో పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ పెట్టాలన్నది కేసీఆర్ సంకల్పమని.. రైతును రాజును చేసే పంట ఆయిల్ పామ్ సాగు అని తెలిపారు. ఎకరానికి లక్షన్నర రూపాయలు వచ్చే బంగారం లాంటి పంట ఆయిల్ పామ్ అని.. ఇందులో ఇంతర పంటగా కోకో సాగు చేస్తే మరో లక్ష ఆదాయం వస్తుందన్నారు. ఈ పంటలతో ఎకరానికి ఏడాదికి రూ.2.50లక్షల ఆదాయం వస్తుందని వివరించారు.

## అగ్రసేన్ మహారాజ్‌కు సిఎం నివాళి



**హైదరాబాద్, సెప్టెంబర్ 22(జనంసాక్షి) :** శ్రీ అగ్రసేన్ మహారాజ్ జయంతి సందర్భంగా..ఆయనకు సిఎం రేవంత్ రెడ్డి ఘనంగా నివాళి అర్పించారు. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఆ మహనీయుడి విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క,హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి,సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి,ఎం ఎల్ ఏ దానం నాగేందర్ తదితరులు హాజరయ్యారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
23 సెప్టెంబర్ 2025



### గాంధీ మహాత్ముడు మెచ్చిన తెలుగు

# రచయిత దేవరాజు

## తెలుగు తొలి డిటెక్టివ్ నవల రచయిత దేవరాజు

దేవరాజు వేంకటకృష్ణారావు (సెప్టెంబర్ 23, 1886 – సెప్టెంబర్ 13, 1966) తొలి తెలుగు అపరాధ పరిశోధక నవలా రచయితగా పరిగణింప బడుతున్నాడు. ఆయన తండ్రి వెంకట్రావు పంతులు మృత్యుంజయ నిశ్శంక బహద్దరు జమీందారు వద్ద దీవాన్‌గా పనిచేసేవాడు. ఆయన బహుభాషా కోవిదుడు. పంచభాషా నిఘంటువును రచించాడు. వేంకట కృష్ణారావు తాత వరదయ్య పంతులు సి.పి.బ్రౌన్ వద్ద దుబాసీగా పనిచేసి బ్రౌణ్య నిఘంటువు నిర్మాణంలో పాలుపంచు కున్నాడు. దేవరాజు రవిగా సుపరిచితులు అయి, తండ్రి బాటలోనే పయనించి, 2 నవలలు, 200 పైగా కథలు, 1250 సినిమా సమీక్షలు ఇంకా పలు ఇతర వ్యాసాలూ రాసిన దేవరాజు వేంకట సత్యనారాయణరావు... వేంకట కృష్ణారావు కుమారుడే.

గడబిడ దాస్, అర్జెంటు పంతులు, ప్రాడ్వివాకుడు అనే ముద్దుపేర్లతో పిలువబడిన దేవరాజు వేంకట కృష్ణారావు 1886 సెప్టెంబర్ 23 వతేదీ జన్మించాడు. కృష్ణారావు విద్యాభ్యాసం బొబ్బిలి, మద్రాసు పట్టణాలలో జరిగింది. పరవస్తు వెంకట రంగాచార్యులు, వేదం వెంకటరాయ శాస్త్రులు ఆయన గురువులు. వివాహం కారణంగా ఇతనికి ఒరిస్సా రాష్ట్రంలోని బరంపురంతో సంబంధ బాంధవ్యాలు ఏర్పడినాయి. ఆయన వృద్ధాప్యంలో బరంపురం నుండి రాజాంకు తరలి వచ్చాడు. 1960 నుండి మరణించే వరకు ఆయనకు కేంద్ర ప్రభుత్వం గౌరవ భృతిని ఇచ్చి సత్కరించింది.

ఆనాటి రోజులలో ఆయన ఇల్లు సాహితీ మూర్తులకు నిలయంగా ఉండేది. గిడుగు రామమూర్తి పంతులు, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, మండపాక పార్వతీశ్వర శాస్త్రి, నేమాని నృసింహశర్మ, బలిజేపల్లి లక్ష్మీకాంతం, పింగళి లక్ష్మీకాంతం వంటి సాహితీమూర్తులతో నిత్య సాహితీ సదస్సులతో కళకళ లాడుతూ వుండేది. ఆయన 1909లో బరంపురంలో ఆంధ్ర భాషాభివర్ధినీ సమాజాన్ని స్థాపించాడు. 1910లో వేగుజుక్క ముద్రణాలయాన్ని స్థాపించాడు. 1911లో తాపీ ధర్మారావుతో కలిసి వేగుజుక్క గ్రంథమాలను నెలకొల్పి 1912లో దానిద్వారా వాడేవీడు అనే అపరాధ పరిశోధక నవలను ప్రకటించాడు. తెలుగులో “వాడేవీడు” మొట్ట మొదటి డిటెక్టివ్ నవలగా ఇప్పటి వరకు గుర్తించ బడింది. ఇంకా కృష్ణారావు నేనే (1914), కాలూరాయి (1916) అనే అపరాధ పరిశోధక నవలలు వ్రాసి గ్రంథమాల ద్వారా ప్రకటించాడు. కాలూరాయి నవలలో హెలీకాప్టర్ ను ఊహించి వ్రాశాడు. అప్పటికి ఇంకా హెలీకాప్టర్ కనుగొన బడక పోవడం గమనార్హం. డిటెక్టివ్ నవలలే కాకుండా జానకీ పరిణయం (తప్పుల తమాషా) , సంజయ రాయబారం, శ్రీకృష్ణ రాయబారం, విభ్రమ రాఘవము, శ్రీకృష్ణా భ్యుదయము, మనసు దాని పని , ఒరిస్సా చరిత్ర , పురాణ సంహిత అనే గ్రంథాలను వ్రాశాడు. 1933లో కళాప్రచారక సమితిని స్థాపించాడు. 1934లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నాడు. ఇతని ఆధ్వర్యంలో వేగుజుక్క కథావళి (1914–1930), పద సమస్య బోధిని (1937), విశాలాంధ్ర వాణి (1940–1960) అనే పత్రికలు వెలువడ్డాయి. తెలుగులో మొట్టమొదటి క్రాస్‌వర్డ్‌పజిల్‌ను సృష్టించిన ఘనత కూడా దేవరాజు వేంకట కృష్ణారావుకే దక్కుతుంది. 1933 మార్చి 10,11,12 తేదీలలో బరంపురంలో జరిగిన అభినవాంధ్ర కవిపండిత సభలో అఖండ సత్కారాన్ని పొందాడు. 1950లో విమర్శ కాగ్రేసర అనే బిరుదుతో సత్కరించ బడ్డాడు. ఆయన వ్రాసిన శ్రీ కృష్ణ రాయబారం అనే గ్రంథంలోని కొంత భాగాన్ని మహాత్మా గాంధీ ఇంగ్లీషులోని తర్జుమా చేయించుకుని చదివి ఆనందించడమే కాకుండా కృష్ణారావుకు “డియర్ గురూజీ” అంటూ సంబోధిస్తూ గ్రంథాన్ని శ్లాఘిస్తూ ఉత్తరాలు రాయడం విశేషం. కృష్ణారావు 1966, సెప్టెంబరు 13వ తేదీన మరణించాడు.

రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

### రాజకీయ నాయకుల నిర్లక్ష్యం నీడలో

# ఎన్టీపీసీ కార్మికులు

పెద్దపల్లి జిల్లా రామగుండంలోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టిపిసి) ప్లాంట్‌లో సుమారు 5,000 మంది కాంట్రాక్టు కార్మికులు చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకోవడానికి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ పనిచేస్తున్నారు. 1985 నుంచి పనిచేస్తున్న కొందరు కార్మికుల వయసు 60 ఏళ్లకు చేరుకుంది, అయినప్పటికీ ఎన్టిపిసి యాజమాన్యం వారిని తొలగించేందుకు నిశ్చయించుకుంది. ఈ కార్మికులు తమ శ్రమ, చమట, శక్తితో ప్లాంట్ ఉత్పత్తిలో భాగస్వాములై, జాతీయ స్థాయిలో అనేక అవార్డులు సాధించడంలో కీలకపాత్ర పోషించారు. అయితే, వారి కష్టాలను పట్టించుకునే నాయకులు లేరు. పెద్దపల్లి నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలుగా గెలిచిన రాజకీయ నాయకులు కార్మికుల ఓట్లతోనే అధిక మెజారిటీ సాధించి తమ రాజకీయ భవిష్యత్తును నిర్మించుకున్నారు. కానీ, వీరి బతుకుల గురించి ఇప్పటివరకు పట్టించుకున్న దాఖలాలు లేవు. తెలంగాణ సాధన తర్వాత కార్మికుల జీవితాలు మెరుగవుతాయన్న ఆశ నీరసించింది. గతంలో టిఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఎంపీలు బాల్క సుమన్, వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే కోరకంటి చందర్ హయాంలోనూ, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్, ఎంపీ గడ్డం వంశీ కృష్ణ వాగ్దానాలు చేసినప్పటికీ, కార్మికుల సమస్యలను విస్మరించారు. సెంట్రల్ రైల్వే డిపార్ట్‌మెంట్‌లో రిటైర్డ్ ఉద్యోగులను ఐదేళ్ల గ్యారెంటీతో లోకో పైలట్‌లు, వ్యాగన్ మెయింటెనెన్స్ టెక్నీషియన్‌లుగా నియమిస్తుండగా, 35–40 ఏళ్లు పనిచేసిన ఎన్టిపిసి కాంట్రాక్టు కార్మికులను 60 ఏళ్ల వయసు పేరుతో తొలగిస్తున్నారు. ఇది అన్యాయమని కార్మికులు గొంతెత్తినా, యాజమాన్యం పట్టించుకోవడం లేదు. కార్మిక సంఘాలు యాజమాన్యానికి, కార్మికులకు ఇష్టమైన రీతిలో రెండు నాలుగుల ధోరణితో వ్యవహరిస్తున్నాయి. ఐఎన్‌టీయూసీ నాయకులు బాబర్ సలీం బాషా గత ఒప్పందాల ఆధారంగా కార్మికులకు ధైర్యం చెబుతూ, యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నారు. 2025 సెప్టెంబర్‌లో మంచిర్యాల ఆర్ఎల్‌సీ వద్ద జరిగిన చర్చల్లో, సీనియర్ కార్మికుల తొలగింపు వల్ల ప్లాంట్‌కు ఇబ్బందులు తలెత్తవచ్చని, మానవతా దృక్పథంతో ఆలోచించాలని యాజమాన్యానికి సూచించారు. యాజమాన్యం పర్మనెంట్ ఉద్యోగుల నియామకాల తర్వాత చర్చించి నిర్ణయం తీసుకుందామని స్పందించింది. ఏది ఏమైనా, కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాజకీయ నాయకులు, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు, కార్మిక నాయకులు బాధ్యతాయుతంగా ముందుకు సాగాలి. తక్కువ వేతనంతో, శాశ్వత ఉద్యోగ భద్రత లేకుండా, ఎన్టిపిసిలో దశాబ్దాలుగా చమటోడ్చిన కార్మికులకు న్యాయం చేసే బాధ్యత వారి ఓట్లతో గెలిచిన పాలకులపై ఉంది.

బాలసాని రాజయ్య
(ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, పెద్దపల్లి)

## ప్లీజ్!

వేదాలగురించి
చెపుతారు!
కావ్య శాస్త్ర
పురాణాలు
చెపుతారు!
రామాయణ
భారత
భాగవతాలు
చెపుతారు!
భగవద్గీత
చెపుతారు!

భోజరాజు నుంచి
రాయలు దాకా
కవి కళాకారుల్ని
చెపుతారు!
దేశం చాలా గొప్పది
ప్రపంచానికే
ప్రతిష్టాత్మకమని
చెపుతారు!

నాదేశం–ఇంత
గొప్పదైనందుకు
నేనెంతో గర్విస్తాను!
కాని–దేశంలో
దరిద్రం పోవటం
ఎలాగో ఎవ్వరూ
చెప్పరు!

అక్షరజ్ఞానం
లేనివాళ్లు
ఆకలి
తీరనివాళ్లు
అరవైకోట్లమంది!
అడుగడుక్కి
అడుక్కునే
పిల్లలు!
అనాథలు
బాలకార్మికులు!
చూస్తుంటే
గుండెలు
బరువెక్కి
పోతున్నాయి!

సుజలాం
సుఫలాం
మలయజ
శీతలాలం!
వందేమాతరం!

దరిద్రం పోయే
మార్గం చెప్పరూ!
గుండెలనిండా
ఊపిరి
పీల్చుకుంటాను!

ప్రపంచ ధనికుల్లో
నాలుగవస్థానం
భారతీయుడే!
ఆనందిద్దామ?

దొంగలంతాకలిసి
అసలు రహస్యం
దాచిపెట్టి–సమస్యల్ని
సాగదీస్తూ–అబద్ధాలు
ఆర్భాటాలతో–కాలం
గడపొద్దు–ప్లీజ్!

తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

## నిర్వేదన

ఓ నా యజమాని
నేనుజి
ధనవంతుడను
సుసంపన్నుడను
రాజును
మంత్రిని
కాను కాను
ఈ రాజ్యం లోను
నీ రాజ్యం లోను
కష్టాన్ని నమ్ముకున్న
నేనొక బిచ్చగాడిని

రేడియమ్
9291527757

# సామాజిక వ్యవస్థ గతి తప్పితే ఉనికికి పెద్ద ప్రమాదం!



సమాజం నైతిక అభివృద్ధియే దేశాభివృద్ధి అన్న మహాత్మా గాంధీ ఆరాటానికి ఆనవాళ్లే కనిపించడం లేదు. స్వార్థ ప్రయో జనాలు, దోపిడీ, పీడన, ఆదిపత్యం, హత్యా రాజకీయాలు, ప్రజా ఉద్యమకారులపై అణచివేత, మానవీయ విలువలకు సమాధి స్వేచ్ఛా భారతిలో డెమోక్రసీకి ఇదేనా ఆదరణ!

అద్దాల మేడలు రంగుల గోడలు మాత్రమే అభివృద్ధి కాదు నైతిక అభివృద్ధి ఏ దేశాభివృద్ధి !అని ఎలుగెత్తి చాటిన మహాత్మా గాంధీ పిలుపుకు నేటికీ ఆదరణ లభించకపోవడం విచారక రం. అంతేకాదు క్రమంగా నాటి నుండి నేటి వరకు మానవ తా విలువలు క్షీనించి మసకబారిపోవడం, కొన్నిచోట్ల తెరమరు గు కావడం, ఆనవాళ్లే లేకుండా పోవడం రాబోయే వ్యవస్థ యొక్క పతనానికి దర్పణంగా భావించవలసిన అవసరం ఉంది. అంతేకాదు ఇది ఒక ప్రమాదకరమైన హెచ్చరికగా సమాజం గుర్తిస్తేనే, ప్రభుత్వాలు పసిగట్టి ఆలోచిస్తేనే భవిష్యత్తు కొంత వరకైనా ఆశాజనకంగా ఉంటుంది. హద్దు అదుపు లేకుండా హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు, మానభంగాలు, పసి పిల్లల పైన లైంగిక దాడులను నిరంతరంగా మనం గమనించి నప్పుడు ఏ విలువలకు ఈ పయనం అని మనకు మనం ప్రశ్నించుకోకపోతే ఎలా? పరిస్థితులు చేజారి పోతే, అశాంతి అల్లకల్లోలాలు అదుపు తప్పితే, గౌరవ మర్యాదలు ప్రేమాను రాగాలు గతి తప్పితే ఇక భవిష్యత్తు అంధకారము కాక మరేమవుతుంది!కొన్ని సామాజిక విలువలు కట్టుబాట్లకు, నీతి నిజాయితీకి నిలయంగా ఉన్నటువంటి సమాజం గతానికి భిన్నంగా పూర్తిగా చేజారి పోవడాన్ని మనం గమనించకపోతే ఎలా!”ఆహారపు దుర లవాట్లు, అనారోగ్య వాతావరణం, నిర్లక్ష్యం కలిసి మనిషి జీవితాన్ని ఏరకంగా అంతం చేస్తుందో అలాగే సమాజంలో నైతిక విలువలు క్రమంగా క్షీణించి తెర మరగవుతూ ఉంటే కళ్ళారా చూస్తూ కూడా ప్రశ్నించకపోతే పట్టించుకోకపోతే మానవ మనుగడ కూడా ప్రశ్నార్థకంగా మారుతుంది అనేది కనీసం అయినటువంటి అవగాహన. ఈ అవగాహనను ఆవలోకించక, ఆలోచించక, పట్టించుకోక నిర్లక్ష్యం చేస్తున్న కారణంగా ఎవరికి వారే తమ బాధ్యత ఏమీ లేనట్లు తమ వరకు మాత్రమే పరిమితమై స్వార్థపూరితంగా ఆలోచిస్తున్న కారణంగా ఎక్కడికక్కడ సమాజం నిట్ట నిలువునా చీలిపోతున్నది. నాసిరకం సిమెంటు కంకర ఇసుక ఇతర పదార్థాలతో నిర్మించిన నిర్మాణం పగుళ్లు బారినట్లు సామాజిక వ్యవస్థ నిర్మాణం గతి తప్పి తన ఉనికిని తానే కోల్పోతున్నది.“

### ప్రజాస్వామిక విలువల పతనం బాధాకరం

హక్కులకై కల బడుతూ బాధ్యతలకు నిలబడాలి అనేది ప్రాథమిక సూత్రం. సంస్థలు సంఘాలు ట్రేడ్ యూనియన్లు ప్రధానంగా నమ్మిన ఈ సిద్ధాంతాన్ని ప్రజలు ప్రజాస్వామిక వాదులు నిరంతరం ఆచరిస్తున్న సందర్భంలో ఇదేదో నేరమైనట్లు, కర్తవ్యం నిర్వహణ హక్కులకై పోరాటం దేశద్రోహ మైనట్లు ఈ దేశ సంపద ప్రజలందరికీ చెందాలని ప్రశ్నించిన పాపానికి బలవంతపు మారణకాండ ఈ దేశంలో ఏదో రూపం లో కొనసాగుతూ ఉంటే సామాన్య ప్రజలు చేసిన కష్టాన్ని శ్రమను మరిచి కంటి నిండాకునుకు తీయగలరా? “ ప్రభుత్వాలు ప్రజాస్వామిక పద్ధతిలో జాతి సంపదను ప్రజలందరికీ సమానంగా పంచాలి అనే ఆలోచనతో అనేక సందర్భాలలో రాజకీయ నినాదాలతో తన ఉనికిని చాటుకుంటున్నది. కానీ పెట్టుబడిదారి వ్యవస్థ చేతిలోవున్న పాలకులు అవైపుగా కనీస ప్రయత్నం కూడా చేయడం లేదు. ఇక ఉద్యమ సంస్థలు ప్రజాస్వామ్యవాదులు మేధావులు హక్కుల కార్యకర్తలు మాత్రం ప్రభుత్వం సూచనప్రాయంగా ఆలోచన చేస్తున్నటువంటి రాజ్యా ంగంలో రాసుకున్నటువంటి సమ సమాజాన్ని సా కారం చేసే క్రమము లోపల కొంత ప్రయత్నం చేయడం ఆ ప్రయత్నంలో భాగంగానే ఎందరో అమరులు కావడం అయినా ఆ లక్ష్యాన్ని జనం దృష్టిలో నిరంతరం సజీవంగా ఉంచే ప్రయత్నం చేయడం మనం నిత్యం చూస్తున్నదె. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, సమసమాజాన్ని సాధించాలని, సామ్యవాద స్థాపన తమ ఆశయమని, అసమానతలు అంతరాలు లేని వ్యవస్థను సా కారం చేసుకోవడానికి పోరాటం తప్పనిసరి అని తమ జీవితాలను పణంగా పెట్టిన వాళ్ళు కూడా ఎందరో... ప్రభుత్వ ఆలోచన ప్రజాస్వామిక వాదుల ఆలోచన ఒకటే అయినప్పటికీ మార్గాలు వేరు కావడం, పాలకులు ఆలోచన వరకు మాత్రమే పరిమితమై ఆచరణలో పెట్టుబడిదారీ వర్గాన్ని పెంచి పోషించడం వలన ఉద్యమ సంస్థలు ప్రజాస్వామ్య వాదుల ఆలోచన ఆశయాలు కార్యరూపం కాల్చడం లేదు. కానీ పాలకులలో కొంతమంది బుద్ధి జీవులు ప్రజాస్వామిక స్పృహ కలిగినట్లు నటిస్తున్న వాళ్లు మాత్రం అప్పుడప్పుడు మేధావులను ఆహ్వానించి సలహాలు సూచనలు అడుగుతూనే ఉన్నారు. కానీ మళ్లీ తమకు నచ్చినట్లే చేస్తూ ఆలోచన చేసిన వాళ్ళ అంతు చూస్తున్నారు. కరోనా కష్ట కాలంలో ఈ దేశంలో అసమానతలు భారీగా పెరిగిపోయిన నేపథ్యంలో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి పేదరిక నిర్మూలనకు పేద ప్రజల యొక్క కొనుగోలు శక్తిని పెంచడానికి పెట్టుబడిదారీ సంపన్న వర్గాల పైన కొంత అదనపు భారాన్ని పన్నుల రూపంలో వేయాలని సూచన చేసినందుకుగాను మేధావి వర్గాన్ని దేశద్రో హులుగా ముద్ర వేసిన వైనం పాలకుల యొక్క అంతర్గత ఆలోచన ఏ రకంగా ఉంటుందో తెలుసుకోవడానికి దోహదపడు తుంది. హక్కులు, బాధ్యతలు, రాజ్యాంగ సవరణలు, అవకా శాలు, రాజ్యాంగ ప్రవేశిక లోని మంచి మాటలు, సమర్థవంత మైన న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక శాసన వ్యవస్థలు ఈ దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తాయని గొప్పగా చెప్పుకుంటు న్న మనం ఆచరణలో అనేక రకాలైన దోపిడీలు దహనకాండ లు అణచివేత అత్యాచారాలను కలారా చూస్తున్న నేపథ్యంలో పైకి అందంగా కనిపించే మేడిపండు చందంగా భారత ప్రజాస్వామ్యం రోజు రోజుకు కొంత మంది చేతిలో బలహీన మవుతున్నది. ఆ రకంగా మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తుంటే సుమారు 7 దశాబ్దాలకు పూర్వమే నైతిక విలువల పైన ఆందోళన వ్యక్తం చేసిన మహాత్మా గాంధీ ప్రస్తుతం బ్రతికి ఉంటే ఈ అరాచక ఆకృత్యాలను కల్లారా చూస్తే నైతికత గురించి ఏమని వర్ణించేవారో ఊహిస్తేనే దిమ్మ తిరిగిపోతది. నడుస్తున్న బస్సులలో మానభంగాలు, వాహనాలకు మహిళల ను కట్టి ఇడ్చుకు వెళ్లిన వైనం, సామూహిక అత్యాచారం జరిపి గుక్కెడు తాగునీళ్లు కావాలని కోరితే మూత్రాన్ని చేతిలో పోసి తా గించినటువంటి ఆగంతకుల ఆనవాళ్లు ఉన్న ఈ దేశం ఎటువైపు ప్రయాణిస్తున్నదో ఒక్కసారి ఆలోచిస్తే తెలుస్తుంది.ఇది కేవలం ప్రజలకు ప్రజాస్వామ్య వాదులకు మాత్రమే అవసర మా? పాలకుల బాధ్యత లేదా? రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అధికారానికి వస్తున్న పాలకులు ఎందుకు మౌనం వహిస్తున్నారు? నేరస్తులను ఎందుకు శిక్షించడం లేదు? న్యాయవ్యవస్థ ఎందుకు స్తబ్దతకు గురవుతున్నది?దాని వెనుక ఉన్న టువంటి శక్తులు ఏమిటి? ఈ అంశాల పైన లోతైన చర్చ జరగాలి.


### ప్రజాస్వామ్యం మేడిపండు కాకూడదు!

మేడిపండు చూడ మేలిమై ఉండును పొట్ట విప్పి చూడ పురుగులుండు” అన్న వేమన్న గారి మాటలు మేడిపండు చందంగా ఉన్న ప్రజాస్వామ్య వ్యవస్థ, పాలన,రక్షణ లేని సామాన్య ప్రజానీకం యొక్క బాధలకు దర్పణంగా భావించవలసి ఉన్నది. ప్రజల చేత ఎన్నుకోబడ్డ ప్రజాస్వామిక వ్యవస్థ ఇతర రాజకీయ వ్యవస్థల కంటే బలమైనదని నమ్మి స్వేచ్ఛ, సమానత్వము, సౌభ్రాతృతము వంటి అంశాలకు ఎక్కువ అవకాశం ఉంటుందని స్వీకరిస్తేనేమి ఆ అతి స్వేచ్ఛ పేదల, కష్టజీవుల, దిక్కు మొక్కు లేని అనాధల పాలిట మరణశాసన మైన మాట వాస్తవం కాదా? చట్టానికి మరింత పదును పెట్టి, న్యాయం తన ఉగ్రరూపాన్ని ప్రదర్శించే విధంగా సామాన్య ప్రజల తలుపుతట్టి చైతన్యపరిచి, పేద వాడి కోపం పెదవికి చేటు కాదు కలవారి, ఆగంతకులు, నియంతలు, దేశద్రోహుల పదవికి చేటు అని చెప్పగలిగే చరిత్రను తిరిగి రాయగలిగే సత్తా దేశ ప్రజలకు ఉన్నది. తమ సత్తా ఏమిటో తమకు తెలియకుండా మౌనంగా ఉండేలా సామాన్య ప్రజానీకాన్ని మోసం చేస్తున్నటువంటి వ్యవస్థ యొక్క కుట్రలను ఛేదించగలిగితే ప్రజల ఉగ్రరూపం మహోన్నతంగా వెలిగిపోతుంది. బాధ సర్పదస్టుల సమస్యలు పరిష్కారమవుతాయి. చీకటి దా రిలో చిక్కిపోతున్న వారికి వెలుగు రేఖలై దారి చూపుతాయి. , నైతిక విలువల పునాదిగా, మానవీయ ఆలోచనల వేదికగా ఆ ప్రయత్నం కొనసాగాలి.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# సామాజిక పరివర్తనలో విద్య పాత్ర



సమాజం అనేది ఒక జీవంతమైన శరీరం. ఇది నిరంతరం మార్పులకు లోనవుతూ ఉంటుంది. సామాజిక పరివర్తన అంటే ఈ మార్పుల ప్రక్రియే. ఇది సమాజంలోని నిర్మాణాలు, సంస్థలు, సంస్కృతి, భావజాలాలు మరియు మానవ సంబంధాలలో జరిగే మౌలిక మార్పులను సూచిస్తుంది. ఇది కేవలం ఉపరితల మార్పు కాదు. మానవ సమాజం యొక్క అభివృద్ధి చరిత్రలో ఒక భాగం. ఉదాహరణకు, భారతదేశంలో ఆధునిక కాలంలో జరిగిన కుల వ్యవస్థలో మార్పులు, మహిళల హక్కులు, ఆర్థిక సంస్కరణలు వంటివి సామాజిక పరివర్తనకు ఉదాహరణలు. ఈ పరివర్తన నెమ్మదిగా జరిగే ప్రక్రియ కావచ్చు లేదా ఒక్కసారిగా థ్రిల్లింగ్ జంప్ లాంటిది కావచ్చు, అంటే పాత ట్రాక్ నుండి కొత్త ట్రాక్‌కు మార్పు. ఇది సమాజాన్ని మరింత సమానంగా, న్యాయంగా మార్చడానికి ఉద్దేశించబడింది. కానీ ఈ సామాజిక మార్పు ఎల్లప్పుడూ సానుకూల ఫలితాలను మాత్రమే ఇవ్వదు. కొన్నిసార్లు ఇది సంఘర్షణలు, అసమానతల కూడా పెంచవచ్చు.

సామాజిక పరివర్తనకు కారకాలు ఎన్నో ఉన్నాయి. ముందుగా, ఆర్థిక కారకాలు ప్రధానమైనవి. ఆధునికీకరణ, పారిశ్రామికీకరణ వల్ల సమాజంలోని తరగతులు(వర్గాలు )మారుతాయి. ఉదాహరణకు, భారతదేశంలో 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత మధ్య తరగతి పెరిగింది, కానీ ధనిక–పేదల మధ్య అంతరం కూడా పెరిగింది. ఇది సానుకూల పరివర్తనగా చూడవచ్చు. కానీ విమర్శనాత్మకంగా చూస్తే, ఇది కొత్త అసమానతలను సృష్టించింది. రెండవది, రాజకీయ కారకాలు. ప్రభుత్వ విధానాలు, విప్లవాలు సమాజాన్ని మారుస్తాయి. భారత స్వాతంత్ర్యం తర్వాత రాజ్యాంగం ద్వారా అంటరానితనం నిర్మూలన, రిజర్వేషన్లు వంటివి సామాజిక న్యాయాన్ని తీసుకువచ్చాయి. అయితే, ఇవి పూర్తిగా విజయవంతమయ్యాయా? విమర్శకులు చెప్తున్నట్లు, ఇంకా సమాజంలో కుల హింస, వివక్షలు ఉన్నాయి, ఇది పరివర్తన యొక్క అసంపూర్ణ స్వభావాన్ని చూపిస్తుంది. మూడవది, సాంస్కృతిక కారకాలు. గ్లోబలైజేషన్ వల్ల పాశ్చాత్య సంస్కృతి ప్రభావం పెరిగింది. ఇది యువతలో వ్యక్తిగత స్వేచ్ఛను ప్రోత్సహిస్తుంది. కానీ సాంప్రదాయ విలువలను కోల్పోయే ప్రమాదం ఉంది. సాంకేతికత కూడా ఒక కారకం. సోషల్ మీడియా ద్వారా సమాచార వ్యాప్తి వేగవంతమవుతుంది, ఇది (మీ..టూ..) వంటి ఉద్యమాలను తీసుకువచ్చింది, కానీ, అసత్య వార్తలు,లేదా సమాచారం (ఫేక్ న్యూస్ )వల్ల సమాజంలో విభజనలు కూడా పెరుగుతాయి. ఇలా కారకాలు బహుముఖంగా ఉంటాయి. మరియు వీటిని విశ్లేషిస్తే, అవి ఎల్లప్పుడూ ప్రగతికి దారితీయవు. కొన్నిసార్లు వెనుకబాటుకు కూడా కారణమవుతాయి.

### సామాజిక పరివర్తనలో విద్య :

సామాజిక పరివర్తనలో విద్య పాత్ర అత్యంత కీలకమైనది. విద్య అనేది సమాజాన్ని మార్చే ఒక శక్తివంతమైన సాధనం. ఇది వ్యక్తులలో జ్ఞానం, విమర్శనాత్మక ఆలోచనను పెంచుతుంది. దీనివల్ల సమాజంలోని మూఢనమ్మకాలు, వివక్షలు తొలగుతాయి. భారతదేశంలో జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ వంటి సాంఘిక సంస్కర్తలు విద్యను సామాజిక మార్పుకు ఆయుధంగా ఉపయోగించారు. ఆధునికంగా చూస్తే, విద్య ద్వారా మహిళల సాధికారత, డిజిటల్ లిటరసీ పెరుగుతాయి. ఇది ఆర్థిక స్వావలంబనకు దారితీస్తుంది. అయితే, విమర్శనాత్మకంగా పరిశీలిస్తే, భారత విద్యా వ్యవస్థలో ఇంకా అసమానతలు ఇంకా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో విద్యా సౌకర్యాలు తక్కువ, ప్రైవేట్ స్కూళ్లు ధనికులకు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. జాతీయ విద్యా విధానం–2020(నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ – 2020) వంటి విధానాలు సమగ్ర విద్యను లక్ష్యంగా పెట్టుకున్నాయి. కానీ, అమలు లోపాల వల్ల పరివర్తన నెమ్మదిగా ఉంది. విద్య కేవలం పాఠ్యపుస్తకాలకు మాత్రమే పరిమితమైతే, ఇది సమాజాన్ని మార్చలేదు. ఇది విమర్శనాత్మక ఆలోచన, సామాజిక బాధ్యత లను కలిగించాలి. లేకపోతే, ఇది కేవలం ఉద్యోగాలు ఇచ్చే సాధనం గా మిగిలిపోతుంది. సమాజంలోని అనేక మూల రుగ్మతలను, సమస్యలను పరిష్కరించ లేదు.

### సామాజిక పరివర్తనలో ఉపాధ్యాయుని పాత్ర:

సామాజిక పరివర్తనలో ఉపా ధ్యాయుని పాత్ర అనేది మరింత లోతైనది. ఉపాధ్యాయుడు కేవలం జ్ఞానాన్ని బోధించేవాడు మాత్రమే కాదు. సమాజాన్ని ఒక ప్రగతిశీల ఆకృతిలోకి మార్పు చేసేవాడు. అతను విద్యార్థులలో సామాజిక సమానత్వం, న్యాయం, సహనం వంటి విలువలను నాటుతాడు. ఉదాహరణకు, ఉపాధ్యాయుడు తరగతి గదిలో కుల, మత, వర్గ, లింగ వివక్షలను చర్చించి, విద్యార్థులను విమర్శనాత్మకంగా ఆలోచించేలా చేస్తాడు. భారతదేశంలో గురుకుల వ్యవస్థ నుండి ఆధునిక విద్య వరకు, ఉపాధ్యాయుడు సమాజ సంస్కర్తగా పనిచేశాడు. అయితే, విమర్శనాత్మకంగా చూస్తే, నేటి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సవాళ్లు ఎన్నో. వారికి శిక్షణ లోపం, తక్కువ వేతనాలు, అధిక బోధన భారం వల్ల వారు సృజనాత్మకంగా పనిచేయలేరు. ప్రభుత్వాలు ఉపాధ్యాయులను సామాజిక మార్పును తీసుకువచ్చే ఏజెంట్లుగా చూడాలి,కానీ, ఎన్నికల విధానాలు వారిని రాజకీయ సాధనాలుగా మారుస్తున్నాయి. ఉపాధ్యాయుడు సమాజంలోని మెజారిటీ ఆలోచనలకు అనుగుణంగా పనిచేయాలి. కానీ అతను స్వతంత్రంగా విమర్శనాత్మక దృక్పథాన్ని ప్రోత్సహించాలి. లేకపోతే, విద్యా వ్యవస్థ స్థిరత్వానికి దారితీస్తుంది, మార్పుకు కాదు.

సమగ్రంగా చూస్తే, సామాజిక పరివర్తన అనేది ఒక డైనమిక్ ప్రక్రియ. ఇది అనేక కారకాలతో, విద్య, ఉపాధ్యాయుల పాత్రల ద్వారా ఆకృతి చెందుతుంది. అయితే, ఇది ఎల్లప్పుడూ సానుకూలమా?అని విశ్లేషణ చేస్తే, గ్లోబలైజేషన్ వల్ల పరివర్తన వేగవంతమైంది, కానీ సాంస్కృతిక గుర్తింపు కోల్పోతున్నాం. విద్య మరియు ఉపాధ్యాయులు సమాజం లో ప్రగతిశీలమైన మార్పులు తీసుకురావాలి. కానీ వ్యవస్థాగత లోపాలు వాటికి అడ్డుపడుతున్నాయి. విమర్శనాత్మకంగా, సమాజం స్వయంగా మారాలని కోరుకోకపోతే, ఎలాంటి కారకాలు లేదా సాధనాలు పనిచేయవు. భవిష్యత్తులో, సామాజిక పరివర్తనను సమానత్వం, స్థిరత్వం వైపు నడిపించడానికి, విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి, ఉపాధ్యాయులను శక్తివంతం చేయాలి. ఇది మాత్రమే నిజమైన పరివర్తనకు దారితీస్తుంది.



దండెబోయిన అశోక్ యాదవ్
గెజిటెడ్ హెడ్మాస్టర్, పెద్దమదూర్,
జనగాం. 9440521990.

## అదే సాయంత్రం

ఊరిబైట
దినకరుడు చెరువులో దిగితే
క్షణంలో బంగారుకాంతి వెలుగులో
సాయంత్రం బాగుందని
కొందరు
దారిమీద
ఇరువైపుల దీపాలు వెలిగితే
నిమిషంలో నియానకాంతి జిలుగులో
సాయంత్రం బాగుందని
కొందరు
ఫ్యాక్టరీ నుండి
చెమటగంధం పూసుకొని
విడుదలైన కొందరు
వీక్షణలో ఆశారేఖలు లేక లోపల
మాటసాయం చేతిసాయం
చెబద్దుసాయం
దొరక్క నిరాశలో నిలబడ్డ
అదే
సాయంత్రాన్ని ఆస్వాదించలేదు
వాళ్లకి
తెరల సాయంత్రం
చెరల సాయంత్తం
సమిష్టి శ్రేయస్సు కోరని
దొరల సాయంత్రం

కోటం చంద్రశేఖర్
9492043348

# భూస్వాముల కోసమే రోడ్డు డిజైన్ మార్పు

- నిధులు కేంద్రానివి అలైన్మెంట్ రాష్ట్రానిది
- అలైన్మెంట్ మార్పు కేంద్రానికి సంబంధం లేదు
- 25 వేల కోట్లతో జాతీయ రహదారి అభివృద్ధి
- ఎంపీ నిధులతో చేవెళ్ల అనంతగిరి రోడ్ల అభివృద్ధి
- జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు లబ్ది
- కొన్ని విచ్ఛిన్నకర శక్తులు దేశాన్ని విడదీయడానికి ప్రయత్నిస్తున్నారు
- చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి



**వికారాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** కొందరు భూస్వా ముల భూములను రక్షించడానికి రీజనల్ రింగ్ రోడ్ అలైన్మెంట్ మార్పు జరిగిందని చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ ని తగ్గించినందున దీనిపై బిజెపి పార్టీ గ్రామాల్లో ప్రచార కార్యక్రమం నిర్వహిస్తుంది. అందులో భాగంగానే ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో వికారాబాద్ రోడ్డు భవనాల శాఖ గెస్ట్ హౌస్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణం కోసం దశలవారీగా మూడు ప్రతిపాదనలను ప్రభుత్వం చేపట్టిందని తెలియజేశారు. మొదటి రెండవ ప్రతి పాదనలో బంజరు భూములు కొంత అటవీ ప్రాంతం రీజనల్ రింగ్ రోడ్ లో పోయేదని మూడో ప్రతిపాదన వల్ల రైతుల భూములు నష్టపోతున్న మాట వాస్తవమని అన్నారు. కొందరి భూస్వాముల రాజకీయ నాయకుల భూములు రీజనల్ రింగ్ రోడ్‌లో కోల్పో తున్న కారణంగా ప్ర భుత్వం అలైన్మెంట్ మార్చి ఉండవచ్చునని అభిప్రాయ పడ్డారు. జాతీయ రహదారుల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేసి కేంద్రానికి అప్పగిం చవలసి ఉంటుందని రోడ్ల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మం జూరు చేస్తుందని తెలియజేశారు. వికారాబాద్ జిల్లాలో నిర్మించే రీజినల్ రింగ్ రోడ్ కోసం కేంద్ర ప్రభుత్వం 25 వేల కోట్లు మంజూరు చేసిందని తెలి యజేశారు. అలైన్మెంట్ల మార్పుతో కేంద్ర ప్రభుత్వానికి సంబంధం లేదని అలైన్మెంట్ల మార్పు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉంటుందని అన్నారు. కేంద్రం నాలు గు రకాల రోడ్ల నిర్మాణం చేపడుతుందని వివరించారు. కేంద్రం తగ్గించిన జిఎస్టి వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం తగ్గుతుందని కానీ వ్యాపారం పెరుగుతున్నం దున వ్యాపారవేత్తలకు లబ్ధి చేపడుతుందని అన్నారు. జీఎస్టీ తగ్గింపు పై గ్రామాల్లో విస్తృత చేయాలని బిజెపి కార్యకర్తలు నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జిఎస్టి ప్రచార కన్వీనర్ వెన్నె ఈశ్వరప్ప. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్ కుమార్. శివరాజ్. నియోజకవర్గ కోఆర్డినే టర్ వడ్ల నందు పోకల సతీష్ శిరీష నర్సత్తం రెడ్డి పందు గౌడ్ కృష్ణ ముదిరా జ్ అమరేందర్ రెడ్డి వివేకానంద రెడ్డి సాయి చరణ్ రెడ్డి అనిల్ యాదవ్ పాల్గొన్నారు.

# నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే

- ప్రజా ప్రతినిధులు, అధికారులు



**హయత్ నగర్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** భారీ వర్షాలకు హయత్ నగర్ డివిజన్ లోని బంజారా కాలనీ పూర్తి స్థాయిలో నీట మునగడంతో ఎల్.బి. నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, స్థానిక డివి జన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ తో కలిసి నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచన మేరకు నగరం లో మరికొన్ని రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే సూచన ఉందని వారు తెలిపా రు. కావున హయత్ నగర్ డివిజన్ లోని లోతట్టు ప్రాంతాలను గుర్తించి తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ కి వారు వివరించారు. బాధితులకు తక్షణసాయం క్రింద 20,000 రూపాయలు ఇవ్వాలని, వారికి భోజన సౌకర్యం కల్పించాలని వారు తెలిపారు. వర్షాలు పడినప్పుడల్లా హయత్ నగర్ డివిజన్ లోని లోతట్టు ప్రాంతాల ప్రజలు వరద నీటితో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎగువన ఉన్న బి యన్ రెడ్డి నగర్, వనస్థలిపురం, ఇంజాపూర్ చెరువు నుండి హయత్ నగర్ లోకి భారీ వరద నీరు వస్తుందని వారు పేర్కొన్నారు. కావున హయత్ నగర్ డివిజన్ లోని కాలనీ లు ముంపునకు గురి కాకుండా వరద నీటిని మరలించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని వారు జోనల్ కమిషనర్ కి విజ్ఞప్తి చేశారు. నూతన ట్రంక్ లైన్ అతి త్వరలోనే ప్రారంభం కావడం జరుగుతు ందని ఆ పనులు సకాలంలో పూర్తి అయితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని వారు అన్నారు. వర్షాల పట్ల హయత్ నగర్ డివిజన్ వాసులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ స్తంభాలు, వరద నీటి, భూగర్భ డ్రైనేజ్ మ్యాన్ హోల్స్ వద్ద మరింత జాగ్రత్తగా ఉండాలని వారు తెలియజేశారు. వాతావరణ శాఖ సూచన మేరకు వర్షం పడుతున్న సమయం లో ఇళ్ల నుంచి బయటకు రాకూడ దని, వర్షాల వల్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన, వెంటనే తమకు సమాచారం అందించాలని వారు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో డి ఈ దామోదర్, మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి, హయత్ నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, గుడాల మల్లేష్, వస్పరి వెంకటేష్, గోపాల్ నాయక్, శంకర్ నాయక్, బాలు నాయక్, అఖిల్, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

# పీర్జాదిగూడలో పలు డివిజన్లలో అభివృద్ధి పనులు ప్రారంభం

- 3వ డివిజన్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు
- 5వ డివిజన్‌లో సీసీ రోడ్డు పనులు
- ముఖ్య అతిదిగా పాల్గొన్న మాజి మేయర్ అమర్ సింగ్



**బోడుప్పల్ సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** పీర్జాదిగూ మున్సిపల్ కార్పొరేషన్ పరిదిలోని 3,5వ డివిజన్ లలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా నగర మాజి మేయర్ అమర్ సింగ్ స్థానిక మాజి కార్పొరేటర్లు శారద ఈశ్వర్ రెడ్డి,బొడిగె స్వాతికృష్ణ గౌడ్ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా కాలనీల ప్రజలు సరైన అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ లేకపోవడం వలన ఎన్నో ఇబ్బందులు పడ్డారని,ఈ పనులు చాలాకాలంగా పెండింగ్‌లో ఉందని,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పౌర సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి వేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. సాయి ఐశ్వర్య కాలనీ దాదాపు రూ.15 కోట్ల వ్యయంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ ప్రాజెక్ట్ ప్రారంభమైందని చుట్టు ప్రకల కాలనీలకు కూడ ఇబ్బందులు తొలగుతాయని పేర్కొన్నారు. అలాగే 5వ డివిజన్ బీపీఎమ్,గ్రీన్ ల్యాండ్స్ కాలనీ రోడ్ నెం.1, 2, 3 లో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు.ఈ సీసీ రోడ్డులతో కనెక్టివిటీతో పాటు ఆధునిక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అందించబడుతుందని దీంతో వారి జీవన ప్రమాణాలు మెరుగవుతాయని తెలిపారు. కాలనీ అభివృద్ధికి కృతసంకల్ప ంతో సమిష్టిగా పనిచేస్తున్న ప్రయత్నాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్ రెడ్డి,బొడిగె కృష్ణ గౌడ్,హైహింద్ గౌడ్,సుదర్శన్ రెడ్డి,బొడిగె ఉదయ్,అజయ్ రెడ్డి కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**కాప్రా, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** ఉప్పల్ నియోజ కవర్గంలోని ప్రతి కాలనీకి మౌలిక వస తులు కల్పించే ందుకు కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మె ల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.సోమవారం మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ లోని హెచ్ బీ కాలనీ ఫేజ్-1 మెయిన్ రోడ్డులో మంచినీటి పైప్లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో అవసరమైన సహకారం అందిస్తూ ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని, ఉప్పల్ నియో జకవర్గం యొక్క అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే కాలనీవాసుల సమ స్యలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం కార్పొరేటర్ జెరిపోతుల ప్రభు దాస్ మాట్లాడుతూ డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తామని అలాగే డివిజన్ అభివృద్ధి విషయంలో సహకారం అంది స్తున్న ఎమ్మెల్యేకు డివిజన్ నాయకులకు కార్పొరే టర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పొన్నాల దేవేందర్ రెడ్డి, డివిజన్ వాటర్ వర్క్స్ ఏఈ వేణుగోపాల్, కాలనీ ప్రెసిడెంట్ శివరాం ప్రసాద్, గోవిందరెడ్డి, ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు బోదాసు లక్ష్మీ నారాయణ, నేమూరి మహేష్ గౌడ్, రమణ, శివ, దుర్గయ్య, బాబూరావు, దండెం నరేందర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఎంపీ సాక్షిగా బిజెపికి బీటలు

- గది తలుపులు వేసి బిజెపి నాయకుల సమావేశం
- గది బయట జిల్లా అధ్యక్షుడి పడిగాపులు
- అధ్యక్షుడిని పట్టించుకోకుండా వెళ్లిపోయిన ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి
- రెండు వర్గాలు తమ అనుచరులతో వేరువేరుగా సమావేశాలు



**వికారాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 22 (జనం సాక్షి):** నాయకులంతా ఒక్క జెండా ఎజెండా కింద పనిచేసే వారే... కానీ రెండు వర్గాల మధ్య లోకల్ నాన్ లోకల్ చిచ్చు రగులుతుంది. అదింత మరింత తారస్థాయికి చేరింది. ఎంపీ నిర్వహించే కీలక సమావేశంలో బట్టబలయింది. జిల్లా అధ్యక్షుడికి తెలియకుండా పిలవకుండా సమావేశమని తెలిసి వచ్చిన ఆహ్వానించకుండా సమావేశం తంతు ముగించారు. అయినా తాను మాట్లాడి తీరుతానంటూ సమావేశం గది బయట నిలుచున్న పట్టించుకోకుండా ఎంపీ హడావుడిగా వెళ్లిపోయారు. దీంతో బీజేపీ నాయకుల మధ్య ఉన్న విభేదాలు బట్టబయలయ్యాయి. ఈ సంఘటన వికారాబాద్ పట్టణంలోని రోడ్డు భవనాల శాఖ గెస్ట్ హౌస్ లో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి సారథ్యం వహించిన జిల్లా జిఎస్టి ప్రచార సమావేశంలో బిజెపి పార్టీలో ఉన్న లుకలు కలుబయట పడ్డాయి. వికారాబాద్ జిల్లా బిజెపి అధ్యక్షులు డాక్టర్ రాజ శేఖర్ రెడ్డి అధ్యక్షతన జిఎస్టి ప్రచార సమావేశం జరగవల సి ఉంది. సమావేశానికి చేవె ళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. అయితే వికారాబాద్ జిల్లా బిజెపి అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి కి తెలియకుండానే బిజెపి నాయకులు జీఎస్టీ ప్రచార మీడియా సమావేశం ముగించారు. మీడియా సమావేశం నిర్వహించడంలో కొందరు ఉద్దేశపూర్వ కంగానే తమను తప్పుదారి పట్టించారని జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి ఆరోపి ంచారు. వికారాబాద్ రోడ్లు భవనాల శాఖ గెస్ట్ హౌస్ లో ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి జీఎస్టీ ప్రచార మీడి యా సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్న జిల్లా బిజెపి అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి గెస్ట్ హౌస్ కు వచ్చి న ఆయనను సమావేశంలోకి ఆహ్వానించలేదు. అనుమతించలేదు. ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి నిర్వహించే మీడియా సమావేశంలో జిల్లా నుంచి బిజెపి నాయకులు పాల్గొన్నారు. వారందరినీ ఒక గదిలోకి పిలిచి గది తలుపులు మూసి జీఎస్టీ ప్రచా రంపై ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మీడియా సమా వేశం నిర్వహించారు. గదిలోపల ఎంపీ మీడియా సమావేశం జరుగుతున్నంతసేపు తమ అనుచరులతో జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి గది బయట తలుపుల దగ్గర వేచి ఉన్నారు. గది బయట జిల్లా అధ్యక్షులు వేచి ఉన్నారన్న సమాచారం గదిలోపల ఉన్న ఎంపీ తో పాటు మిగతా నాయకులందరికీ సమాచారం ఉన్న ఆయనను పట్టించుకోలేదు. మీడియా సమావేశం ముగిసిన తర్వాత ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిని కలిసి తమ సమస్యలు వివరించాలని జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి తమ అనుచరులతో కలిసే ప్రయత్నం చేశారు. కానీ ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డిని పట్టించుకోకుండా హడావుడిగా వెళ్లిపోయారు. దీంతో తీవ్ర అసంతృప్తికి గురైన జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి అదే గెస్ట్ హౌస్ లో మరో గదిలో తమ అనుచరులతో సమావేశం నిర్వహించారు. ఎంపీ వెళ్ళిపోయిన తర్వాత బిజెపిలోని మరో వర్గం ఇంకో గదిలో తమ నాయకులతో సమావేశం నిర్వహించి అంతర్గత విషయాలు చర్చించుకున్నారు. ఇంతకాలంగా లోకల్ నాన్ లోకల్ విషయంలో రగులుతున్న రచ్చ మీడియా సమావేశం ముందు బట్టబయలైంది. దీంతో జిల్లాలో సర్వత్ర చర్చ జరుగుతుంది.

# రైస్ మిల్‌లో జరిగిన అవకతవకలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు



**తాండూరు సెప్టెంబర్ 22(జనంసాక్షి):** పాక్స్ రైస్ మిల్‌లో జరిగిన అవక తవక ల పై జిల్లా కలెక్టర్ , జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేయడం జరిగిందని బిఆర్ ఎస్ పార్టీ యాలాల మండల అధ్యక్షులు రవిందర్ రెడ్డి తెలిపారు. సోమవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ ను కలిసి రైస్ మిల్లు లోజరిగిన అవకతవకలపై మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి వివరించారు. దీంతో స్పందించిన జిల్లా కలెక్టర్ మూడు రోజులో నివేదిక కొరకు సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా బిఆర్ ఎస్ పార్టీ యాలాల మండల అధ్యక్షులు రవిందర్ రెడ్డి మాట్లాడుతూ... సహకార సంఘం రైస్మిల్ నిర్మాణములో అవినీతి, అక్రమాలు జరిగాయని తెలిపారు. రైస్ మిల్ పై విచారణ జరిపి ఎస్. చైర్మన్ , సి.ఇ.ఓ.ల చర్యలు తీసుకోగలరని విజ్ఞప్తి చేశారు.

# భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయండి

- దసరా నాటికి పనులు ప్రారంభించాలి
- కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం




**వికారాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 22 (జనం సాక్షి):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియను ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ల ను ఆదేశించారు. సోమవారం డా. బి. ఆర్. అంబేద్కర్ సచివాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ముఖ్యమంత్రి పలు సూచనలు జారీ చేశారు.దసరా పండుగకు ముందే అన్ని పనులు పూర్తికావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.కోర్టు కేసులు ఉన్న భూములకు సంబంధించిన పూర్తి వివరాలను వెంటనే ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. టైటిల్ సమస్యలు ఉన్న భూముల విషయంలో పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేసి, భూములను సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారి నిర్మాణ పనులు ఆలస్యమవకుండా ప్రతి కేసును అత్యంత ప్రాధాన్యంగా పరిగణించాలని అధికారులకు ఆదేశించారు. రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర, దక్షిణ భాగాలతో పాటు రేడియల్ రోడ్ల నిర్మా ణంపై అధికారులకు పలు సూచనలు చేసారు .హైదరాబాద్- శ్రీశైలం హైవేలో ఎలి వేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రం నుంచి వీలైనంత త్వరగా అనుమ తులు తీసుకోవాల ని,భూసేకరణలో ఎలాంటి ఆలస్యం జరు గకూడద ని, అక్టోబరు నెలాఖరు నాటికి పూర్తిస్థా యిలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాల ని ,జిల్లాల వారీగా సమీక్ష చేపట్టి పురోగతిని పరిశీలి స్తానని, జాప్యం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జాతీయ రహదారుల నిర్మాణం రాష్ట్ర అభివృద్ధి, రవాణా సౌకర్యాల మెరు గుదలకు కీలక మని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వికా రాబాద్ జిల్లా వీడియో కాన్ఫరెన్సు హాలు నుండి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ట్రైని కలెక్టర్ హార్స్ చౌదరి, అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వైద్యం వికటించి ఆరు సంవత్సరాల పాప మృతి






- క్లినిక్ ఎదుట కుటుంబ సభ్యులు ఆందోళన
- కేసు నమోదు చేసిన మేడిపల్లి పోలీసులు

**బోడుప్పల్ సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** వైద్యం వికటించి ఆరేండ్ల చిన్నారి మృతి చెందిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిదిలోని బోడుప్పల్ కార్పొరేషన్‌లో జరిగింది.దీంతో బాలిక కుటుంబ సభ్యులు బంధువులు క్లినిక్ ఎదుట ఆందోళన చేపట్టారు.బంధువులు తెలిపిన వివరాల ప్రకారం సరూర్ నగర్‌లో నివాసముండే కొండ రాజు, లావణ్య దంపతులకు ఇద్దరు కుమా ర్తెలు .పెద్ద కూతురు హాసిని (6)కి వారం రోజులుగా జ్వరం, వాంతులు, బలహీనత వంటి లక్షణాలు కనిపించడంతో ఇటీవల పరీక్షలు చేయించగా ఆమెకు జాండీస్,డెంగ్యూ పాజిటివ్ గా నిర్ధారణ అయింది.ఆదివారం మధ్యాహ్నం జ్వరం మరింత పెరగడంతో బోడుప్పల్ దేవేందర్ నగర్ లోని తల్లిదండ్రుల బంధువుల ఇంటి సమీపంలో ఉన్నా సత్య పాలీక్లినిక్ లో చేర్పించారు.క్లినిక్ లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి హాసిని మృతి చెందడంతో అర్హత లేకున్నా చికిత్స చేయడంతోనే చిన్నారి ప్రాణాలు కోల్పో యిందని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ క్లినిక్ ఎదుట ఆందో ళనకు దిగారు.వైద్యుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు చిన్నారికి పోస్ట్ మార్టం నిర్వహకంచి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

**మానవ ప్రాణాలకు విలువ లేకుండా పోయింది...**

డబ్బుంటే ఏదైనా సాధ్యమే అని నిరూపించారు అర్హత లేని డాక్టర్.ప్రజల ఆర్థిక పరిస్థితులను ఆసరాగా చేసుకొని 6ఏళ్ల చిన్నారి ప్రాణానికిప్రాణానికి 7లక్షలుగా వెల కట్టి తిరిగి తమ వృత్తిని కొనసాగిస్తున్నారు.వీటిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు స్పందించక పోవడంతో పేదల పరిస్థితి అగమ్య గోచరంగా మారుతుంది.

**సత్యపాలి క్లినిక్ సీజ్ చేసిన వైద్య అదికారులు...**

బోడుప్పల్ పరిదిలోని సత్య పాలి క్లినిక్ కు ఎలాంటి గుర్తింపు లేదు.డాక్టర్ కు కూడ ఎలాంటి అర్హత లేదని నిర్ధారించునట్లు తెలిపారు.సోమవారం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఇన్‌చార్జ్ డాక్టర్ ప్రణీత్,జిల్లా డిప్యూటీ ఎక్స్‌టెన్షన్ మీడియా ఆఫీసర్ వసంత రెడ్డితో కలిసి క్లినిక్ ను సీజ్ చేశారు.

# అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష సమావేశం




**మల్కాజిగిరి,సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని 6 డివిజన్ లలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి, పెండింగ్ పనులపై డిప్యూటీ కమిషనర్ జాతీయ సుల్తాన ఇంజనీరింగ్ అధికారు లతో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డివిజన్ లలో బాక్స్ డ్రైన్లు, సీసీ రోడ్లు వంటి మౌలిక వసతుల అభివృద్ధిపై చర్చ జరిగింది. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.వినాయక నగర్ డివిజన్ పరిధిలోని దీన్ దయాల్ నగర్‌లో వర్షపు నీటి ప్రవాహానికి నిలిచిపోయిన బాక్స్ డ్రైన్‌ను పూర్తి చేయాలని, సంతోష్ మాత టెంపుల్ నుండి నాగదేవత టెంపుల్ వరకు వయా దీన్ దయాల్ నగర్ మెయిన్ రోడ్ మీదుగా 1000 ఎంఎం డయా ఆర్ సిసి పైప్‌లైన్ పనులను వెంటనే ప్రారంభించి త్వరిత గతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మణ్, డీఈఈ లు మహేష్, అసిస్టెంట్ ఇంజనీర్లు సత్యలక్ష్మి, దీన్ దయాల్ నగర్ కాలనీ వాసులు సంపత్ యాదవ్, శ్రావణ్, చిరంజీవులు అబ్రహం పాల్గొన్నారు.

# నాపరాతి వ్యాపారాలు సజావుగా సాగేందుకు, తన వంతుగా కృషి

- ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి



**తాండూరు సెప్టెంబర్ 22(జనంసాక్షి):** నాపరాతి వ్యాపారాలు సజావుగా సాగేందుకు తన వంతు కృషి చేస్తామని ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నా రు.సోమవారం తాండూర్ స్టోన్, క్వారీస్ మర్చంట్స్ అసోసి యేషన్ నూతన కార్యవర్గం, సభ్యులు శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. తాండూర్ లో నాపరాతి వ్యాపారాలు సజావుగా సాగేందుకు, వాణిజ్యపరంగా అభివృద్ధి చెందేందుకు తన వంతుగా కృషి చేస్తానని మహేందర్ రెడ్డికి హామీ ఇచ్చారు. గతంలో తాను రెండు పర్యాయాలు మంత్రిగా ఉన్నప్పుడు స్టోన్ మర్చంట్స్ అసో సియేషన్ కు అందించిన సహాయ సహకారాలను మహేంద్ర రెడ్డి గుర్తు చేశారు. అందుకు వారు ధన్యవాదాలు తెలిపారు. తాండూర్ ప్రాంత అభివృద్ధికి మహేందర్ రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని వారు వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో తాండూర్ స్టోన్, క్వారీస్ మర్చంట్స్ అసోసి యేషన్ సభ్యులు ఉన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | మంగళవారం 23 సెప్టెంబర్ 2025

# క్రీడలు, విద్యకు వనపర్తి ఎంతో ప్రసిద్ధి

- క్రీడారంగంలో వనపర్తి తలమాణికం
- బహుమతుల ప్రధానోత్సవంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** ఉమ్మడి జిల్లాలో వనపర్తి జిల్లా క్రీడలకు విద్యకు ఎంతో ప్రసిద్ధి చెందిందని ఇక్కడి ప్రాంత విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాష్ట్రస్థాయి జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు తీసుకురావడం గర్వించదగ్గ విషయమని వనపర్తి డిఎస్పి వెంకటేశ్వరరావు అన్నారు. గత రెండు రోజుల నుంచి వనపర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో 11వ ఇంటర్ డిస్టిక్ సెపక్తక్రా టోర్నమెంట్ లో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో డిఎస్పీ మాట్లాడుతూ క్రీడలు వనపర్తిలో నిర్వహించుకోవడం ఈ క్రీడలకు ఉమ్మడి తెలంగాణ రాష్ట్రంలోని పది జిల్లాల నుంచి పురుషులు క్రీడాకారులు బాలికలు పాల్గొని తమ ప్రతిభను చూపించడం అభినందనీయమని అన్నారు. మొదటినుంచి వనపర్తి జిల్లా క్రీడలకు విద్యకు పెట్టిన పేరుగా ఎంతో ప్రసిద్ధి చెందిందని అన్నారు. ఇదే ఉత్సాహం యువతలో రాబోయే రోజుల్లో మరింత పెంపొందే విధంగా యువతి యువకులు క్రీడల పట్ల ఆసక్తితో పట్టుదల ఒక లక్ష్యంతో కృషిచేసి జాతీయ అంతర్జాతీయ స్థాయిలలో ముందుకు రాణించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా సేపక్ తక్రా క్రీడల నిర్వహణ అధ్యక్షులు వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ వనపర్తిలో సెపక్తక్రా క్రీడలు నిర్వహించుకోవడం గర్వకారణంగా ఉందని ఈ క్రీడలు ఈ ప్రాంతంలో పెద్దగా ప్రచారం లేకపోయినప్పటికీ సెపక్తక్రా క్రీడల అసోసియేషన్ అధ్యక్షుడిగా తన హయాంలో ఈ క్రీడలను ఇప్పటికి రెండోసారి నిర్వహించుకుంటున్నామని అన్నారు. వనపర్తి జిల్లాలో క్రీడలకు పుట్టిన ఇల్లుగా వనపర్తి మారిందని ఈ ప్రాంతానికి చెందిన బాలికలు, బాలురు, వివిధ క్రీడా రంగాలలో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడుతున్నారని అన్నారు. వనపర్తి నియోజకవర్గంలోని జిల్లా ఖిలాగణపురం మండలానికి చెందిన వనిత అనే బాలిక సేపక్ తక్రా పోటీలలో ఏషియన్ గేమ్ లో పాల్గొని ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నప్పటికీ కూడా వనపర్తి లో జరిగిన సెపక్తక్రా ఇంటర్ డిస్టిక్ పోటీల్లో వనిత పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచిందని అన్నారు. గతంలో ఈ ప్రాంతానికి చెందిన వనిత సెపక్తక్రా క్రీడల్లో అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణం అని ఆయన అన్నారు. మొత్తం మీద క్రీడా రంగానికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తూ క్రీడారంగాన్ని బలోపేతం చేస్తుందని అన్నారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్ కొత్త కాపు శివసేనారెడ్డి వనపర్తి నియోజకవర్గం వర్గానికి క్రీడారంగానికి అవసరమైన నిధులను మంజూరు చేస్తూ ఈ ప్రాంతంలో విద్యతో పాటు క్రీడలకు పుట్టినిల్లుగా ఈ ప్రాంతాన్ని రాబోయే కొన్ని రోజుల్లో తీర్చిదిద్దడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుకున్నదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం కృష్ణ, రూరల్ ఎస్సై జలంధర్ రెడ్డి, జిల్లా యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ సుధీర్ రెడ్డి, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ జగన్ ,నరేందర్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ నాయకులు యాపర్ల రామ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ బ్రహ్మం, యూత్ కాంగ్రెస్ నాయకులు రాహుల్, నారాయణరెడ్డి, రవీందర్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి, దొంత అశోక్ శెట్టి, తో పాటు క్రీడాకారులు క్రీడ అభిమానులు పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించండి

- అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, డి ఆర్ డి ఓ పి డి ఉమాదేవితో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, ప్రతి సోమవారం జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈరోజు ప్రజావాణికి మొత్తం 28 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజల ఫిర్యాదులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని అధికారులను సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలి


- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్
- ప్రజావాణికి 65 దరఖాస్తులు స్వీకరణ



**మెదక్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 65 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ తో పాటు, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు ,లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**తూప్రాన్, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** మున్సిపల్ కేంద్రమైన తూప్రాన్ మనోహరాబాద్ మండలంలో డివి నవరాత్రి ఉత్సవాలు కనుల పండుగ ప్రారంభమయ్యాయి తూప్రాన్ మహంకాళి దేవాలయం వద్ద 27 సంవత్సరాలుగా అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు వేద పండితులు ఉదయ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని మహంకాళి దేవాలయం గత 27 సంవత్సరాలుగా నవ దుర్గా నవరాత్రి ఉత్సవాలు దుర్గ భవాని సేవా సమితి ఆధ్వర్యంలో ర్వహిస్తున్నారు 22 సోమవారం నుండి వచ్చే నెల నాలుగవ తేదీ శనివారం వరకు నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు దుర్గాభవాని సేవా సమితి వారు తెలిపారు. 22వ తేదీ ఉదయం అఖండ దీపారాధన గణపతి పూజ పుణ్యావాచనము యాగశాల ప్రవేశము స్థాపిత దేవత ఆహ్వానం గణపతి హోమం చండీయాగం లఘు పూర్ణాహుతి దుర్గ భవానికి చతుష్షష్టి పూజ మంగళ హారతి నీరాజనం అన్న ప్రసాద వితరణ రాత్రి గోపూజ కార్యక్రమం 23 న మంగళవారం అమ్మవారికి పూజ శాకాంబరి అలంకరణ 24వ తేదీ బుధవారం అమ్మవారికి మణిదీప వర్ణన పారాయణం రాత్రి గీతా స్కూల్ విద్యార్థి విద్యార్థులకు సాంస్కృతి



కార్యక్రమాలు 25వ తేదీ గురువారం రాత్రి మహాలింగార్చన రుద్రాభిషేకం మహా బిల్వార్చన 26వ తేదీ శుక్రవారం అమ్మవారికి విశేష పూజ లక్ష కుంకుమార్చన రాత్రి సహస్రదీపాలంకరణ 27వ తేదీ శనివారం ఉదయం అమ్మవారికి చతుర్ షష్టి పూజ అత్రి 56 రకాల వంటలచే ప్రసాద సమర్పణ 28వ తేదీ ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు రాష్ట్రీయ స్వయంసేవక ఆధ్వర్యంలో ఆయుధపూజ రాత్రి 7 గంటలకు ఉమామహేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం 29వ తేదీ అమ్మవారికి చతురస్తి పూజ రాత్రి మూలా నక్షత్రం సందర్భంగా మూలా సరస్వతి పూజ 30వ తేదీ మంగళవారం దుర్గాష్టమి మహార్నవమి సుహాసిని పూజ ఒకటవ తేదీ బుధవారం మహర్నవమి చతుస్తి పూజ రెండవ తేదీ గురువారం ఉదయం పూజ విజయదశమి హిందూ సామ్రాజ్య పట్టాభిషేకం మహంకాళి దేవాలయం ఆవరణలో టపాసులచే కార్యక్రమం నాల్గవ తేదీ శనివారం ఉదయం 12 గంటలకు అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల 30 నిమిషాలకు చండీ హోమం మధ్యాహ్నం ఒంటిగంట నుండి మహా అన్నదాన ప్రసాదం ఏర్పాటు చేసినట్లు తెలిపారు అలాగే సలక రాజేశ్వర శర్మ ఆధ్వర్యంలో దేవి గార్డెన్ లో భక్తిశ్రద్ధలతో దేవి నవరాత్రులు నిర్వహిస్తున్నారు. కాలకల్ బంగారమ్మ దేవాలయంలో రాష్ట్ర సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకట పురం లలిత పరమేశ్వరి దేవాలయంలో తిండి ఉపాసకులు సోమయాజుల రవీందర్ శర్మ ఆధ్వర్యంలో దేవి నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతి మండపం వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

# కబ్జాలను తొలగించి కాలనీలను కాపాడండి

- నీట మునిగిన కాలనీలను సిపిఎం బృందం పరిశీలన



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో చిట్కుల్ పరిధిలోని కాలనీలన్ని జలమయమయ్యాయని,వర్షపు నీళ్ళు కాలనీలోకి వెళ్లకుండా శాశ్వత పరిష్కారం చూపాలని సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి నాగేశ్వరరావు అధికారుల డిమాండ్ చేశారు. మండలంలోని చిట్కుల్ పరిధిలోని కాలనీలలో సోమవారం సిపిఎం పార్టీ బృందం ఆధ్వర్యంలో పరిశీలించడం జరిగింది. అనంతరం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ పరిధిలోని నీట మునిగిన కాలనీల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలంటు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట్ కిషన్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వానల వల్ల ముత్తంగి చెరువు నిండి చిట్కుల్ లోని నాగార్జున కాలనీ, రాధమ్మ కాలనీ, నవోదయ కాలనీ, పార్థసారథి నగర్, ఓడిఎఫ్ కాలనీల రహదారులన్నీ జలమయమై ఇళ్లల్లోకి నీళ్లు చేరాయన్నారు.గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ముత్తంగి చెరువు పూర్తిగా వర్షం నీటితో నిండిపోవడంతో అలుగు కాలువలన్నీ కబ్జాలకు గురికావడంతో వర్షపు నీరు ఆయా కాలనీలోని ఇళ్లలోకి చేరిందన్నారు. కాలనీలలోని రోడ్ల పై మోకాలు లోతు నీళ్లు వెళుతుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, ముత్తంగి చెరువు కింద ఉన్న సహజసిద్ధమైన కాలువలను మూసివేసి అనేక నిర్మాణాలు చేపట్టడం మూలంగానే ఇళ్లలోకి నీరు సీసీ రోడ్లు జలమయం అయ్యాయని తెలిపారు. సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు కాలువల అక్రమ నిర్మాణాలను చూసి చూడనట్లు వదిలేయడంతో యదేచ్చగా కబ్జాలకు గురయ్యాయని కొజ్జాల గురైన నిర్మాణాలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కాలనీలలో వర్షపు నీళ్లు, మురుగు నీళ్ల కలిసి ప్రవహిస్తుండడంతో కాలనీలా ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురి అయ్యే ప్రమాదం లేకపోలేదన్నారు. ప్రతి సంవత్సరం ఈ కాలనీల ప్రజలు నాన్న ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని భవిష్యత్తులో ఇలాంటి సమస్య తలెత్తకుండా కబ్జాలను తొలగించి ముత్తంగి చెరువు కాలువలను పునర్ నిర్మించి నక్క వాగులోకి వర్షపు నీరు చేరే విధంగా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కల్వర్టు వ్యవస్థను నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో కాలనీల ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శాంత కుమార్, నల్లగండ్ల రాజు,రాజు, రాజేష్, రాజు గౌడ్, పోచయ్యలు పాల్గొన్నారు.

## విద్యా నిధికి చేయూత ఇవ్వండి

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** మహబూబ్ నగర్ నగరంలో అన్ని రంగాల్లో ఉన్న ప్రముఖులు విద్యా నిధికి విరివిగా విరాళాలు ఇవ్వాలని గౌరవ మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మహబూబ్ నగర్ నగరానికి చెందిన ప్రముఖ న్యాయవాది ప్రతాప్ కుమార్ లివిద్యా నిధికిలి 5 లక్షల రూపాయల చెక్కు ను ఎమ్మెల్యే సమక్షంలో, జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. విద్యా నిధికి విరాళం ఇచ్చిన ప్రముఖ న్యాయవాది ప్రతాప్ కుమార్ ను ఎమ్మెల్యే ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా నిధికి వచ్చే ప్రతి పైసా కూడా విద్యాభివృద్ధికే ఖర్చు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మహబూబ్ నగర్ లో విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి చాలా గొప్పదని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎమ్మెల్యే గారు ఎంతో కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. విద్యా నిధికి ఐదు లక్షల రూపాయల విరాళం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మార్గదర్శి స్కూల్లో ఘనంగా బతుకమ్మ సంబరాలు




**కృష్ణ, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** మండలం గుడెబల్లూరు గ్రామంలోని మార్గదర్శి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సోమవారం బతుకమ్మ సంబరాలు ఎంతో అంగరంగ వైభవంగా జరిగాయి. ముందుగా విద్యార్థులు టీచర్లు తీరొక్క పువ్వులను సేకరించి బతుకమ్మలు పేర్చి వాటికి పూజా కార్యక్రమం నిర్వహించారు. తదా నంతరం విద్యార్థులు, టీచర్లు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు బతుకమ్మ డాన్సులు, కోలాటాలతో ఈ కార్యక్రమానికి ఎంతో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ డి. నర్సింలు, మేనేజ్మెంట్ అధ్యక్షులు ప్రహ్లాద్ రెడ్డి, మాగనూరు మార్గదర్శి విద్యాలయం ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి, పాఠశాల కోశాధికారి పూజారి లక్ష్మన్న మార్గదర్శి స్కూల్ గుడేబల్లూర్ పాఠశాల ప్రిన్సిపల్. డి.భీమ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలత, ఉపాధ్యాయులు రేణుక, మహేశ్వరి,నికిత, భవాని, స్వాతి, ఊర్మిళ, చైతన్య, లక్ష్మణ్, నవీన్ కుమార్ రెడ్డి.గ్రామ పెద్దలు యువకులు తదితరులు, అందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# రాజీవ్ పార్క్ అభివృద్ధికి 3 కోట్లు మంజూరు

- రాజీవ్ పార్కు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష
- టిజిఐఐసి కార్పొరేషన్ చైర్మన్ నిర్మల, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



**సంగారెడ్డి టౌన్, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** రాజీవ్ పార్కు అభివృద్ధి కోసం మూడు కోట్లు మంజూరయ్యాయని పనులను త్వరగా ప్రారంభించాలని డిజైన్ అండ్ ఆర్కిటెక్ కన్సల్టేషన్ ప్రతినిధులతో టీజీఐఐసీ కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సోమవారం రాజీవ్ పార్కులోని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పార్కులో ఉన్న సమస్యలను తిరిగి చూసి అభివృద్ధి పనులను నాణ్యతగా నిర్మించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంగారెడ్డి పట్టణంలోని రాజీవ్ పార్క్ అభివృద్ధి కోసం ప్రభుత్వం మూడు కోట్ల రూపాయలు మంజూరయ్యాయని పనులను త్వరగా ప్రారంభించాలని, నాణ్యతమైన నిర్మాణాలు చేపట్టాలని అధికారులను సూచించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ 2004 ఎమ్మెల్యే అయిన తర్వాత 2005లో బొబ్బిలికుంటకు ఆనుకుని ఉన్న స్థలంలో రాజీవ్ పార్క్‌కు శంకుస్థాపన చేయడం జరిగిందని, ముఖ్యమంత్రులు రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి ల హయాంలో పనులు జరిగి పూర్తయ్యాయని గుర్తుచేశారు. సమైక్య రాష్ట్రం లో పదేళ్ల పాటు ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు ఈ పార్క్ లో మ్యూజికల్ ఫౌంటేన్, చిల్డ్రన్ పార్క్, ప్లే ఏరియా ఏర్పాటు చేశాను 2014 నుండి 2018 వరకు పార్క్ కుంటుబడి పోయిందని అన్నారు. చాలా మంది ఈ విషయం లో కాంప్లైంట్ చేసినప్పటికీ, ప్రభుత్వం మనది కాదు, ఎమ్మెల్యే గా లేను కాబట్టి ఏమి చేయలేకపోయానన్నారు. నేను ఎన్నికల్లో ఓడిపోయినా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కాబట్టి నిధులు తీసుకువస్తున్న నియోజకవర్గం లో పనులు జరగడం కోసం ప్రోటోకాల్ ఉండాలి అందుకే నిర్మల కు కార్పొరేషన్ పదవి ఇస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పారు. ఈమధ్య కాలంలో మున్సిపల్ అడ్మినిస్టేషన్ డైరెక్టర్ అండ్ కమిషనర్ శ్రీదేవిని కలిశాను. రాజీవ్ పార్క్ కోసం 15 కోట్ల రూపాయల ప్రతిపాదనలు పెట్టాను. అత్యవసర పనులు కోసం 3 కోట్లు ఇస్తా అనడం తో అందుకు తగ్గ ప్రతిపాదనలు సిద్ధం చేయడం అయిందని తెలిపారు. 3 కోట్లతో కొత్త గ్రాస్, చిల్డ్రన్ పార్క్, లేటెస్ట్ గా లైటింగ్ కూడా షో కోసం కాకుండా మన్నికైన వాం లైటింగ్ ఏర్పాటు చేయండిని, పార్క్‌లో ఎక్కువ వెలుతురు ఉండేలా హై మాస్ట్ లైట్స్, దగ్గర దగ్గర గా లైటింగ్ ఏర్పాటు చేయాలి ఓల్టేజ్ ఎక్కువగా ఉన్న లైట్స్ వాడండిని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్కిటెక్చర్ అధికారులు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో జనరేటర్ ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు వినతి



**సంగారెడ్డి టౌన్, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** సదాశివపేట ప్రభుత్వ ఆసుపత్రిలో జనరేటర్ ఏర్పాటు నిమిత్తం హెచ్ డి ఎస్ హాస్పిటల్ డివలప్మెంట్ చైర్మన్ స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కు సోమవారం సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు లో సదాశివపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డా. విజయ్ శంకర్ సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ భీమ్ రావు పాటిల్ కలసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తక్షణమే స్పందించి జనరేటర్ ఏర్పాటు కు తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తక్షమే సమస్య పరిష్కారానికి కృషి ఎమ్మెల్యే కు ఆసుపత్రి సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు.

# మంగపేటను అభివృద్ధి పథంలో నిలుపుతా

- హేమాచల క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తాం
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క
- ఎర్రవాగు ముంపు బాధితులకు బ్లాంకెట్స్, చీరలు పంపిణీ



**మంగపేట సెప్టెంబర్ 22(జనంసాక్షి) :** ములుగు జిల్లాలోనే చివరి ప్రాంతమైన మంగపేట మండలాన్ని అన్ని రకాలుగా వసతులను ఏర్పాటు చేసి అభివృద్ధి పథంలో నిలుపుతానని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మంత్రి సీతక్క మండల పర్యటనలో భాగంగా కమలాపురం గ్రామంలోని ఎర్రవాగు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉప్పొంగడంతో ఇందిరా కాలనీ ఇండ్లు ముంపుకు గురై నిర్వాసితులయ్యారు. ముంపుకు గురైన సుమారు 20 కుటుంబాలకు మంత్రి సీతక్క బ్లాంకెట్స్, చీరలను అందజేసి వారికి ఎల్లప్పుడు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అలాగే కమలాపురం గ్రామపంచాయతీ ముందునున్న సంత రోడ్డుకు 15 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్ నిర్మాణ పనులకు మంత్రి సీతక్క కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని అలాగే మండలంలో ఎటువంటి సమస్యలు ఉన్న వెంటనే తన దృష్టికి తీసుకు రావాలని వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి సీతక్క వెల్లడించారు. అలాగే గోదావరి పుష్కరాలు 2027 సంవత్సరంలో మొదలు కానున్నాయని తెలిపారు. పుష్కరాలు రాకముందే మండల కేంద్రంలోని గంపోనీగూడెం వద్ద నుండి గౌరారం కొత్త బ్రిడ్జి వరకు రోడ్డు విస్తరణతో పాటు సెంట్రల్ లైటింగ్ సిస్టంను పూర్తి చేస్తామని అలాగే మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని అన్ని రకాల సౌకర్యాలతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సుమారు 25 కోట్ల రూపాయల నిధులతో ప్రతిపాదనలను సిద్ధం చేసి కేంద్ర జల వనరులశాఖ మంత్రి గజేంద్ర సింగ్ శకావత్ కు పంపించడం జరిగిందని అందుకోసం ఒక ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని వారు తెలిపారు. అనంతరం రాజుపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ములుగు సోషల్ మీడియా కోఆర్డినేటర్ కర్రీ నాగేంద్రబాబు తండ్రి అనారోగ్య సమస్యతో మరణించడంతో వారి నివాసానికి వెళ్లి మృతుడు కర్రీ నరసయ్య చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మంత్రి వెంట కార్యక్రమంలో జిల్లా అద్యక్షుడు పైడాకుల అశోక్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, గ్రందాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్, పార్టీ మండలశాఖ అద్యక్షుడు మైల జయరాంరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, చింత పున్నారావు, పచ్చా శేషగిరి రావు, సిద్ధంశెట్టి వైకుంఠం, బట్టర్శెట్టి గౌతమ్, పెద్ది నర్సింహారావు, చెట్టుపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గా నవరాత్రి ఉత్సవాలలో డీజేలకు అనుమతులు లేవు

- రాత్రి సమయాలలో షీ టీం స్పెషల్ ఆపరేషన్ నిర్వహణ
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** సోమవారం నుండి జిల్లావ్యాప్తంగా దుర్గా మరియు శారదా దేవిల శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా జిల్లా ప్రజలందరికీ జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యంగా దుర్గా నవరాత్రి ఉత్సవాలలో, నిమర్జనం ఉత్సవాలలో డీజేలకు అనుమతులు లేవని సుప్రీంకోర్టు నియమ నిబంధనలను లోబడి సౌండ్ బాక్స్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలలో నిబంధనలు ఉల్లంఘించిన జిల్లా వ్యాప్తంగా 15 మంది డీజే యజమానులపై కేసుల నమోదు చేసి డీజేలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. రాత్రి సమయాలలో మహిళలు ఎక్కువగా ఉండే ప్రదేశాలలో శారదా దేవి మండప కమిటీల వద్ద ప్రత్యేకంగా మహిళా సిబ్బందిచే మరియు షీ టీం బృందాలచే నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. మహిళలకు ఈవిటీజింగ్ కు, ఆకతాయిలు వేధింపులకు, వికృతి చేష్టలకు ఎలాంటి ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మహిళలు ఎలాంటి అత్యవసర సమయంలోనైనా డయల్ 100 ద్వారా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించి సహాయాన్ని పొందవచ్చును అని సూచించారు. రాత్రి సమయాలలో యువత అనవసరంగా తిరగడం మానివేయాలని సూచించారు. మహిళలు ఎక్కువగా ఉండే ప్రదేశాలలో యువత, తెలియని వారు వారిని వీడియోలు తీయడం, వికృత శాష్టాలు చేయడం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

## యూరియా కొరతతో తగ్గిన 50 శాతం దిగుబడి

- మాజీ శాసనసభ్యుడు పెద్ది సుదర్శన్ రెడ్డి
- వ్యవసాయ మార్కెట్ యార్డులోని మొక్కజొన్న పంట పరిశీలన



**నర్సంపేట సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** యూరియా కొరతతో 50 శాతం దిగుబడి తగ్గిందని మాజీ శాసనసభ్యుడు పెద్ది సుదర్శన్ రెడ్డి తెలిపారు. నర్సంపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును మొక్కజొన్న పంటను మాజీ శాసన సభ్యుడు పెద్ది సుదర్శన్ రెడ్డి సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాంత రైతాంగం వరి, మొక్కజొన్న, పత్తి పంట, 50% పైబడి దిగుబడి నష్టపోయారని పేర్కొన్నారు. వచ్చినటువంటి మొక్కజొన్న పంట ముందుగా చేతికి వచ్చింది ఇప్పటి వరకు 1951 రూపాయి ధరకి రైతుల అమ్ముకునే దుస్థితి వచ్చిందని, తెలంగాణ ప్రాంతంలో ఉండడం దురదృష్టకరం అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆలోచన లేకపోవడం రైతులకు సంబంధించిన పంటల కొనుగోళ్లలో కుంభకోణాలు చేయాలా, సంపాదించాల అని ఆలోచన తప్ప రైతులను ఎన్నడు ఆదుకునే ప్రయత్నం చేయలేదు తెలిపారు. ముందస్తు ప్రణాళిక లేకపోవడం వలన సకాలంలో యూరియ అందించకపోవడం వల్ల నష్టం వాటిల్లిందని తెలిపారు. పంటలు హార్వెస్టింగ్ దశకు వచ్చాయి మూడు పంటలకు సంబంధించి 50% పైబడి పంట దిగుబడి తగ్గిపోతుంది వెంటనే ప్రతి ఎకరాకు రైతుకు 25వేల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి పంటకి ప్రతి రైతుకు 25వేల రూపాయలను వ్యవసాయ శాఖను ఆదేశించి సర్వే నిర్వహించి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్,రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు,మాజీ ఎంపీపీ,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్,క్లస్టర్ బాధ్యులు, పట్టణ ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు, పట్టణ పార్టీ బాధ్యులు,వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, నాయకులు,రైతులు పాల్గొన్నారు.

# వైభవంగా ప్రారంభమైన భద్రకాళి శరన్నవరాత్రులు

- హాజరైన ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ ఈస్ట్, సెప్టెంబరు 22 (జనం సాక్షి) :** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ది గాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో 2025 విశ్వావసు నామ సంవత్సర శ్రీ భద్రకాళి దేవి శరన్నవరత్ర మహోత్సవములు అత్యంత వైభవోపేతంగా ప్రారంభింపబడ్డాయి. ఉదయం గంటలు 04-00లకు నిత్యాహ్నికం నిర్వర్తించిన పిమ్మట అర్చకులు అమ్మవారికి ఉత్సవానుజ్ఞ ప్రార్ధన జరిపారు. అమ్మవారు అనుగ్రహించిందన్న సూచన రాగానే గణపతి పూజ, పుణ్యహవాచనం, ఉత్సవ పూర్వాంగ విధి నిర్వహించిన పిమ్మట అమ్మవారికి పూర్ణాభిషేకం నిర్వహించారు. పంచామృతాలు, పంచోధకాలు, ఔషధులు, వృక్షపల్లవ కషాయాలు, సుగంధ ద్రవ్యాలు ఇత్యాది పలు విధములైన వస్తు సంభారములతో రెండు గంటల పాటు సాగిన ఈ అమ్మవారి అభిషేకం ఒక అమితమైన ఆనందాన్నికలిగించింది. అనంతరం నవరాత్రులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయానికి విచ్చేసి ఎమ్మెల్యే దంపతులకు ఎంపీ కడియం కావ్య కు ఆలయ చైర్మన్ డాక్టర్ బి శివసుబ్రహ్మణ్యం ధర్మకర్తలు తణుకునూరు వీరన్న కటకం రాములు గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి ఓరుగంటి పూర్ణచందర్ తొగరు క్రాంతి బింగి సతీష్ మోత్కూరి మయూరి గాండ్ల స్రవంతి నార్ల సుగుణ పాలడుగు ఆంజనేయులు భారతి వెంకటేశ్వర్లు అనంతుల శ్రీనివాస్ మూగ శ్రీనివాస్ మరియు కార్యనిర్వహణాధికారి రామల సునీత భద్రకాళి శేషు అయ్య పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ రోజు భేరీపూజ జరిపిన అనంతరం ఉత్సవాల ద్వజారోహణం జరిపారు. అమ్మవారిని బాలాత్రిపుర సుందరిగా అలంకరించి పూజారాధనలు జరిపిన తర్వాత అమ్మవారిని ఉదయం వృషభ వాహన సేవ మీద సాయంకాలం మృగవాహన సేవ మీద ఊరేగించారు. వృషభ వాహన సేవ మీద ఊరేగుతున్న అమ్మవారిని దర్శించడంవలన ధర్మశ్రద్ధ, మృగ వాహన సేవమీద ఊరేగుతున్న అమ్మవారిని దర్శించడం వలన చంచలత్వాన్నివీడి మనస్సు సాధనలో నిమగ్నమై సాధకుడి సాధన సక్రమంగా సాగుతుందని భద్రకాళి శేషు తెలిపారు. అట్లే బాలా త్రిపురసుందరి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించిన భక్తులకు కుండలినీ శక్తి జాగృతమై సాధనకు ఆటంకం కలిగిస్తున్న అసూరీ శక్తులను దూరం చేస్తుంది. కుండలినీ శక్తి జాగృతమైన సాధకులకు సకలార్ధసిద్ది కలుగుతుంది. ఈ రోజు ఉభయ దాతలైన ప్రముఖ పారిశ్రామికవేత్త బాసాని విశ్వప్రకాశ్ %-%శోభ దంపతులు, బాసాని సాయి వీక్షిత్ రాజ్-డాక్టర్ నిహంతి దంపతులు, శ్రీ బాసాని కావ్యత్, హైదరాబాద్ వాస్తవ్యులు దొంతుల కృష్ణారెడ్డి సుధా దంపతులు తోట కిరణ్ కుమార్ కీర్తి దంపతులు మహేష్ జాజు భావన జాజి దంపతులు మరియు దేవరాజ్ బజాజ్ సుశీల దంపతులకు పూజానంతరం అమ్మవారి శేషవస్త్రములు బహుకరించి ప్రసాదములు ఆందజేశారు. తదుపరి నవరాత్రులలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేద పారాయణం మరియు మాన్యుసూక్త సహస్రావర్తన పురస్సర మారుతి యాగం, శత చండీ యాగం, మహారుద్ర యాగం, గణేశ యాగం, సుదర్శన యాగం, సౌరయాగం, మహాలక్ష్మి యాగం, దశమహావిద్య యాగం, దుర్గా యాగం, సరస్వతి యాగం నిర్వహించుటకు దాతలచే యాగ సంకల్పం చేయించి యాగములు ప్రారంభిచారు. అనంతరం సాయంకాలం ఏర్పాటు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతో అలరించాయి.

## తమ్ముడి చేతిలో అన్న హతం



**నూగూర్ వెంకటా పురం, సెప్టెంబర్ 22(జనం సాక్షి) :** ములుగు జిల్లా వెంకటాపురం మండలం లోని చిరుతపల్లి గ్రామం లో ఘోర సంఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాలు ప్రకారం గొంది సాంబశివరావు (30) రెండు నెలలు గా తన తండ్రి ద్వారా సంక్రమించిన భూమి విషయం లో పట్టాలు అయినప్పటికీ తన వాటాకి వచ్చిన భూమిని అమ్ముకోవడానికి అన్న అడ్డుపడుతున్నాడనే విషయంలో రెండు నెలలు గా గొంది మాధవరావుకు సాంబశివరావుకు మధ్య ఘర్షణ జరుగుతోంది. ఈ ఘర్షణలో కోపోద్రిక్తుడైన ఇదే విషయంలో సాంబశివరావు సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయం లో మృతుడు ఇంటి వద్ద ఉండగా గొంది సాంబశివరావు అక్కడికి వచ్చి మృతుడితో మరల భూమి విషయంలో గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. కోపోద్రిక్తుడు అయిన సాంబశివ రావు ఇనుప గడ్డ పారతో మాధవరావు తలపైన కొట్టగా తలకు బలమైన గాయమై మెదడు బయటకు వచ్చి రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుని చెల్లి కోరం నిర్మల పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పిర్యాదు ఇవ్వడం జరిగింది. తన చెల్లి పిర్యాదు మేరకు కేసును ఎస్సై కొప్పుల తిరుపతి రావు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

# అధిక వర్షాలతో జాలువారుతున్న పత్తి పంటలు

- రాలిపోతున్న పత్తి పూత, కాత...
- ఆందోళనలో అన్నదాతలు...



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 22 (జనం సాక్షి):** గత కొద్ది రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలతో పత్తి పంటలు జాలువారిపోతున్నాయి. ఈ ఏడాది వర్షాలు కాస్త ఆలస్యమయ్యాయి. ముందుగా రైతులు వర్షాలు పడతాయో... లేదోనని ఆందోళన చెందారు. పంటలు చేతికందే తరుణంలో మళ్లీ అకాల వర్షాలు గత కొద్ది రోజులుగా అధికంగా కొడుతున్నాయి. దీంతో వేల రూపాయల పెట్టుబడులు పెట్టి పండించిన పత్తి పంటలు అధిక వర్షాల కారణంగా పత్తి చేలల్లో నీరు నిలిచి తమ కళ్ళెదుటే జాలువారి పోతుండడంతో కన్నీటి పర్యంతం అవుతున్నారు. అంతేకాక అధిక వర్షాల కారణంగా పత్తి పంట చేలలో ఉన్న పూత, ఖాతా రాలిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా చెట్లకు కాసిన పత్తికాయల్లోని పత్తి, చెట్ల ఆకులు కూడా నల్ల బారి పోతున్నాయని అంతేకాక కాయలు కూడా మురిగిపోతూ చెట్లు ఎండిపోయే విధంగా తయారయ్యాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా పత్తి పంటలతో తీవ్ర నష్టం వాటిల్లనుందని పెట్టిన వేల రూపాయల పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని గ్రామాల్లోని రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.



## రామప్పను సందర్శించిన అమెరికన్లు

**ములుగు/వెంకటాపూర్, సెప్టెంబర్ 22 (జనం సాక్షి):** వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని అమెరికా దేశానికి చెందిన ఎమిలీ, అన్నా, జాక్, రిచర్డ్, మార్గరెట్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు పూజలు చేసి తీర్థప్రసాదాలు అందచేశారు. వారికి ఆలయ చరిత్ర శిల్పకళా వైభవం గురించి సౌత్ ఇండియన్ గైడ్ రాజేంద్ర, స్టేట్ గైడ్ మధు, రామప్ప టూరిజం గైడ్ విజయ్ కుమార్‌లు వివరించారు. అనంతరం రామప్ప సరస్సును సందర్శించి తిరుగు ప్రయాణమయ్యారు.

# సర్పంచుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

- ములుగు జిల్లా సర్పంచుల పోరం డిమాండ్



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 22(జనంసాక్షి) :** సర్పంచుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ములుగు జిల్లా సర్పంచుల పోరం డిమాండ్ డిమాండ్ **చేసింది.** రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ములుగు జిల్లా పర్యటనలో భాగంగా మేడారం సమ్మక్క సారలమ్మ దేవతల దర్శనానికి వస్తున్న ముఖ్యమంత్రి జిల్లా సర్పంచుల ఫోరం తరుపున పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. మూడు సంవత్సరాల నుండి జిల్లా పంచాయతీ అధికారులు, కలెక్టర్ లు సర్పంచుల చేత వెట్టి చాకిరి చేయించి పనులు చేపట్టించారని, పారిశుద్ధ్య, సైడ్ డ్రైనేజ్, సిసి రోడ్లు, పల్లె ప్రకృతి వనాలు మొదలగు వంటి పనులు అధికారులు సర్పంచుల మెడల మీద కత్తి పెట్టి పని చేయించారని, ఆ వాటికి డబ్బులు బిల్లులు అడిగితే జిల్లా అధికారులు ప్రభుత్వం నుండి నిధులు రావడం లేదు అని అధికారులు చేతులు ఎత్తేస్తున్నారని, నేటి ముఖ్యమంత్రి పర్యటన ను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంచాయతీరాజ్ మంత్రి సీతక్క ఇతర మంత్రులను జిల్లా సర్పంచుల ఫోరం తరపున ముఖ్యమంత్రి ని అడ్డుకుంటామని సర్పంచ్ ఫోరమ్ జిల్లా అధ్యక్షులు భూక్య పవన్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్ తదితరులు తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

- అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజలు ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు నుండి సమస్యల దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ దరఖాస్తుదారుల సమస్యలు నేరుగా అడిగి తెలుసుకుని 42 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి దరఖాస్తు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరిష్కారంలో జాప్యం చేయొద్దని, దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. ప్రతి దరఖాస్తు పరిష్కార స్వభావాన్ని పిర్యాదుదారునికి తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజావాణి ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. భూపాలపల్లి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ప్రజల నుండి మొత్తం 12 వినతిపత్రాలను స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా పరిశీలించిన ఎస్పీ, సంబంధిత అధికారులతో నేరుగా మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టేలా సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రతి సమస్యపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని, ప్రజలకు త్వరితగతిన న్యాయం జరిగేలా కట్టుబడి ఉంటామని, పారదర్శకతతో పనిచేయడం పోలీసు విభాగం ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చడంలో పోలీసు విభాగం ఎల్లప్పుడూ ముందుంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్యతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జైపూర్ మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన మహమ్మద్ రసూల్ బి తన భర్త మరణించారని, తన పిల్లలు తన పోషణ చూసుకోవడం లేదని, ఈ విషయమై తనకు న్యాయం చేసి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. చెన్నూర్ పట్టణానికి చెందిన కొట్ల సతీష్ చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని తన ఇంటికి ఇంటి పన్ను అధికంగా వస్తుందని, సవరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన తనకు గ్రామ శివారులో గల భూమి ఆస్తులు ఉన్న వారి పేర్లు తొలగించి అసలు పట్టాదారులు అయినా తమ పేరిట పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఎ.ఐ.ఎస్.బి. విద్యార్థి సంఘం ప్రతినిధులు తమ దరఖాస్తులో లక్షెట్టిపేట బి.సి. వసతి గృహం, బెల్లంపల్లి ఎస్.సి. వసతి గృహాల విద్యార్థుల సంక్షేమంలో నిర్లక్ష్యం వహిస్తున్న వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కన్నెపల్లి మండలం కొత్తపల్లి గ్రామస్తులు తమ గ్రామంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం ఇంధనపల్లి గ్రామానికి చెందిన పెంద్రం యశ్వంత్ రావు తాను దివ్యాంగుడను అని, గత 10 సంవత్సరాలుగా అద్దె ఇంట్లో నివసిస్తున్నానని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే జారే



**చంద్రుగొండ, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** ఆపదలో ఉన్న వారిని రక్షించాలని తలంపు ఉండాలే గాని ఎవరైనా సహాయం చేయవచ్చని అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేసి చూపించారు. సోమవారం ఎమ్మెల్యే జారే చంద్రుగొండ వస్తున్న క్రమంలో సీతాయగూడెం సమీపంలో ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడిన మహిళను గమనించి వెంటనే తన సిబ్బందిని వేరే వాహనంలోకి పంపించి ఆ మహిళను చంద్రుగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు ఎమ్మెల్యే జారే. అక్కడ ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం వెళ్లేంతవరకు చంద్రుగొండ ప్రభుత్వ వైద్యశాలలో సుమారు అరగంటకు పైగా ఉండి ఆ మహిళను పంపించారు. ఇటువంటి పరిస్థితుల్లో ఎవరైనా స్పందిస్తే ప్రాణాలు కాపాడవచ్చు అని కర్తవ్యం అని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.

## ప్రజావాణి ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను జిల్లా అధికారులు వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావుతో కలిసి పాల్గొని ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు పెండింగ్ లో ఉన్న ఫిర్యాదులపై దృష్టి సారించి తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజవాణిలో భూములకు సంబంధించి 23 ఫిర్యాదులు, డిపిఓకు 7,మున్సిపల్ కమిషనర్లకు 5, ఎంప్లాయిమెంట్ అధికారికి 5,ఎంపీడీవోలకు 4,ఇతర అధికారులకు 17 ఫిర్యాదులు,మొత్తం 61 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.వీటన్నింటిని సంబంధిత శాఖల అధికారులకు పంపడం జరిగిందని,జాగ్రత్తగా పరిశీలించి ఆలస్యం చేయకుండా వేగంగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవ్, డిఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్, డిసిఓ పద్మ, సంక్షేమ అధికారులు దయానంద రాణి, శంకర్, శ్రీనివాస్, నరసింహారావు, పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సూపరింటెండెంట్లు,అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాల కోసం గ్రామపంచాయతీ కార్మికుల వినతి



**చారకొండ, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని వివిధ గ్రామాలలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ చారికి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు బి. ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు నాలుగు నెలల నుండి వేతనాలు పెండింగ్లో ఉన్నాయని,వాటిని వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బోనాల పండుగ, వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా పనిభారం పెరిగినా కార్మికులు వేతనాలు అందక పస్తులుండి పని చేసారు. గ్రామాల అధికారులు మాత్రం పని చెయ్యాలని ఒత్తిడి చేస్తున్నారు.ప్రభుత్వం మల్టిపర్పస్ విధానాన్ని రద్దుచేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం, ఇఎస్ఐ, పిఎఫ్ కల్పించాలని, పెండింగ్లో ఉన్న నాలుగు నెలల బకాయిలు చెల్లించాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 28 లోపు వేతనాలు చెల్లించని పక్షంలో ఈనెల 29న మండలంలోని కార్మికులందరిని సమీకరించి ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి. బాలస్వామి, గ్రామ పంచాయితీ కార్మిక యూనియన్ మండల కార్యదర్శి గెలవయ్య, ఉపాధ్యక్షులు వెంకటేష్, లక్ష్మయ్య సహాయ కార్యదర్శి రవి, లక్ష్మయ్య కవిత కృష్ణ లక్ష్మయ్య మధ్య రామకోటి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికులకు లాభాల వాటా 34 శాతం..

- సగటున ఒక్కొక్క కార్మికుడికి రూ.1.95 లక్షల బోనస్..
- కాంట్రాక్ట్ కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500..
- మొత్తం రూ.819 కోట్లు కేటాయింపు..
- నికర లాభాలు రూ.6,394 కోట్లు..
- లాభాల్లో కొత్త ప్రాజెక్టుల కోసం రూ.4,034 కోట్లు కేటాయింపు..
- ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క..



**గోదావరిఖని, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** సింగరేణి సంస్థ 2024-25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన నికర లాభాలలో సింగరేణి ఉద్యోగులకు 34శాతం లాభాల వాటా బోనస్ చెల్లిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సచివాలయంలో సోమవారం మధ్యాహ్నం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సింగరేణి నికర లాభాలను ప్రకటిస్తూ లాభాల వాటాను వెల్లడించారు.సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో రూ.6,394 కోట్ల రూపాయల నికర లాభాలు సాధించగా,దీనిలో సింగరేణి సంస్థ చేపట్టే కొత్త ప్రాజెక్టుల కోసం రూ.4,034 కోట్లను కేటాయించడం జరిగిందని, మిగిలిన రూ.2,360 కోట్లు నికర లాభాల్లో 34 శాతం సొమ్ము అనగా రూ. 819 కోట్ల రూపాయలను లాభాల వాటా బోనస్ గా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. సింగరేణిలోని సుమారు 41,000 మంది కార్మికులకు 34శాతం లాభాల బోనస్ కింద ఒక్కొక్కరికి సగటున రూ.1,95,610 వరకు లభిస్తాయి.గత ఏడాదితో పోల్చితే సగటున ఒక్కో ఉద్యోగికి 4.4 శాతం అదనంగా రూ.8,289 మేర లాభాల బోనస్ లభించనుండటం విశేషం.గత ఏడాది సగటున ఒక్కో కార్మికుడి రూ.1,87,321 లాభాల బోనస్ చెల్లించడం జరిగింది. అలాగే సింగరేణి సంస్థలో పనిచేస్తున్న మరో 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు ఈ ఏడాది రూ.5,500 బోనస్‌ను కూడా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది కాంట్రాక్టు కార్మికులకు సింగరేణి చరిత్రలో తొలిసారిగా 5,000 రూపాయల బోనస్ ను ప్రజా ప్రభుత్వం చెల్లించిందని పేర్కొన్నారు.

### గనులన్నీ సింగరేణికి దక్కేలా చూస్తాం

తెలంగాణ ప్రాంతంలోని బొగ్గు బ్లాకులు అన్ని సింగరేణి సంస్థకే చెందే విధంగా ప్రత్యేక చొరవ చూపనున్నామని, గతంలో ప్రైవేటు వ్యక్తులు వేలంపాట మార్గం ద్వారా కైవసం చేసుకున్న సత్తుపల్లి, కోయగూడెం ఓపెన్ కాస్ట్ బ్లాకులను కూడా తిరిగి సింగరేణికి అప్పగించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.సింగరేణి సంస్థ ప్రైవేటు సంస్థలకు ధీటుగా పనిచేయాలని, ఓపెన్ మార్కెట్లో ఇతరులు తక్కువ ధరకు బొగ్గు అమ్ముతుంటే,సింగరేణి సంస్థ కూడా తక్కువ ధరకే బొగ్గు అమ్మే స్థాయికి ఎదగాలని తెలిపారు.దేశానికి వెలుగులు ఇస్తున్న సింగరేణి సంస్థను మరింతగా అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు.

### సింగరేణి ఇతర రంగాల్లోకి విస్తరించాలి

సింగరేణి సంస్థ కేంద్ర ప్రభుత్వం నిర్వహించే బొగ్గు బ్లాకుల వేలంపాటలో పాల్గొని కొత్త బ్లాకులు సాధించాలని, కీలక ఖనిజ రంగంలో బ్లాకులు చేపట్టి అభివృద్ధిలో ముందుకు పోవాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు.సింగరేణి సంస్థ కొత్తగా చేపట్టే ప్రాజెక్టులకు నిధులు అవసరమై ఉంటాయని కాబట్టి సాధించిన నికర లాభాల్లో సుమారు 4,034 కోట్ల రూపాయలను కొత్త ప్రాజెక్టుల కోసం కేటాయించడం జరిగిందని, సింగరేణి కార్మికులు సింగరేణి అభివృద్ధికి సహకారం అందించాలని, కార్మిక సంఘాలు కూడా సహకరించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ స్వాగతం పలుకుతూ సింగరేణి సంస్థ ప్రజా పాలనలో రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల సహకారంతో ఒడిశా రాష్ట్రంలో నైని బ్లాకును సాధించిందని, కీలక ఖనిజరంగంలోకి ప్రవేశించిందని, రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మేరకు త్వరలోనే కొత్త బొగ్గు బ్లాక్‌లను వేలం పాట మార్గం ద్వారా సాధిస్తుందన్నారు. సింగరేణి సంస్థ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మరెన్నో విస్తరణ ప్రాజెక్టులు చేపట్టనున్నదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి గడ్డం వివేక్ వెంకటస్వామి,దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాలరావు, షబ్బీర్‌అలీ, పార్లమెంటు సభ్యులు పి.బలరాంనాయక్,రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య, సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, మట్టా రాగమయి, మక్కన్ సింగ్ రాజ్‌ఠాకూర్,గండ్ర సత్యనారాయణ, గడ్డం వినోద్, దానం నాగేందర్, గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి సీతారామయ్య, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్ జనక్‌ప్రసాద్, అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి నరసింహులు, సింగరేణి సంస్థ డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కే వెంకటేశ్వర్లు, డైరెక్టర్ ఈ అండ్ ఎం ఎం.తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్‌మూవ్‌మెంట్ బి వెంకన్న, జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్ మరియు మార్కెటింగ్ టి.శ్రీనివాస్, జనరల్ మేనేజర్ పర్సనల్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

## ధరణిలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు ఎప్పుడు..?

- రెవెన్యూ రికార్డులు తారుమారు..
- టెంపరింగ్ చేసి కొల్లగొట్టిన ఎకరాలు ఎన్ని..?
- రాజకీయ పలుకుబడితో అక్రమాలకు పాల్పడిన బడా నేతలు ఎవరు?




**మర్రిగూడ, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** బిఆర్ఎస్ ప్రభుత్వంలో ధరణిలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు ఎప్పుడు..? రికార్డులను తారుమారు చేసి ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్లు సృష్టించి అక్రమంగా భూములను తమ పేరు మీద బెదిలాయించుకొని కోట్ల రూపాయలు సంపాదించిన బడా నేతలపై ప్రత్యేక కథనం..

నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో గత ప్రభుత్వంలో కీలక నాయకులు ప్రజాప్రతినిధులు ధనార్జనే ధ్యేయంగా రాజకీయ పలుకుబడితో ధరణిలోని లొసుగులను తమకు అనుకూలంగా మలుచుకొని మర్రిగూడ మండలం రెవెన్యూ కార్యాలయంలో ఒక అధికారి సహాయంతో ఎన్నో అక్రమాలు జరిపి భూములను చేరపట్టారు. ఒక అవినీతి అధికారి అన్ని తానై ధరణిలోని లొసుగులను కనిపెట్టి రికార్డులను సైతం తారు మారు చేసి భూములను కొల్లగొట్టారు.ఆ అధికారి అనేక అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తుంది. బడా బాబులకు అప్పనంగా భూములను అప్పజెప్పిన ఆ అధికారి పై మాత్రం విచారణ జరగలేదు. అక్రమాలను శాస్త్రీయంగా నిగ్గుతేల్చేందుకే ఫోరెన్సిక్ ఆడిట్‌ధరణి పోర్టల్‌లో జరిగిన అవకతవకలపై దర్యాప్తు కోసం తెలంగాణ ప్రభుత్వం ఫోరెన్సిక్ ఆడిట్‌ను ఏర్పాటు చేసింది కానీ ఇప్పటివరకు మర్రిగూడ మండలంలో రెవెన్యూ లో జరిగిన అక్రమాల మాత్రం పై విచారణ జరగలేదు. మర్రిగూడ మండలంలోని రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి సంఘంలో బడా బాబులుగా చలామణి అవుతున్న రాజకీయ నాయకుల అసలు రంగును మరోసంచికలో సాక్షాధారాలతో మీ ముందుకు..

## రాజంపేట్ పోలీస్ స్టేషన్ అకస్మిక తనిఖీ



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** విధుల్లో క్రమశిక్షణ, నిబద్ధతపై దృష్టి పెట్టాలి ప్రజలు శాంతియుత వాతావరణంలో దసరా మరియు దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలి జిల్లా ఎస్పీ శ్రీ యం. రాజేష్ చంద్ర ఈరోజు జిల్లా ఎస్పీ శ్రీ యం. రాజేష్ చంద్ర రాజంపేట్ పోలీస్ స్టేషన్‌ను అకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా మొదట రోల్ కాల్‌ను పరిశీలించి హాజరైన మరియు గైర్హాజరైన సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. మానవ వనరులను పూర్తిస్థాయిలో వినియోగం, రోల్‌కాల్ ప్రాముఖ్యతను వివరించి ఇది సిబ్బందిలో నిబద్ధతను, క్రమశిక్షణను పెంపొందించడంలో ఎంతగానో ఉపయోగపడుతుంది అని తెలిపారు. ప్రజల రక్షణనే ధ్యేయంగా భావిస్తూ విధుల్లో నిబద్ధత చూపాలని అన్నారు. డయల్ 100 ద్వారా అందే ఫిర్యాదులపై వేగంగా, సమర్థవంతంగా స్పందిస్తూ, ప్రజలకు విశ్వాసం కలిగించేలా వ్యవహరించాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకత్వాన్ని ఎస్పీ అందించారు. అదేవిధంగా ప్రజలు ప్రశాంత వాతావరణంలో దుర్గా నవరాత్రి ఉత్సవాలు జరుపుకునే విధంగా బందోబస్తు ఏర్పాటు చేయాలని రాజంపేట్ పోలీసులకు సూచించడం జరిగింది.

## ఘనంగా బతుకమ్మ సంబురాలు



**నిజామాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా బతుకమ్మ సంబురాలను జిల్లాలో వైభోపేతంగా నిర్వహించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం ఆయన వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమై బతుకమ్మ వేడుకల నిర్వహణ కోసం చేపట్టాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ ఉత్సవాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాలలో బతుకమ్మ శోభ ఉట్టిపడేలా వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగే బతుకమ్మ ఉత్సవాలలో అన్ని శాఖలు భాగస్వాములు కావాలని, ప్రతీ రోజు ఒక శాఖ తరఫున బతుకమ్మ పండుగను నిర్వహించాలని, 30వ తేదీన సద్దుల బతుకమ్మను పెద్ద ఎత్తున నిర్వహించాలని అన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ, జిల్లాలో బతుకమ్మ వేడుకలు అట్టహాసంగా జరిగేలా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, మెప్మా పీ.డీ రాజేందర్, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సురేష్ కుమార్, పంచాయతీరాజ్ ఈ.ఈ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# లిఫ్ట్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



**చింతలపాలెం, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** పులిచింతల వెనక జలాలను నాలుగు మోటర్లతో ఎత్తిపోసి 53 వేల ఎకరాలకు సాగు నీటిని అందిస్తున్నట్లు రాష్ట్ర నీటి పారుదల,పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన చింతలపాలెం మండలం, పాత వెల్లటూరు వద్ద నిర్మిస్తున్న ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను, దొండపాడు వద్ద రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ పనుల పురోగతిని పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మఠంపల్లి మండలంలో 9 గ్రామాలకి చెందిన 20,466 ఎకరాలు, మేళ్లచెరువు మండలంలో 5 గ్రామాలకి చెందిన 15,829 ఎకరాలు, చింతలపాలెం మండలంలో 9 గ్రామాలకి చెందిన 16,705 ఎకరాలు మొత్తం 53,000 ఎకరాలకి సాగునీరు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ లిఫ్ట్ కింద సాగయ్యే భూములలో 5080 ఎస్టీ కుటుంబాలు, 3540 ఎస్సీలు,8470,బీసీలు,2205 ఓసీలు,మొత్తం 19295 కుటుంబాలకు చెందిన 53000 ఎకరాలకు 1450 కోట్ల రూపాయలతో సాగునీరు అందించటం జరుగుతుందని వివరించారు.ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా నామకరణం చేయడం జరిగిందని, ఈ లిఫ్ట్ ఇరిగేషన్ లో భాగంగా ఇదివరకే 191 ఎకరాలు సేకరించి రైతులకు నష్టపరిహారం కింద 56.45 కోట్లు చెల్లించడం జరిగిందని తెలిపారు.పనులు వేగవంతం చేయడంతో పాటు, నాణ్యతతో నిర్మిస్తూ సెప్టెంబర్ 2026 నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి మొత్తం 53000 ఎకరాలకు సాగునీరు అందించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.అక్కడే కృష్ణానదిలో చేపలు పడుతున్న వీరనాగమ్మ, దాసు లక్ష్మి గోవింద్,హనుమంత్ అనే జాలర్లతో మంత్రి మాట్లాడుతూ సమస్యలు ఏమైనా ఉన్నాయ అని అడిగి తెలుసుకోగా,తమకు సొసైటీ ,లైసెన్స్ ఇప్పించాలని మంత్రితో కోరారు. వెంటనే మంత్రి మత్స్యశాఖ కమిషనర్ తో మాట్లాడి జాలర్లకు సొసైటీ ఏర్పాటు చేసి లైసెన్స్ ఇప్పించాలని,ఏదైనా అనుకోని దుర్ఘటన జరిగితే నష్టపరిహారం అందేలా చూడాలని ఆదేశించారు,తదుపరి జాలర్లతో మాట్లాడుతూ రెండు రోజుల్లో జిల్లా మత్స్యశాఖ అధికారులు వచ్చి మీకు లైసెన్స్ వచ్చే విధంగా చూస్తారని తెలిపారు. అనంతరం దొండపాడు వద్ద నిర్మిస్తున్న రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పరిశీలించి దొండపాడు ౧1 లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా దక్షిణ ప్రాంత రైతులకు సాగునీరు, ఉత్తర ప్రాంతం వైపు కూడా నీరు అందేలా దొండపాడు2 రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిర్మిస్తున్నామని దీని ద్వారా మేళ్లచెరువు,కోదాడ,చిలుకూరు,హుజూర్నగర్ మండలాలకు చెందిన 14100 ఎకరాలకు 394 కోట్ల రూపాయలతో సాగునీరు అందించడం జరుగుతుందని ఇప్పటికే 36 ఎకరాల భూసేకరణ పూర్తి చేసి రైతులకు 15.60 కోట్ల రూపాయలను చెల్లించడం జరిగిందని,మిగిలిన భూసేకరణ కూడా త్వరగా పూర్తి చేయాలని రైతులు కూడా సహకరించాలని సాధ్యమైనంత వరకు రైతులకు న్యాయం జరిగేలా నష్టపరిహారం అందిస్తామని ప్రకటించారు.ఈ ప్రాజెక్టు సంబంధించి ఇంకా ఏమైనా సలహాలు సూచనలు చేయదలచుకుంటే మూడు రోజుల్లోపు ఎస్ఈ నాగభూషణ్ కి దరఖాస్తు ఇవ్వాలని ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ వేగవంతంగా నాణ్యతతో పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.ఈ ప్రాంతంలో రైతులకు సాగునీరు అందించడం ద్వారా ఆర్థికంగా బలపడి జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా నిరంతరం కృషి చేస్తున్నానని కోదాడ,హుజూర్నగర్ నియోజకవర్గాల్లో పాఠశాలలు ,రోడ్లు ,కళాశాలలు, హస్పిటల్లు సాగునీరు అందించి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నానని దీనికి ప్రజలందరూ సహకరించాలని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈ ఎన్ సి రమేష్ బాబు,ఎస్ఈ నాగభూషణం,ఆర్డీఓ శ్రీనివాసులు,ఈఈ సత్యనారాయణ,ఆశోక్ కుమార్,డిఈ లు,ఏఈలు, రైతులు, నాయకులు, అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారుల నిర్మాణానికి భూసేకరణ అటవీ భూముల కేటాయింపు




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ, అటవీ భూముల కేటాయింపు, కోర్టు కేసులు పరిష్కార ప్రక్రియను ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.సోమవారం డా. బి.ఆర్. అంబేడ్కర్ సచివాలయం నుండి రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సిఎస్ రామకృష్ణా రావు, ఆర్ అండ్ బి కార్యదర్శి వికాస్ రాజ్ లతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పనులు వేగవంతం చేయుటపై ముఖ్యమంత్రి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పండుగకు ముందే అన్ని పనులు పూర్తికావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కోర్టు కేసులు ఉన్న భూములకు సంబంధించిన పూర్తి వివరాలను వెంటనే ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్లను ఆదేశించారు.టైటిల్ సమస్యలు ఉన్న భూముల విషయంలో పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేసి, భూములను సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు రహదారి నిర్మాణ పనులు ఆలస్యమవకుండా ప్రతి కేసును అత్యంత ప్రాధాన్యంగా పరిగణించాలని అధికారులకు ఆదేశించారు.భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని స్పష్టం చేశారు.భూసేకరణలో ఎలాంటి ఆలస్యం జరుగకూడదని, జిల్లాల వారీగా సమీక్ష చేపట్టి పురోగతిని పరిశీలిస్తానని జాప్యం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జాతీయ రహదారుల నిర్మాణం రాష్ట్ర అభివృద్ధి, రవాణా సౌకర్యాల మెరుగుదలకు కీలకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ , అటవీ శాఖ అధికారి నికిత, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ విక్టర్,ఎల్లారెడ్డి ఆర్టీవో పార్థసింహారెడ్డి ఆర్ అండ్ బి, నేషనల్ హైవే అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఏఐతో నిఘానేత్రం

## అందిపుచ్చుకుంటున్న స్మార్ట్ నగరాలు

**న్యూఢిల్లీ:**ఒకప్పుడు సీసీటీవీ కెమెరాల స్క్రీన్ల ముందు భద్రతా సిబ్బంది గంటల తరబడి కూర్చుని ఏదైనా అసాధారణంగా కనిపిస్తుందా అని చూసేవారు. కానీ ప్రస్తుతం ఏఐ నిఘా వ్యవస్థవల్ల కంప్యూటర్ విజన్, డీప్ లెర్నింగ్ అల్గరిథమ్స్, న్యూరల్ నెట్‌వర్క్‌లు ఉండి.. మరింత స్పష్టంగా చూస్తూ, మనుషులు చేయగలిగినదానికంటే ఇంకా వేగంగా స్పందిస్తున్నాయి.కంప్యూటర్ విజన్ కెమెరాలు కేవలం వీడియో తీయడమే కాదు దాన్ని రియల్-టైంలో విశ్లేషిస్తాయి. నిషేధిత ప్రాంతంలో ఎవరైనా మూత్రవిసర్జన చేస్తున్నా, ఏదైనా జాతరలో ఎక్కువమంది జనాన్ని గమనించాలన్నా, రద్దీ మార్కెట్‌లో ఏదైనా వస్తువు పోయినా గుర్తిస్తాయి. ఇవి చాలా వేగంగా స్పందించి, సెకండ్లలోనే కంట్రోల్ సెంటర్లను అప్రమత్తం చేస్తాయి.నగరాల్లోని నిఘా వ్యవస్థలలో ఏఐ కెమెరాలను ఉపయోగించడం ద్వారా కేవలం ఘటనలను గుర్తించడమే కాకుండా, ఒకే తరహాలో ఏఐనా జరుగుతున్నా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు తెలుస్తుంది. ముఖాలను, అసాధారణ ప్రవర్తనను గుర్తించి, నేరచరిత్ర ఉన్నవారిని రియల్-టైంలో ఇట్టే పట్టేస్తాయి. తద్వారా వివిధ ప్రాంతాల్లో పదేపదే మోసాలు, నేరాలకు పాల్పడేవారిని గుర్తించడంలో పోలీసులకు సాయపడతాయి. ఏఐ నిఘాకు ఉన్న పరిమితులేంటని ఒకసారి చూసుకుంటే, అది ఎక్కువమంది ప్రజలు గుమిగూడేచోట (అంటే రాజకీయ ర్యాలీలు, కచేరీలు, మతపరమైన కార్యక్రమాలు) కూడా స్పష్టంగా గుర్తిస్తుంది. రియల్ టైంలో రద్దీ నిర్వహణ, రద్దీప్రాంతాలలో పరిశీలనకు ఏఐ మాత్రమే ఉపయోగపడుతుంది. ఈ టెక్నాలజీలో ప్రెడిక్టివ్ ఎనాలసిస్, ప్యాటర్న్ ఎనాలసిస్ ఉపయోగించి ఎలాంటి ముప్పునైనా ముందుగానే అరికడుతుంది.




భారతీయ నగరాలు మరింత పట్టణీకరణతో మరింత రద్దీగా మారుతున్నాయి. వీటిలో మాల్స్, పార్కులు, రైల్వేస్టేషన్లు, రద్దీ రోడ్లు.. ఇలా అన్నిచోట్లా ట్రాఫిక్ పెరిగి భద్రతా సమస్యలు వస్తున్నాయి.అధిక రద్దీ వల్ల తొక్కిసలాటలు, లగేజి పోవడంతో ఖంగారు పడడం, చిన్నచిన్న దొంగతనాలు జరుగుతాయి. అందు వల్ల మరింతగా భద్రతాచర్యలు చేపట్టడం చాలా అవసరం అవుతోంది. అందుకే నగరాలకు భద్రత కల్పించేందుకు ప్రాక్టికల్ పరిష్కారంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత నిఘా వ్యవస్థ గణనీయంగా ఉపయోగపడుతోంది.

మనుషులను ఎక్కడ కావాలో అక్కడ పెట్టడం, సహాయాన్ని సరైన సమయంలో అందించడం కూడా దీనివల్ల సాధ్యమవుతుంది. రద్దీ నియంత్రణ కోసం పుణెలో ఒక పైలట్ స్మార్ట్ సిటీలో ఏఐని ఉపయోగించి, బహిరంగ కార్యక్రమాల్లో అత్యవసర పరిస్థితులను 42% తగ్గించారు.విమానాశ్రయాలు, బస్టాండ్లలో పిల్లలు తప్పిపోయినా, చట్టవిరుద్ధ కార్యకలాపాలున్నా, లగేజి పోయినా ఏఐ కెమెరాలు గుర్తిస్తాయి. ఇవి కదలికలను, వస్తువులను, ఆడియోను కూడా గుర్తిస్తాయి. (ఉదా: రద్దీ ప్రాంతంలో అద్దం పగిలినా పట్టేస్తాయి) దీనివల్ల రాబోయే ప్రమాదాన్ని వెంటనే గుర్తుపట్టగలరు.నేరాల రేటును తగ్గించడం ఏఐ నిఘా వ్యవస్థల ప్రాథమిక పనుల్లో ఒకటి. హైదరాబాద్, బెంగళూరు లాంటి నగరాలు బహిరంగ స్థలాల్లో ఏఐ నిఘావ్యవస్థను ఏర్పాటుచేసి.. చైన్ స్నాచింగ్, ఆస్తినష్టం, ఏటీఎంల చోరీల్లాంటి ఘటనలను 30% తగ్గించగలిగాయి. ఇవి కేవలం నేరాలకు వెంటనే స్పందించడమే కాక.. గతంలో జరిగిన ఘటనల్లో పాల్గొన్నవారిని గుర్తించి ఏదైనా జరగడానికి ముందే భద్రతా దళాలను అప్రమత్తం చేస్తాయి.ఏఐ కెమెరాలు ముఖాలను, నంబర్ ప్లేట్లను, చొరబాట్లను గుర్తించి ఏవైనా తేడా ఉంటే వెంటనే చెబుతాయి. అర్ధరాత్రి ఎవరైనా ప్రహరీ ఎక్కుతున్నా, స్కూలు గేట్లు దాటుతున్నా ఏదో తేడా ఉందని ఏఐ గమనించి, వెనువెంటనే చెప్పేస్తుంది.ఏఐ నిఘా అనేది కేవలం అత్యవసర పరిస్థితుల్లోనే కాదు.. నగర ప్రణాళికల కోసం ఎక్కడెక్కడ ఎలాంటి పరిస్థితి ఉందో సమగ్ర డేటా ఇవ్వడానికీ ఉపయుక్తంగా ఉంటుంది. ఉదాహరణకు రాత్రిపూట పార్కులు నిర్మానుష్యంగా ఉంటే అక్కడ మెరుగైన లైటింగ్, నిఘాను ఏర్పాటుచేసుకోవచ్చు. శనివారం సాయంత్రం బస్టాపులో రద్దీ ఎక్కువగా ఉంటే అక్కడ సదుపాయాలు మెరుగుపరచడంపై దృష్టిపెట్టచ్చు. స్మార్ట్ సిటీ ఇనీషియేటివ్‌లను డిజైన్ చేయడంలో ఈ సమాచారం బాగా ఉపయోగపడుతుంది. కేవలం అంచనాల మీద ఆధారపడి నగర ప్రణాళికలు వేసేకంటే ఇలా చేయడం మంచిది.ఇన్నిరకాల ప్రయోజనాలు ఉన్నా, ఏఐ నిఘా వ్యవస్థ వల్ల గోప్యత విషయంలో కొన్ని సమస్యలున్నాయి. భద్రతకోసమైనా తమమీద నిఘా ఉందంటే వ్యక్తులు ఆందోళనకు గురవుతారు. ఆధునిక ఏఐ నిఘా వ్యవస్థలు చట్టసంస్థలు చెబితే తప్ప వ్యక్తుల మీద అనవసర పరిశీలన లేకుండా వాళ్ల పనులు మాత్రమే గుర్తించగలవు. చట్టపరంగా చూస్తే, ఈ నిఘా వ్యవస్థలలో చాలా వాటిని నగరపాలక సంస్థలు లేదా చట్టాలను అమలుచేసే వ్యవస్థలు డేటా ప్రొటెక్షన్ మార్గదర్శకాల ఆధారంగానే తీసుకుంటాయి. అయితే, ఈ వ్యవస్థ ప్రజాభద్రతను వ్యక్తిగత హక్కులతో బ్యాలెన్స్ చేసేందుకు ఏఐ ఆధారిత పర్యవేక్షణ నియంత్రణకు కఠినమైన జాతీయస్థాయి నిబంధనలు అమలుచేయాలి. దోపిడీలను నిరోధించడానికి ఏఐ నిఘాలో డేటామాస్కింగ్, రోల్ ఆధారిత యాక్సెస్, తాత్కాలికంగా వీడియోలను దాచడం లాంటివి చేయాలి. తరచు ఆడిటింగ్‌తో ఈ చర్యలు తీసుకుంటే చట్టాన్ని వ్యతిరేకించకుండాప్రజలు దీన్ని నమ్మే అవకాశం ఉంటుంది.ఎవరో గమనిస్తున్నారు అనే విధానం మారింది. ఇది నియంత్రణ కాదు.. రక్షణ. ఏఐ నిఘా అనేది ప్రజల ఉద్యోగాలు తీసేసేది కాదు. ప్రజాభద్రతను మరింత స్మార్ట్‌గా, వేగంగా అందిస్తుంది. మనుషులు తీసుకునే నిర్ణయాలకు బదులు రియల్ టైం ఏఐ నిఘాతో మన నగరాల్లో ఉండే ట్రాఫిక్ జామ్‌లు, రద్దీ నిర్వహణ, అత్యవసర పరిస్థితులు, నేరాలు అన్నింటి విషయంలో సులభంగా నిర్ణయాలు తీసుకోవచ్చు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్


| ₹ 1,03,650 | ₹ 1,13,070 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,48,000

## నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్



**న్యూఢిల్లీ:**దేశీయ స్టాక్ మార్కెట్ సోమవారం నష్టాల్లో ముగిసింది. కొత్త హెచ్1బీ వీసా దరఖాస్తుల రుసుము పెంచాలన్న అమెరికా నిర్ణయంతో ఐటీ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి.సెన్సెక్స్ 460 పాయింట్లు తగ్గగా.. నిఫ్టీ 64 పాయింట్ల మేర క్షీణించింది.ఉదయం 82,151.07 వద్ద ప్రారంభమయిన సూచీ రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఒక దశలో 81,997.29 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్ చివరకు 466.26 పాయింట్లు క్షీణించి చివరకు 82,159.97 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 64.90 పాయింట్లు తగ్గి 25,262.15కి దిగొచ్చింది. ఇక రూపాయి మారకం విలువ డాలరుతో పోలిస్తే 15 పైసలు తగ్గి 88.31 వద్ద ఉంది.సెన్సెక్స్ 30 సూచీలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఎటెర్నల్, బజాజ్ ఆటో, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఇన్ఫోసిస్, టెక్‌మహీంద్రా, టీసీఎస్, సిప్లా, విప్రో వంటి కపెనీల షేర్లు నష్టాల్లో ముగిశాయి.

## ప్రమాదంలో మహిళా ఉద్యోగాలు!

**న్యూఢిల్లీ:**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా.. చాలామంది ఉద్యోగాలు కోల్పోతారని పలువురు నిపుణులు చాలా రోజుల నుంచి చెబుతూనే ఉన్నారు. ఇప్పుడు తాజాగా ఏఐ వల్ల ఉద్యోగాలు కోల్పోయేవారిలో మహిళలే ఎక్కువ ఉన్నారని ఐక్యరాజ్యసమితి 'జెండర్ స్నాప్‌షాట్ 2025' నివేదికలో వెల్లడించింది. ఏఐ కారణంగా.. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 28 శాతం మహిళలు ఉద్యోగాలు కోల్పోతారు. ఈ ప్రమాదంలో పడే పురుష ఉద్యోగులు 21 శాతం మాత్రమే అని ఐక్యరాజ్యసమితి నివేదించింది. ఐక్యరాజ్యసమితి 'జెండర్ స్నాప్‌షాట్ 2025' నివేదిక.. ప్రస్తుత అసమానతలను కూడా హైలైట్ చేసింది. ప్రపంచ టెక్ వర్క్‌ఫోర్స్‌లో మహిళలు 29%, టెక్ లీడర్‌లలో కేవలం 14% మాత్రమే ఉన్నారని వెల్లడించింది. ప్రపంచం కొత్త అంతరాయాన్ని ఎదుర్కొంటోంది. మనం గతంలో జరిగిన తప్పుల నుంచి నేర్చుకోకపోతే.. భవిష్యత్తులో అసమానత మరింత ఎక్కువవుతాయని హెచ్చరించింది.


## క్విడ్ స్పెషల్ ఎడిషన్

### 500 మందికి మాత్రమే!



ప్రముఖ కార్ల తయారీ సంస్థ రెనాల్ట్.. భారతదేశంలో క్విడ్ లాంచ్ చేసి పదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా కంపెనీ క్విడ్ 10వ యానివర్సరీ ఎడిషన్‌ను లాంచ్ చేసింది.అయితే దీనిని 500 మందికి మాత్రమే విక్రయించనుంది. రెనాల్ట్ క్విడ్ 10వ యానివర్సరీ ఎడిషన్ ఆటోమాటిక్, మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో లభిస్తుంది. వీటి ధరలు వరుసగా రూ. 5.63 లక్షలు, రూ. 5.14 లక్షలు (ఎక్స్ షోరూమ్). ఇది డ్యూయల్ టోన్ కలర్ ఎంపికలో మార్కెట్లో లాంచ్ అయింది. కాబట్టి ఇది చూడటానికి చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. లిమిటెడ్ ఎడిషన్ క్విడ్ లోపలి భాగంలో 10వ వార్షికోత్సవ నేపథ్యంతో కూడిన సీటు డిజైన్‌లు, ప్రీమియం డీటెయిలింగ్‌లు ఉన్నాయి. సీట్లపై ఎల్లో కలర్ యాక్సెంట్స్, మెటల్ మస్టర్డ్ స్టిచ్‌తో కూడిన లెథరెట్ స్టీరింగ్ వీల్, ఇన్ఫోటైన్‌మెంట్ సరౌండ్, ప్రకాశవంతమైన స్కఫ్ ప్లేట్లు, పుడిల్ లాంప్‌లు మొదలైనవి ఉన్నాయి. ఇందులోని అన్ని సీట్లకు 3-పాయింట్ సీట్‌బెల్ట్‌లు, మల్టిపుల్ ఎయిర్‌బ్యాగ్‌లను పొందుతుంది.

## రూ.200 లోపు రీచార్జ్.. రోజుకు 2 జీబీ డేటా



**న్యూఢిల్లీ:**ప్రభుత్వ టెలికం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ కస్టమర్లను ఆకర్షించేందుకు కొత్త కొత్త, చౌకైన ప్రీపెయిడ్ ప్లాన్లను ప్రవేశపెడుతూనే ఉంది.ఇటీవల అపరిమిత కాలింగ్, రోజువారీ డేటా, ఇతర ప్రయోజనాలతో రూ .199 రీఛార్జ్ ప్లాన్‌ను ప్రకటించింది. రూ.199 ప్రీపెయిడ్ ప్లాన్ లో అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 2 జీబీ హై స్పీడ్ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి. అదనంగా టెలికాం ఆపరేటర్ రీఛార్జ్ పై 2% తగ్గింపును కూడా అందిస్తోంది. ఆసక్తి ఉన్న వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ వెబ్‌సైట్, సెల్ఫ్ కేర్ యాప్ ద్వారా మాత్రమే రీఛార్జ్ చేసుకోవచ్చు.ఇవి కాకుండా, బీఎస్ఎన్ఎల్ బడ్జెట్ ఫ్రెండ్లీ వినియోగదారుల కోసం కేవలం రూ .107 నుండి ప్రారంభమయ్యే ప్రీపెయిడ్ ప్లాన్లను కూడా అందిస్తుంది. ఈ ప్లాన్ 35 రోజుల వాలిడిటీతో వస్తుంది. ఇందులో 3 జీబీ హైస్పీడ్ డేటా, 200 ఫ్రీ వాయిస్ మినిట్స్ (లోకల్, ఎస్టీడీ, రోమింగ్) లభిస్తాయి. అదనంగా, రూ .141 ప్యాక్ కూడా ఉంది. ఇది 30 రోజుల పాటు రోజుకు 1.5 జీబీ, అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 200 ఎస్ఎంఎస్ లను అందిస్తుంది.

# మీరు అలా.. మేము ఇలా..

- అమెరికా పెంచితే మేం రద్దు చేస్తాం
- శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, డిజిటల్ నిపుణులకు వీసా ఫీజులను రద్దు చేసే యోచనలో బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్




**జనంసాక్షి:**కొత్త హెచ్-1బీ వీసాల ఫీజును అమెరికా లక్ష డాలర్లకు పెంచిన వేళ మరో ప్రముఖ దేశం యూకే.. కీలక ప్రతిపాదనల గురించి ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, డిజిటల్ నిపుణులకు వీసా ఫీజులను రద్దు చేసే ప్రతిపాదనలపై బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ యోచిస్తున్నట్లు ఫైనాన్షియల్ టైమ్స్ నివేదించింది.ఈ నివేదిక ప్రకారం.. ప్రపంచంలోని టాప్ ఐదు విశ్వవిద్యాలయాల్లో చదువుకున్న లేదా ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకున్న వ్యక్తులకు వీసా ఖర్చులను పూర్తిగా మాఫీ చేసే ఎంపికలను స్టార్మర్‌కు చెందిన "గ్లోబల్ టాలెంట్ టాస్క్ ఫోర్స్" చర్చిస్తోంది.యూకే గ్లోబల్ టాలెంట్ వీసా కోసం ఒక్కొక్కరికి 766 పౌండ్లు ఖర్చు అవుతుంది. నిపుణుల జీవిత భాగస్వాములు, పిల్లలకు కూడా ఇదే రుసుము వర్తిస్తుంది. దీంతో పాటు దరఖాస్తుదారులు 1,035 పౌండ్లు వార్షిక హెల్త్‌కేర్ సర్‌ఛార్జ్‌ను అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.2020లో ప్రవేశపెట్టిన ఈ వీసా విధానం.. సైన్స్, ఇంజనీరింగ్, హ్యూమానిటీస్, మెడిసిన్, డిజిటల్ టెక్నాలజీ, ఆర్ట్స్ అండ్ కల్చర్ విభాగాల్లో గుర్తింపు పొందినవారికి యూకేలో ఉండే అవకాశం కల్పిస్తుంది.అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీసుకున్న వీసా ఫీజు నిర్ణయంతో బ్రిటన్‌లో సంస్కరణల కోసం ఒత్తిడులు ఊపందుకున్నట్లు చర్చల్లో పాల్గొన్న అధికారులు తెలిపినట్లుగా నివేదిక పేర్కొంది.

## 1.4 కోట్ల ఆధార్ నంబర్లు డీయాక్టివేట్..



**న్యూఢిల్లీ:**యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా 1.4 కోట్లకు పైగా ఆధార్ నంబర్లను డీయాక్టివేట్ చేసింది. ఇవన్నీ చనిపోయినవారికి సంబంధించిన ఆధార్ నంబర్లు.గుర్తింపు మోసాన్ని నిరో ధించడానికి, ప్రభుత్వ ప్రయోజనాలు సరైన చేతుల్లోకి వెళ్లేలా చూడటానికి గత ఏడాది ప్రారంభించిన క్లీన్ అప్ డ్రైవ్ కింద ఈ ఆధా ర్ నంబర్లను డీయాక్టివేట్ చేసింది.సంక్షేమ పథకాల విశ్వసనీయతను కాపాడటానికి, దు ర్వినియోగాన్ని నివారించడానికి మృతుల ఆధార్ నంబర్లను డీయాక్టివేట్ చేయడం చా లా అవసరమని యూఐడీఏఐ సీఈవో భువన ేష్ కుమార్ అన్నారు. నకిలీ క్లెయిమ్‌లు లేదా గుర్తింపు మోసం ద్వారా ప్రభుత్వ నిధులు స్వాహా కాకుండా ఇది నిర్ధారిస్తుందన్నారు. ఆధార్ క్లీనప్ డ్రైవ్‌ను 2024 మధ్యలో ప్రారంభించారు. ఇది నిరంతర ప్రక్రియ. వచ్చే డిసెంబర్ నాటికి 2 కోట్ల ఆధార్ నంబ ర్లను డీయాక్టివేట్ చేయాలని యూఐడీఏఐ లక్ష్యంగా పెట్టుకుందని మరో సీనియర్ అధికారి తెలిపారు. ఆధార్ ప్రక్షాళన కార్యక్రమం కీలక ౦మైనప్పటికీ, సవాళ్లతో నిండి ఉందని, మరణ నమోదుకు ఆధార్ తప్పనిసరి కాకపోవడం అతిపెద్ద అడ్డంకులలో ఒకటి ఆ అధికారి పేర్కొన్నారు.మరణాల డేటాను యూఐ డీఏఐ పలు మార్గాల ద్వారా సంగ్రహి స్తోంది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాం తాల రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్జీఐ) ద్వారా సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సీఆర్ఎస్) రికార్డులను విని యోగించుకుంటోంది. కర్ణాటక, ఢిల్లీ, తమిళనాడు, కేరళ, పంజాబ్, పుదు చ్చేరి, గోవా, రాజస్థాన్, తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల నుంచి స్వతంత్రంగానూ డేటాను సేకరిస్తోంది. ఆధార్ డేటాను అప్డేట్ చేయడానికి బ్యాంకులు, బీమా కంపెనీలు, పెన్షన్ ఫండ్స్, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ అధికారులతో కలిసి పనిచేస్తోంది.

## కెనెడాలో ఖలిస్తానీ ఉగ్రవాది అరెస్ట్

### పన్నూకు అత్యంత సన్నిహితుడుగా పేరు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఖలిస్థానీ ఉగ్రవాది ఇంద్రజీత్ సింగ్‌గోసల్ కెనడాలో అరెస్టయ్యాడు. సిక్స్ ఫర్ జస్టిస్ అనే వేర్పాటు-వాద సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకడైన గుర్‌పత్వంత్ సింగ్ పన్నూకు అతడు సన్నిహితుడు. 2023 నుంచి గోసల్ కెనడాలో ఎస్ఎఫ్‌జే కార్యకలాపాలు చూసుకుంటున్నాడు. ఆయుధాలు కలిగిఉండటం సహా పలు అభియోగాలపై గోసల్‌ను అట్టావాలో తాజాగా అదుపులోకి తీసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. గత నవంబర్‌లోనూ కెనడా పోలీసులు అతడిని అరెస్టు చేశారు. గ్రేటర్ టొరంటో ఏరియాలోని ఒక హిందూ ఆలయం వద్ద చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలో ప్రమేయం ఉందని ఆ సమయంలో ఆరోపణలు వచ్చాయి. తర్వాత షరతులతో కూడిన బెయిల్ మంజూరు అయింది. ఇదిలాఉంటే.. ద్వైపాక్షిక సంబంధాల్లో ఒక కొత్త అధ్యాయానికి తెరతీసేందుకు భారత కెనడాల మధ్య అంగీకారం కుదిరిందని ఇటీవల మన విదేశాంగ ప్రకటించింది. ఈ అంగీకారంలో భాగంగా ఉగ్రవాదం, అంతర్జాతీయ నేరాలను ఎదుర్కొనేందుకు కలిసి పనిచేయాలని నిర్ణయించినట్టు పేర్కొంది.

# పాకిస్తాన్‌లో జనావాసాలపై వైమానిక దాడులు..

- 24 మంది మృతి



ఖైబర్‌పఖ్తుంఖ్వా:పాకిస్తాన్‌లో చోటుచేసుకున్న వైమానిక దాడులు అలజడులను సృష్టించాయి. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో జరిగిన విధ్వంసకర వైమానిక దాడిలో మహిళలు, పిల్లలతో సహా ?మొత్తం 24 మంది ప్రాణాలు కోల్పోయారని స్థానిక మీడియా వర్గాలు ధృవీకరించాయి.శిథిలాల ?కింద చాలామంది చిక్కుకున్నారని, వారిని కాపాడేందుకు, మృతదేహాలను వెలికితీసేందుకు రెస్క్యూ సిబ్బంది శ్రమిస్తున్నారని అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు.ఖైబర్ జిల్లాలోని తిరాను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఈ దాడిలో పాకిస్తాన్ యుద్ధ విమానాలు నివాస ప్రాంతంలో బాంబులు వేసి, నిద్రపోతున్న వారిని పొట్టనపెట్టుకున్నాయి. దాడులలో గాయపడిన వారిలో మహిళలు, పిల్లలు అధికసంఖ్యలో ఉన్నారు. అందుబాటులో ఉన్న ఆస్పత్రులలో బాధితులకు చికిత్స అందిస్తున్నారు. అత్యవసర వైద్య సదుపాయాలు లేకపోవడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నదని వైద్యులు చెబుతున్నారు. కాగా పాకిస్తాన్ ప్రభుత్వం, సైన్యం ఈ బాంబు దాడులపై ఇంకా ఎటువంటి ప్రకటన విడుదల చేయలేదు.

# ఢాకాలో డెంగ్యూ దడ..

## ఒక్క రోజులో రికార్డు స్థాయి మరణాలు



**ఢాకా:**బంగ్లాదేశ్‌ను డెంగ్యూ వ్యాధి పట్టిపీడిస్తోంది. దేశవ్యాప్తంగా అంతకంతకూ పెరుగుతున్న కేసులు, మరణాలు సంఖ్య ప్రభుత్వానికి దడ పుట్టిస్తోంది. దేశంలో డెంగ్యూ కారణంగా ఒక్క రోజులో రికార్డు స్థాయి మరణాల సంఖ్య నమోదైంది. దీర్ఘకాలిక రుతుపవన పరిస్థితులు, దోమల విజృంభణ కారణంగా డెంగ్యూ వ్యాప్తి మరింత తీవ్రమవుతున్నదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ముందస్తుగా గుర్తించడం, సకాలంలో చికిత్స తీసుకోవడం, నిలిచిపోయిన మురుగు నీటిని తొలగించడం ద్వారా డెంగ్యూను తరిమికొట్టవచ్చని వారు సూచిస్తున్నారు.బంగ్లాదేశ్‌లో డెంగ్యూ కారణంగా గడచిన 24 గంటల్లో 12 మంది మృతిచెందారు. రాజధాని ఢాకాలో కొత్తగా 700 కేసులు నమోదయ్యాయని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ తెలిపింది. ఈ సంవత్సరం ఇప్పటివరకు, దేశవ్యాప్తంగా 179 డెంగ్యూ బారిన పడి మృతిచెందగా, 42 వేల మంది డెంగ్యూ బారిన పడ్డారని పేర్కొంది. అధిక సంఖ్యలో పిల్లలు డెంగ్యూ బారినపడి ఆస్పత్రులకు వస్తున్నారని వైద్యాధికారులు చెబుతున్నారు. బాధితులలో చాలామంది అధిక జ్వరం, దద్దుర్లు, తీవ్రమైన నిర్జలీకరణతో బాధపడుతున్నారు. ఇటువంటి సందర్భాల్లో నిర్లక్ష్యం తగదని జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఎబిఎం అబ్దుల్లా తెలిపారు.2023లో దేశంలో డెంగ్యూ కారణంగా రెండువేల మంది మరణించారు. మూడు లక్షల21వేల మందికి పైగా జనం వ్యాధి బారిన పడ్డారు. డెంగ్యూ వైరస్ సాధారణంగా మధ్య , దక్షిణ అమెరికా, ఆఫ్రికా, ఆసియాలోని కొన్ని ప్రాంతాలు, పసిఫిక్ దీవులతో సహా ఉష్ణమండల ప్రాంతాలలో కనిపిస్తుంది. డెంగ్యూ జ్వరం లక్షణాలు దోమ కాటు తర్వాత నాలుగు నుండి 10 రోజుల తర్వాత కనిపిస్తాయి. దోమ కాటు బారినపడకుండా ఉండటమే డెంగ్యూ నివారణకు ఉత్తమమార్గమని వైద్యులు సూచిస్తున్నారు.

## ట్రంప్ ఎన్నడూ ప్రధాని మోదీని వ్యతిరేకించలేదు

### : ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్



**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ లాంటి ప్రపంచ అగ్రనేతలతో వ్యక్తిగత స్నేహం ఉందని, ?అందుకే ప్రధానిమోదీకి అసాధ్యాన్ని సుసాధ్యం చేసే సత్తా ఉందని నూతన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికార యంత్రాంగం భారత్‌పై భారీ వాణిజ్య సుంకాలను విధించినప్పటికీ, భారత్-అమెరికా సంబంధాలలో ఎటువంటి విఘాతం ఏర్పడబోదని ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్‌ల స్నేహాన్ని ఉదహరిస్తూ ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తన తొలి బహిరంగా సమావే శంలో పేర్కొన్నారు. భారతదేశంపై అమెరికా 50 శాతం సుంకం విధించినప్పటికీ ట్రంప్ .. మోదీ తనకు గొప్ప స్నేహితుడని చెబుతూనే ఉన్నారని, ట్రంప్ ఎన్నడూ తాను మోదీని వ్యతిరేకిస్తున్నానని చెప్పలేదని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. మోదీకి ట్రంప్, పుతిన్, జిన్‌పింగ్ మంచి స్నేహితులేనని అందుకే ఆయన(మోదీ) అసాధ్యాలను సుసాధ్యం చేయగలరన్నారు. ప్రధాని మోదీ ప్రసంగాల ఆధారంగా రూపొందించిన నాలుగు పుస్తకాలను ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆవిష్కరించారు. సందర్భంగా ప్రధాని మోదీ వ్యక్తిత్వాన్ని కొనియాడారు.

## పాకిస్తాన్‌కు సౌదీ ఆర్థికదన్ను

- చీప్‌గా అప్పు ఇస్తున్నది ఈ దేశమే..



నగదు కొరతతో బాధపడుతున్న పాకిస్తాన్ ఇతర దేశాలు, అంతర్జాతీయ సంస్థల సహాయంపై తీవ్రంగా ఆధారపడుతుంది. ముఖ్యంగా యునైటెడ్ స్టేట్స్, చైనా, అంతర్జాతీయ ద్రవ్య నిధి కీలక భూమిక వహిస్తున్నా, మరో ముస్లిం దేశమైన సౌదీ అరేబియా కూడా పాకిస్తాన్‌కు స్థిరమైన ఆర్థిక మద్దతును అందిస్తోంది.సౌదీ అరేబియా పాకిస్తాన్‌కు కేవలం 4 శాతం వడ్డీకే రుణాలు అందిస్తోంది. ఇది చైనా, ఇతర అంతర్జాతీయ రుణదాతలతో పోల్చితే చాలా తక్కువ. సౌదీ రుణాల వడ్డీ రేటు చైనాకు చెల్లించే నగదు డిపాజిట్ వడ్డీ కంటే మూడింట ఒక వంతు మాత్రమే. విదేశీ వాణిజ్య రుణాల ఖర్చుతో పోలిస్తే కూడా సౌదీ రుణ ఖర్చు సగం కంటే తక్కువ.పాకిస్తాన్ రుణాలను సకాలంలో తిరిగి చెల్లించకపోయినా, సౌదీ అరేబియా అదనపు రుసుములు లేకుండా ప్రతి సంవత్సరం రుణ గడువును పొడిగిస్తోంది. ప్రస్తుతం పాకిస్తాన్‌కు సౌదీ అరేబియా ఇచ్చిన 2 బిలియన్ డాలర్ల రుణం గడువు డిసెంబర్‌లో ముగియనుంది. అయితే సౌదీ ఆర్థిక మంత్రిత్వ శాఖ దీన్ని మళ్లీ పొడిగించాలనే యోచనలో ఉంది.ఐఎంఎఫ్ ప్రోగ్రాం కింద పాకిస్తాన్‌కు సౌదీ అరేబియా ఇచ్చిన మరో 3 బిలియన్ డాలర్ల రుణానికి వచ్చే ఏడాది జూన్లో గడువు ముగుస్తుంది. పాకిస్తాన్ తన బాహ్య ఆర్థిక లోటును పూడ్చుకోవడానికి ఈ రుణాన్ని తీసుకుంది.

# తెలంగాణ రాష్ట్రంలో మున్నూరు కాపులు ఐక్యంగా ముందుకు సాగాలి

**మాజీ మంత్రి , కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్**



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 22(జనంసాక్షి):** తెలంగాణలో మున్నూరు కాపులు ఐక్యంగా ముందుకు సాగి గ్రామ స్థాయి నుండి మున్నూరు కాపులను సంఘటితం చేసి ఏకతాటిపై నడిపించేందుకు కృషి చేయాలని మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు గంగుల కమలాకర్ తెలిపారు. సోమవారం కరీంనగర్‌లోని వారి క్యాంపు కార్యాలయంలో మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గంగుల కమలాకర్ సభ్యత్వం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్థానిక శాసనసభ్యులు గంగుల కమలకర్ మాట్లాడుతూ... తెలంగాణలో మున్నూరు కాపులు ఐక్యంగా ముందుకు సాగి రాజకీయాలకతీతంగా సదస్సులు సమావేశాలు నిర్వహించి మున్నూరు కాపులను చైతన్య పరచాలని అన్నారు. మారుమూల గ్రామంలో కూడా మున్నూరు కాపు సంఘాలను ఏర్పాటు చేసి మున్నూరు కాపు కులాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుక వెళ్లే దిశగా ముందుకు సాగలన్నారు. మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరి శంకర్ మాట్లాడుతూ... మున్నూరు కాపుల అందరిని సంఘటిత పరిచి ఒక తాటిపైకి తీసుకువెళ్లేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని మున్నూరు కాపులందరు సభ్యత్వ నమోదును వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రంలోనే కరీంనగర్ జిల్లా మున్నూరు కాపు సభ్యత్వ నమోదులో ప్రథమ స్థానం ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగులతో పాటు మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కనకం అమర్ బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బొల్లం లింగమూర్తి, కార్యదర్శి పూదరి తిరుపతి, సంయుక్త కార్యదర్శి వాసాల హరీష్, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి సత్తినేని శ్రీనివాస్, నాయకులు మిడిదొడ్డి నవీన్, మున్నూరుకాపు కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు

- పేదోడి సొంత ఇంటి కళ కలగానే మిగిలిపోతోంది
- ముత్తారం మండలంలో ఇందిరమ్మ పథకానికి అర్హులకు దూరం
- బిఆర్ఎస్ పార్టీ నాయకులు పోతిపెద్ది కిషన్ రెడ్డి



**ముత్తారం, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం నిజమైన పేదలకు అందడం లేదని బీఆర్ఎస్ పార్టీ ముత్తారం మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి ఆరోపించారు. సోమవారం పోతారం గ్రామంలో దళిత బంధు నియోజకవర్గ అధ్యక్షుడు, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఊట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ప్రజల సొంత ఇంటి కల నెరవేరడం లేదని విమర్శించారు. మండలంలోని పలు గ్రామాల్లో అర్హులైన నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయకుండా కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులు తమకు అనుకూలమైన వారికే ఇండ్లు కేటాయించేలా అధికారులపై ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. గ్రామాల్లో సర్వే పేరుతో పదుల సంఖ్యలో నిరుపేదలను గుర్తించినా, అసలైన లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు కాకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్‌కు అనుకూలమైన వారికే ఇండ్లు కేటాయిస్తూ నిరుపేదలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. పోతారం, అడవిశ్రీరాంపూర్ గ్రామాల్లో అర్హత ఉన్న నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయలేదని, ఈ విషయమై పెద్దపల్లి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంథని నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి, ఎన్నికల మేనిఫెస్టో చైర్మన్‌గా ఉన్న దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిరుపేదల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ అనుకూల కార్యకర్తలకు, అనర్హులకు ఇండ్లు మంజూరు చేస్తూ నిరుపేదలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. జిల్లా కలెక్టర్ ఈ అన్యాయాన్ని సమీక్షించి, పారదర్శక సర్వే నిర్వహించి నిజమైన పేదలకు ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు అత్తె చంద్రమౌళి, ముత్తయ్య, మాజీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు నూనె కుమార్, మాజీ సర్పంచులు ఒడ్నాల రాజు, ఇల్లందుల అశోక్, పీఏసీఎస్ డైరెక్టర్ గిరి వీరేందర్, మాజీ ఏఎంసీ డైరెక్టర్లు పప్పు చంద్రమౌళి, కూరాకుల ఓదెలు, గ్రామ శాఖ అధ్యక్షులు జంగా వెంకట్ రెడ్డి, నిమ్మతి రమేష్, అలువోజు రవీందర్, నరెడ్ల రమేష్, నిరటి రవి, బీఆర్ఎస్ నాయకులు తాత బాలు, దామోదర్, రామగాళ్ల రమేష్, భూపెల్లి మొగిలి, ఏజ్ల తిరుపతి, రామంచ ఓదెలు, సంపత్, జంగా స్వామి, ఇట్టం గట్టయ్య, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అరికెపూడి గాంధీ కబ్జా భూములు స్వాధీనం చేసుకోవాలి





- జెసిబి మెషిన్లకు అడ్డుగా నిలబడతా... ఎమ్మెల్సీ కవిత
- హైడ్రా పేదల గూడులు కూల్చి.. బడా బాబుల భూములు కాపాడటం సిగ్గు
- పునరావాసం లేకుండా కూల్చివేతలు చట్టవిరుద్ధం : ఎంపీ ఈటల రాజేందర్

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** హైడ్రా కూల్చివేతలకు వ్యతిరేకంగా ఎమ్మెల్సీ కవిత, మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆదివారం గాజులరామారం సర్వే నంబర్ 307లోని గాలిపోచమ్మ బస్తి, బాలయ్యనగర్‌లో నిరాశ్రయులైన నిరుపేదలను పరామర్శించి ధైర్యం చెప్పారు. సోమవారం జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత, మల్కాజ్గిరి బీజేపీ పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ కూల్చివేతలు జరిగిన బస్తీల్లో పర్యటించి బాధితుల సమస్యలను తెలుసుకున్నారు. దమ్ముంటే బడా బాబుల కబ్జాలను ఆపండని, శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కబ్జా చేసిన 12 ఎకరాల భూమిని హైడ్రా వెంటనే స్వాధీనం చేసుకోవాలని కవిత సవాలు విసిరారు. 307 సర్వే నంబర్‌లోని కబ్జాల్లో ఎవరి హస్తం ఎంత ఉందో తనకు తెలుసని, సమయం వచ్చినప్పుడు అందరి పేర్లు బయటపెడతానని హెచ్చరించారు. పైసా పైసా కూడబెట్టుకొని 60 గజాల్లో గూడులు నిర్మించుకున్న బడుగు జీవులపై హైడ్రా, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతాపం ఏమిటని ప్రశ్నించారు. తిరిగి వచ్చే నెల ఆరో తేదీన కూల్చివేతలు చేస్తామని ప్రజలను భయపెడటం ఎంత సమంజసమని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రా ఈసారి కూల్చివేతలు చేస్తే జెసిబి మెషిన్లకు తానే అడ్డుగా నిలబడతానని, ముందుంటానని హెచ్చరించారు. నివాసులకు పునరావాసం కల్పించకుండా కూల్చివేతలు చేయడం చట్టవిరుద్ధమన్నారు.

శని, ఆదివారాల్లో ఎలాంటి కూల్చివేతలు జరపవద్దని కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, ఆదివారం, పండుగ రోజు కూల్చివేతలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. హైడ్రా కూల్చివేతలను వ్యతిరేకిస్తూ మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ సోమవారం సంఘటన స్థలాన్ని చేరుకొని కాలినడకన కూల్చివేతలను పరిశీలించారు. ఈ సందర్భం గా పలువురు బాధితులు తమ బాధలు వినిపించుకున్నారు. అనంతరం మాట్లాడిన ఈటల రాజేందర్, 60 గజాల్లో వెలిగిన 300 గూడులను కూల్చి 300 ఎకరాలను కాపాడామని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం సిగ్గుగా ఉందన్నారు. బడా బాబులను వదిలేసి నిరుపేదలపై మీ ప్రతాపం ఏమిటని ప్రశ్నించారు. నాటి నిజాం సర్కార్ కన్నా క్రూరంగా ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. ఇక్కడ నివసిస్తున్న పేదలతో మాట్లాడి, వారికి ప్రత్యామ్నాయం చూపించిన తర్వాతే ముందుకు వెళ్లాలని సూచించారు.

# సంఘవికాసంతోనే దేశాభివృద్ధి

- విశ్వ శాంతికి భారతీయ విలువలే ఆధారం
- ఆర్ఎస్ఎస్ విభాగ్ సహసంఘచాలక్ డాక్టర్ రమణాచారి




**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** సంఘవికాసంతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆర్ఎస్ఎస్ విభాగ్ సహ సంఘచాలక్ డాక్టర్ చక్రవర్తుల రమణాచారి అన్నారు. కరీంనగర్లోని స్థానిక శిశు మందిర్ లో వారం రోజులపాటు జరుగుతున్న శిక్షావర్గ ప్రారంభ ఉపన్యాస కార్యక్రమంలో డాక్టర్ రమణాచారి మాట్లాడారు. దేశాన్ని మాతృభూమిగా ప్రేమించే స్వయంసేవకులలో అనుశాసనం, దేశభక్తి, సేవాభావం వంటి గుణాల నిర్మాణం ఆర్ఎస్ఎస్ శాఖలో నిర్మాణం జరుగుతుందని వివరించారు. 1925 నుండి సంఘ శాఖల ద్వారా వ్యక్తి నిర్మాణము జరుగుతుందని ఆయన తెలిపారు. శరీరంలోని ప్రతి కణం శరీర ధారుఢ్యానికి ఏ విధంగా పనిచేస్తాయో, దేశంలోని సామాన్య వ్యక్తులు దేశ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని అన్నారు. భారతదేశ పరమ వైభవం ద్వారానే విశ్వ కళ్యాణం, విశ్వశాంతి సాధ్యపడుతుందని చెప్పారు. శిక్షణకు వచ్చిన స్వయంసేవకులు గ్రామీణ క్షేత్రాలలో సంఘ శాఖల నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యవాహ సత్యనారాయణ , మల్లోజుల కిషన్ రావు, శిక్షణకు వచ్చిన స్వయం సేవకులు తదితరులు పాల్గొన్నారు.



## నియోజకవర్గ పరిధిలోని రోడ్లకు మహర్దశ

**త్వరలోనే తీరనున్న ప్రజలు ఇబ్బందులు**

**వేములవాడ (జనంసాక్షి):** వేములవాడ నియోజకవర్గంలోని పలు రోడ్లకు మహర్దశ పట్టనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో,రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో వేములవాడ నియోజకవర్గ పరిధిలోని పలు రోడ్లను హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (ఎచ్ ఏ.ఎం) పథకం కింద రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇటీవల హామ్ విధానంలో రోడ్ల నిర్మాణనికి రాష్ట్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. ఇందులో భాగంగా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని వేములవాడ, కొరుట్ల ప్రధాన రహదారి వయా మర్రిపల్లి, మర్రిగడ్డ చందుర్తి రుద్రంగి,పోశానిపేట కథలపూర్ మిదిగా కొరుట్ల వరకు,చందుర్తి మండల పరిధిలో చందుర్తి-మోత్కురావు పేట మధ్య 10 కిలోమీటర్లు,కొనరావుపేట మండల పరిధిలోమామిడిపల్లి నిజామాబాద్ గ్రామాల మధ్య 4.70 కిలోమీటర్లు,బావుసాయిపేట వెంట్రావుపేట గ్రామాల మధ్య 3.30 కిలో మీటర్లు,వట్టిమల్ల నిమ్మపల్లి గ్రామాల మధ్య 2.90 కిలోమీటర్ల, వేములవాడ బ్రాంచ్ రోడ్డు వయా చింతల్టన,వేములవాడ మున్సిపల్ వరకు 4.30 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. త్వరలోనే నిధులు మంజూరు కాబడి రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.

# చిరు వ్యాపారుల సంక్షేమానికి లోక్ కళ్యాణ్ మేళా!

**మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్**





**రాయికల్,సెప్టెంబర్ 22 (జనం సాక్షి):** చిన్న వ్యాపారుల సంక్షేమానికి లోక్ కళ్యాణ్ మేళా పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని రాయికల్ మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ అన్నారు.మెప్మా కార్యాలయంలో పథకం అర్హుల నుండి పత్రాలను స్వీకరించే సందర్భంలో ఆయన మాట్లాడుతూ..పీఎం స్వానిధి పథకం కింద చిన్న చిన్న వ్యాపారులు,వీధి వ్యాపారులకు మరింత ప్రోత్సాహం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, లోక్ కళ్యాణ మేల ఉత్సవాలు ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు జరపాలని కేంద్ర ఆదేశాల నేపథ్యంలో, రాయికల్ మున్సిపల్ పరిధిలో ఈ పథకంపై మెప్మా ఆర్పీలు చిరు వ్యాపారులకు, వీధి వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నారనీ,.గతంలో వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులు 10 వేల రూపాయల రుణాన్ని పొందగా,ఇప్పుడు ఆ మొత్తం 15 వేల రూపాయలకు పెంచారని, అంతేకాక, ఇప్పటికే రుణం తీసుకుని చెల్లింపులు సక్రమంగా చేసినవారికి మరింత సాయం అందిస్తూ, 25 వేల రూపాయల రుణం పొందే అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. వ్యాపార అవసరాలకు అనుగుణంగా ఈ రుణాలను అందించడం జరుగుతుందని వివరించారు. రాయికల్ మున్సిపల్ పరిధిలోని వ్యాపారులు,వీధి వ్యాపారులు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని కోరుతూ,అవసరమున్నవారు ఆర్పీలు లేదా మెప్మా సీవో, టీఎంసీ అధికారులను సంప్రదించి తమ వ్యాపారాల వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులు, చిరు వ్యాపారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని,పథకం యొక్క ప్రయోజనాలను పొందాలని మెప్మా టీఎంసీ శరణ్య సూచించారు. పథకంయొక్క ప్రయోజనాలు అందరికీ చేరేటట్లు మెప్మా ఆర్పీలు అందరికీ అవగాహన కల్పిస్తున్నారని ఆమె తెలిపారు.పథకానికి అర్హులైన వారి నుండి పత్రాలను మంగళవారం మెప్మా కార్యాలయంలో స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

# బతుకమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** జిల్లాలో బతుకమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ జిల్లాలో బతుకమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ సాంస్కృతి మరియు పండుగ వాతావరణం వెల్లివిరిసేలా వివిధ శాఖల అధికారుల సమన్వయంతో జిల్లావ్యాప్తంగా బతుకమ్మ పండుగ నిర్వహించాలని అన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ లైట్లతో ముస్తాబు చేయాలని, జిల్లాలో బతుకమ్మ హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని, మున్సిపాలిటీలు మరియు గ్రామాలలో బతుకమ్మ ఆడే ప్రాంతాలు మరియు బతుకమ్మను నిమజ్జనం చేసే చెరువులు ఇతర నీటి వనరుల వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, మైకులను ఏర్పాటు చేయాలని, పరిసరాలను శుభ్రపరచాలని, నిమజ్జనం ప్రాంతంలో గజఈతగాలను అందుబాటులో ఉంచాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో పౌష్టికాహారం మేళాలను నిర్వహించాలని, కలెక్టరేట్ లో సద్దుల బతుకమ్మ వరకు ప్రతీ రోజు ఒక డిపార్ట్మెంట్ బతుకమ్మ పండుగను నిర్వహించాలని, 30వ తారీకు సద్దుల బతుకమ్మ రోజు కలెక్టరేట్ లో ప్రభుత్వ ఉద్యోగులచే పెద్ద ఎత్తున బతుకమ్మ పండుగ నిర్వహించాలని ఆదేశించారు. బతుకమ్మ పండుగ ఉత్సవాలకు జిల్లా నోడల్ అధికారిగా డిఆర్డిఓ అన్ని పనులు సక్రమంగా జరిగేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని డిఆర్డిఓ సురేందర్ ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్,ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు..



## శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ హుండీ చోరీ

**రుద్రంగి సెప్టెంబర్ 22 ( జనం సాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో దొంగలు చొరబడి హుండీ మరియు సామగ్రిని దొంగిలించారు. ఆలయం అటవీ ప్రాంతంలో ఉండడంతో ఆలయానికి వేసిన తాళాన్నీ పగులకొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. అలాగే హుండీని పగులకొట్టి హుండీలోని ఆదాయాన్ని ఇతర సామగ్రిని దొంగిలించారు. ఆలయ పూజారి ఇచ్చిన సమాచారం మేరకు స్థానిక ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన ప్రదేశాలను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

# పరిశుభ్రత, సురక్షిత విధానాలు పాటించాలి

**అడిషనల్ కమిషనర్ మారుతీప్రసాద్.**



**గోదావరిఖని, జనంసాక్షి :** వీధుల్లో ఆహార పదార్థాలు తయారు చేసి విక్రయి ంచేవారు పరిశుభ్రత, సురక్షిత విధానాలు పాటించాలని అడిషనల్ కమిషనర్ మారుతీప్రసాద్ అన్నారు. లోక్ కళ్యాణ్ మేళాలో భాగంగా రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం చిరువ్యాపారులకు భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఎ) రూపొందించిన నియమావళిపై మెప్మా ఆధ్వర్యంలో శిక్షకులు ఈశ్వర భరద్వాజ్‌చే అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ ఆహారం ద్వారా సంక్రమించే అనారోగ్యాలను నివారించడానికి ఎఫ్ఎస్ఎస్ఎ రూపొందించిన నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని అన్నారు. పని చేసే కార్మికులు శుభ్రతా ప్రమాణాలు పాటించడం,నాణ్యమైన ముడి సరుకులు వినియోగించడం, పరిసరాలు పరిశుభ్రంగా ఉండడం ఆహార పదార్థాల విక్రయశాలలకు తప్పనిసరని అన్నారు.వ్యాపార అభివృద్ధి కొరకు బ్యాంకుల సహకారంతో వీధి వ్యాపారులకు ఇస్తున్న సబ్సిడీ రుణాలు, క్రెడిట్ కార్డులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, మెప్మా డిఎం సి మౌనిక, సిఓలు ఊర్మిళ, శ్వేత, ప్రియదర్శిని, శమంత పాల్గొన్నారు.

**స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమ లక్ష్యాన్ని నెరవేర్చాలి:** స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమ లక్ష్యాన్ని నెరవేర్చాలని రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో సోమవారం లింగాపూర్ ఎక్స్ రోడ్డు లో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆయన స్వయంగా చీపురుపట్టి శుభ్రం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన సమ్మర్ధం ఎక్కువగా ఉండే ప్రాంతాల పరిశుభ్రత పై దృష్టి పెట్టి లింగాపూర్ ఎక్స్ రోడ్డు బస్‌స్టాప్ పరిసరాలను పరిశుభ్ర పరిచే కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు.ఈ సందర్భంగా అందరితో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రావు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మధుకర్, వార్డు అధికారులు, జవాన్లతో పాటు ఎకో వారియర్స్ సంస్థ ప్రతినిధులు శివకృష్ణ,మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 89 ఫిర్యాదులు

**నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్**

**నిజామాబాద్ జిల్లా బ్యూరో (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 89 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ తో పాటు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, మెప్మా పీడీ రాజేందర్, ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎడపల్లి మండల నూతన కమిటీ తీరుపై అసంతృప్తి

- ఎమ్మెల్యే మెప్పుకోసం నానా తంటాలు
- కొమ్ముకాస్తున్న కొంతమంది ప్రజాప్రతినిధులు

**ఎడపల్లి, సెప్టెంబర్ 22 ( జనంసాక్షి ) :** ఎడపల్లి మండలంలో నూతన ప్రెస్ క్లబ్ అంటూ ఏర్పాటు చేసుకున్న కమిటీ తీరుపై కొంతమంది పత్రికా విలేకరులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అర్హత లేకపోయినప్పటికీ కమిటీని ప్రకటించుకోవడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. అయితే కొంతమంది ప్రజాప్రతినిదులు సైతం తమ ఉనికిని కాపాడుకునేందుకు నూతన కమిటీ సభ్యులకు వత్తాసు పలకడం కోసం మెరుపు. ప్లాట్ల పేరుతో ఇతర విలేకరులను మభ్యపెట్టి వారిపై ఒత్తిడి తీసుకుని వచ్చి నూతన కమిటీని ఏర్పాటు చేశారనే ఆరోపణలు మండలంలో జోరుగా సాగుతున్నాయి. ఇందుకు ప్రధానంగా ఓ బడా ప్రజాప్రతినిధి తన స్నేహితుని కోసం నానా తంటాలు పడుతున్నారనే ఆరోపణలు సైతం జోరుగా వినిపిస్తున్నాయి. అందులో భాగంగా ఏకంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని సైతం తప్పుదోవ పట్టించి ఎలాంటి అర్హత లేని విలేకరుల జాబితాను సార్ వద్దకు తీసుకెళ్లి వీరే అసలైన విలేకరులంటూ నమ్మించడంను మండలంలో గుర్తింపు పొందిన విలేకరులు జీర్ణించుకోలేకపోతున్నారు. రానున్న ఎన్నికల దృష్టిలో పెట్టుకొని ఓటు బ్యాంకు కోసం తమ స్నేహమనే హస్తాన్ని జాపి ఓట్లు దండుకోవచ్చునే ఆలోచనలో సదరు ప్రజాప్రతినిధులు నూతన కమిటీకి వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు సైతం జోరుగా వినిపిస్తున్నాయి. నూతన కమిటీలో గుర్తింపు లేని వారికి సైతం ప్రధాన ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు అక్రిడేషన్ జర్నలిస్టులకు ఎలాంటి ప్రాధాన్యత లేకపోవడం సిగ్గుచేటని మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాంటి కమిటీలకు నాయకులు వత్తాసు పలకడంలో మతలబు ఏమిటో ప్రతి ఒక్కరికి తెలిసిందేనని అనుకుంటున్నారు. కేవలం ప్లాట్ల బూచి చూపించి అనర్హులతో అర్హులయిన విలేకర్ల నోళ్లు మూపించే విధంగా సదరు ఓ చానల్ విలేఖరి అని చెప్పుకునే వ్యక్తి ఆడుతున్న నాటకమని ప్రతి ఒక్కరికి తెలిసిన విషయమే అయినప్పటికీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని ఎదురించి ఆయన దృష్టిలో చెడు కాకూడదనే భావనతో అక్రిడేషన్ జర్నలిస్టులు స్తబ్దంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కమిటీ ఏర్పడితే అక్రిడేషన్ జర్నలిస్టులకు సముచిత న్యాయం దక్కాల్సి ఉండగా కేవలం తమ వర్గంకు చెందిన ఎలాంటి అర్హత లేకపోయినా వారికి పదవులను అప్పజెప్పి మిగతా వారిని డమ్మీలుగా ఉంచడంను సైతం అక్రిడేషన్ జర్నలిస్టులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వారికి నచ్చినట్టు ఉంటే పత్రిక లేకపోయినప్పటికీ, యూట్యూబ్ అయినప్పటికీ ప్రెస్ క్లబ్‌లో చోటు కల్పించడం వారి ఇష్టారాజ్యానికి పరాకాష్టగా మారిందని స్పష్టంగా చెప్పవచ్చు. మచ్చలేని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిపై ఉన్న అభిమానంతోనే కొంతమంది విలేకరులు నూతన కమిటీకి వత్తాసు పలుకగా మరి కొంతమంది తమకు ప్లాట్లు ఇప్పిస్తే చాలు అంటూ వారికి జేజేలు కొట్టడం కొస మెరుపుగా చెప్పవచ్చు. అయితే ఈ విషయంలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చొరవ తీసుకొని అసలు మండలంలో నిజమైన విలేకరులు ఎవరు... ప్రభుత్వం గుర్తించిన విలేకరులు ఎంతమంది... గుర్తింపు లేని విలేకరులు ఎవరు అనే అంశంపై విచారణ చేపడితే ఈ నకిలీల బెడద తప్పుతుందని అటు నాయకులు ఇటు అధికారులు లోలోపల అనుకుంటున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్పందించాలని మండల ప్రజలు సైతం కోరుతున్నారు.

# ప్రతిభకు పట్టం కట్టిన అల్ఫోర్స్ అటెంప్ట్ 2025 పరీక్ష

**అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి**



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందించాలని ప్రతిభగల వారిని ప్రోత్సహించడం చాలా అవసరమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ లో అల్ఫోర్స్ విద్యాసంస్థల వారి ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి "అటెంప్ట్" పరీక్ష ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర విద్యా రంగంలో అనేక సంచలనాత్మక ఫలితాలను సాధించడమే కాకుండా ఎంతో మంది విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందించడంతోపాటు వారిని ఉన్నత స్థానాల్లో స్థిరపడేటట్టు అల్ఫోర్స్ కృషి ప్రశంసనీయమన్నారు. విద్యార్థులకు న్యాణ్యమైన విద్యను అందించడం లక్ష్యంగా భారతదేశంలో అత్యుత్తమ అధ్యాపకులచే రెండు సంవత్సరాల పాటు ఐఐటి, నీట్ లో అత్యుత్తమ శిక్షణ పొందడానికై ప్రోత్సాహకాలను అందించడానికి ఈ పరీక్షను తెలంగాణ రాష్ట్రంలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో సోమవారం వేడుకగా నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. రెండు రోజుల్లో ఈ ఫలితాలను ప్రకటించడం జరుగుతుందని అత్యుత్తమ, విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలతో పాటు విద్యాసంస్థల్లో విద్యను అభ్యసించడానికి అవకాశం కల్పిస్తామని వారు తెలిపారు. సోమవారం నిర్వహించిన పరీక్షలో 634 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్ష ఎస్ ఎస్ సి , సిబిఎస్ఈ 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించడం జరిగిందని, అల్ఫోర్స్ పట్ల విశ్వాసం కలిగి వారి పిల్లలని ఈ పరీక్షకు హాజరయ్యే విధంగా ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రారంభానికి ముందు వారు విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి పరీక్ష సంబంధించినటువంటి మార్గదర్శకాలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, వివిధ పాఠశాలల యజమాన్యాలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఊహకందని వర్షాలతో ఉక్కిరిబిక్కిరైన కామారెడ్డి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** ఊహకందని వర్షాలతో ఉక్కిరిబిక్కిరైన కామారెడ్డి జిల్లాలోని తోటి మానవులకు సాటివారిగా సాయం చేద్దామని పెద్ద మనసుతో టిఎస్పిఆర్టి యు కామారెడ్డి జిల్లా శాఖ పిలుపుమేరకు జిల్లా కలెక్టర్ ఫ్లడ్ రిలీఫ్ ఫండ్ కొరకు రూ.7,06,011 ఏడు లక్షల ఆరు వేళా పదకొండు రూపాయలు జిల్లా కలెక్టర్ సహాయ నిధికి డిడి రూపములో ఈ రోజు కలెక్టర్ కార్యాలయ ములో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు సమక్షంలో కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ కి అందించడం జరిగింది. సహాయ నిధికి స్పందించిన పిఆర్టియు జిల్లా బాధ్యులను కలెక్టర్ అభినందించి ఆపద సమయంలో ఆదుకునేందుకు ముందుకు వచ్చిన మీరు ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలిచారని,ఇలాంటి సామాజిక కార్యక్రమాలను మరిన్ని నిర్వహించి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అల్లాపూర్ కుశాల్ మాట్లా డుతూ పిఆర్టియు సంఘం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కొరకే కాకుం డా, సామజిక కార్యక్రమాలలో ముందుంటుందని, గతములో కామారెడ్డి జిల్లా ఏర్పడిన నుండి అనేక సామాజిక కార్యక్రమాలను ముఖ్యంగా 39 పాఠశాలలను దత్తత తీసుకొని మౌలిక వసతులు కల్పించడం జరిగిందని అదేవిధంగా రెడ్ క్రాస్ సౌజన్యముతో 6 సార్లు రక్తదాన శిబిరాలను నిర్వహించి ఇప్పటి వరకు 900పై చిలుకు బ్లడ్ యూనిట్స్ ఇవ్వడం, కరోనా కాలములో పేదలకు అందించిన 22 రోజులు నిరంతరా యంగా కామారెడ్డి, బాన్సువాడ పట్టణాలలో ప్రతిరోజు 200 మందికి అన్నదానం, అదేవిధంగా అన్ని మండల శాఖలు పేదలకు ఫుడ్ గ్రైన్స్ పంచడం, అంగరంగ వైభవంగా స్వర్ణోత్సవాల నిర్వహణ, 2 రోజుల రెసిడెన్షల్ జిల్లా స్థాయి ఉపాధ్యాయ క్రీడల నిర్వహణ మొదలైనవి ఈ కార్యక్రమాలన్నింటికీ తోడ్పాటు అందిస్తున్న గౌ,, శ్రీపాల్ రెడ్డి, రాష్ట్ర సంఘ అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిక్షం గౌడ్‌కి, పెద్దలు బి మోహన్ రెడ్డి, పి వెంకట్ రెడ్డి, వంగ మహేందర్ రెడ్డి, గుండు లక్ష్మణ్ ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో అన్ని విధాలుగా సహకరిస్తున్న మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు ఆయా మండలాలలోని రాష్ట్ర జిల్లా మండల బాధ్యులకు, ప్రాథమిక సభ్యులకు ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు ఈ కార్యక్రమములో డీఈవో రాజు, ఈఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర సహాధ్యక్షులు జే. మధుసూదన్ రెడ్డి, సంగారెడ్డి, గోవర్ధన్, వివిధ మండల శాఖల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు హన్మండ్లు, రమణ, రామచంద్ర రెడ్డి, ప్రసాద్, సంతోష్ రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.



# సామాజిక అవగాహన కార్యక్రమంలో పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు

**కరీంనగర్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** స్థానిక కరీంనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు గత శనివారం నిర్వహించిన వ్యర్థాలపై అవగాహన కార్యక్రమాలను ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలుష్యాన్ని నివారించడం, సహజ వనరులను పరిరక్షించడం, నగరంలో వాతావరణ మార్పులను తగ్గించడం ద్వారా ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడటానికి వ్యర్థాల నిర్వహణ ప్రాముఖ్యతపై అవగాహన తీసుకురావడం ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం ప్రధాన లక్ష్యాలు. పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమం ద్వారా వ్యర్థాల నిర్వహణలో ఆరు భాగాలుగా అంటే చెత్తను తగ్గించడం, మరమ్మతు చేయడం, పునర్వినియోగం చేయడం, రీసైకిల్ చేయడం కుళ్ళిపోవడం పై దృష్టి సారించారు. ఈవ్యర్థాలు, పొడి వ్యర్థాలు, తడి వ్యర్థాలు, బయోమెడికల్ వ్యర్థాలు, నిర్మాణ వ్యర్థాలు, రసాయన వ్యర్థాలు వంటి వివిధ రకాల వ్యర్థాలను గుర్తించడం, వర్గీకరించ డం వాటిలోని పారవేసే వ్యవస్థ లలిత్ మోహన్ సాహు మార్గదర్శకత్వంలో 9వ తరగతి విద్యార్థులు జి. అదితి, ఎస్. సాన్విక, మీహా ముబారక్, వి. అమోఘ్ సాయి, ఎస్. జయకృష్ణ వ్యర్థాల నిర్వహణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి సామాజిక అవగాహనను తీసుకువచ్చారు. నగరంలో రైల్వేస్టేషన్, బస్ స్టేషన్, ఆసుపత్రి వంటి వివిధ ప్రదేశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాద్ రావు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ రశ్మిత, హనుమంతరావు, ప్రిన్సిపాల్ గోపీకృష్ణ, సమన్వయకర్తలు రవీంద్ర పాత్రో, భవాని, నిఖిత లు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి దోహద పడుతుంది

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం ఫిర్యాదు దారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలువురు అర్జిదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం అర్జిలు మొత్తం 110 వచ్చాయి. అర్జిదారులకు న్యాయం చేసి తిరిగి అర్జి పెట్టుకోకుండా పని చెయ్యాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తు కొరకు ప్రత్యేకంగా

# తక్షణ రోడ్డు మరమ్మత్తుల బృందం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** అధిక వర్షాలతో కామారెడ్డి పట్టణంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తు కొరకు ప్రత్యేకంగా తక్షణ రోడ్డు మరమ్మత్తుల బృందం ఇన్స్టెంట్ రిపేర్ టీం ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు.బారీ వర్షాలకు కామారెడ్డి పట్టణంలో రోడ్లపై ఉన్న గుంతలను సిమెంట్ కాంక్రీట్ తో పూడ్చేందుకు,60 రోజుల పాటు రోజు స్వతహాగ గుంతలను గుర్తించి పూడ్చేందుకు ఏర్పాటు చేసిన బృంధాల తక్షణ మరమ్మత్తు వాహనంను కలెక్టరేట్లో సోమవారం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ అధిక వర్షాలతో కామారెడ్డి పట్నంలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతు పనులను వేగంగా నిర్వహించేందుకు ప్రత్యేక వాహనాల ద్వారా టీం లను ఏర్పాటు చేయడం జరిగిందని, ఆ బృందం 60 రోజులపాటు ప్రతిరోజు పట్టణంలోని అన్ని వార్డులను పరిశీలిస్తూ సిమెంట్ కాంక్రీట్ తో గుంతలను పూడ్చి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు చందర్ నాయక్, మున్సిపల్ డిఈ, ఏఈ లు తదితరులు పాల్గొన్నారు.




# బీసీలు రాజ్యాధికారం సాధించాలి

- బీసీల బతుకులను మార్చేందుకే తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఏర్పాటు
- రాష్ట్రంలో మెజార్టీ ప్రజల పక్షాన టీఆర్పీ పోరాడుతుంది
- టీఆర్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** బీసీలకు ప్రత్యేక పార్టీ వస్తేనే బతుకులు బాగుపడతాయని ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్న తెలంగాణ రాజ్యాధికార పార్టీని స్థాపించారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్ అన్నారు.తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఆయనను ప్రకటించిన తర్వాత మొదటిసారిగా సూర్యాపేటకు వస్తున్న సందర్భంగా ఆ పార్టీ నాయకులు,కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.ముందుగా గాంధీ నగర్ పెద్దమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కొత్త బస్టాండ్ వద్ద ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మెజార్టీ ప్రజల పక్షాన టీఆర్పీ పోరాడుతుందన్నారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనైనా తమ బతుకులు బాగుపడతాయని భావించిన వారికి నిరాశే మిగిలిందన్నారు.ఎంతో మంది ఆత్మబలిదానాలతో ఏర్పడ్డ ధనిక రాష్ట్రమైన తెలంగాణను అప్పుల పాలు చేశారని అన్నారు.మన ఓట్లతో అగ్రవర్ణాలకు చెందిన నాయకులను గెలిపించడం వల్ల వారే అధికారంలో ఉంటున్నారని అన్నారు.అగ్రవర్ణాల నాయకులు ఏ పార్టీలో ఉన్న కలిసిమెలిసి పని చేస్తారని, నష్టపోయేది బీసీలేనని అన్నారు. బీసీలు రాజ్యాధికారం సాధించడా నికి సంఘటితం కావాలన్నారు. జనాభాలో అధిక శాతమున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఓట్లు వేసి బీసీలను గెలిపిస్తే రాజ్యాధికారం బీసీలకు వస్తుందని పేర్కొన్నారు. బీసీలందరూ ఐక్యమై రాబోయే ఎన్నికలలో బీసీలనే ఎన్నుకోవాలని కోరారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీకి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు పలువురు నాయకులు ఆ పార్టీలో చేరారు.ఈ కార్యక్రమం లో వట్టె రేణుక, అన్నెపర్తి రాజేష్, కుంభం నాగరాజు, లింగస్వామి గౌడ్, కుంభం వెంకన్న, వల్లాల సైదులు, సుంకరబోయిన రాజు, చాంద్ పాషా, శ్రీశైలం, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# డెక్కన్ సిమెంట్స్ ఫ్యాక్టరీలో తీవ్ర ఉద్రిక్తత

- రాళ్లు, కర్రలతో పోలీసుల పై దాడి చేసిన వలస కూలీలు
- అప్రమత్తమైన పోలిస్ బలగాలు

**పాలకవీడు( జనం సాక్షి) న్యూస్ :** మండల పరిధిలోని భవాని పురం లో గల డెక్కన్ సిమెంట్స్ ఫ్యాక్టరీలో బిహారీ కూలీలు హల్చల్ చేశారు. బందో బస్తుకు వచ్చిన స్థానిక పోలీసుల పై రాళ్లతో,బడితెలతో తీవ్రంగా దాడి చేసిన ఘటన వెలుగు చూసింది. స్థానికుల కథనం ప్రకారం డెక్కన్ ఫ్యాక్టరీ లో కాంట్రాక్ట్ పద్ధతిలో కార్మికుడు (లేబర్)గా పని చేస్తున్న యూపి ,బలియా జిల్లాకు చెందిన వినోద్ (ఆదివారం )సాయంకాలం అందాజా 7 గంటలకు బట్టలు ఉతుకుతుండగ ప్రమాదవశాత్తు కిందపడి తలకి బలమైన గాయం తగలడంతో ఫాక్టరీ యాజమాన్యం సహాయంతో మిర్యాల గూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు హార్ట్ ఎటాక్‌తో మృతి చెందినట్టు నిర్ధారించారు. కాగా మృతుని కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ తోటి కూలీలు యాజమాన్యంపై రాళ్లతో దాడికి దిగారు. పోలీసులు జోక్యం చేసుకొని గొడవను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిం చిన స్థానిక పోలీసులపై రాళ్లతో, కర్రలతో దాడీ చేశారు. దాడిలో ఎస్సైకి స్వల్పంగా గాయాలు తగిలినట్టు తెలిపారు. సమస్యను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు బలగాలతో బరిలోకి దిగారు. దాడి చేసిన వారిలో ప్రధాన సూత్రధారిని అదుపులోకి తీసుకుని స్టేషన్ కు తరలించారు.



**సీజిఎం నాగమల్లిశ్వర్ రావు:**
గొడవ పూర్తిగా కార్మికులకు కాంట్రాక్టరుకు సంబందించినది. కుటుంబానికి చెల్లించాల్సిన నష్టపరిహారం గురించి వాగ్వాదం చోటు చేసుకుంది. మేము పోలీ సులకు సమచారం అందించాము రంగంలోకి దిగిన పోలీసులపై దాడి చేశారు.

**ఫ్యాక్టరీ యాజమాన్యంపై ఆరోపణలు:**
గతంలో కొత్త ప్లాంట్ నిర్మిస్తున్నపుడు కూలీలు చనిపోయారని అది గుట్టు చప్పుడు కాకుండా సెటిల్మెంట్ చేశారు. అదే తరహాలో మృతుని కుటుంబానికి పూర్తి స్థాయి లో పరిహారం అందదేమో అని ఆందోళనకు దిగారు .ఈ క్రమంలో దాడికి యత్నించారు అని స్థానికంగా వున్న ప్రజలు చర్చించుకుంటున్నారు.

# అదిలాబాద్ విద్యార్థి సాయి తేజ జాదవ్ ఆత్మహత్య

### ర్యాగింగ్ వేధింపులపై గోర్ బంజారా హక్కుల సాధన సమితి ఆగ్రహం

**దోమ సెప్టెంబర్ 23 జనం సాక్షి :** అదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు చెందిన నార్నూర్ మండలం నల్గొండ గ్రామానికి చెందిన సాయి తేజ జాదవ్ ఘట్కేసర్‌లోని మేడిపల్లి సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్నాడు. సీని యర్ విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో వేధింపులకు గురి చేసి, మందు తాగమని బలవంతం పెట్టి బార్‌కు తీసుకెళ్లి దాదాపు రూ.10 వేల బిల్లు చేసి మొత్తాన్ని తనే చెల్లించాలని ఒత్తిడి చేసినట్లు సమాచారం. ఈ అవమానం తట్టుకోలేక సాయి తేజ జాదవ్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసు కున్నాడు. ఈ ఘటనపై గోర్ బంజారా హక్కుల సాధన సమితి సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సంఘం వ్యవస్థాపకుడు వినోద్ జాదవ్ మాట్లాడుతూ, "తెలంగాణ రాష్ట్రంలో గిరిజన, షెడ్యూల్ కాస్ట్ వర్గాలపై దాడులు, వేధింపులు ఎన్నోసార్లు చోటుచేసుకున్నాయి. ఇప్పటికీ అదే దుస్థితి కొనసాగుతోంది. గిరిజన బిడ్డ సాయి తేజ జాదవ్ కు న్యాయం జరగాలి. నిందితులపై తక్షణం చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా గోర్ బంజారా హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాము" అని హెచ్చ రించారు. సాయి తేజ జాదవ్ కుటుంబాని కి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగు తుందని సంఘం స్పష్టం చేసింది.

# మహిళా, ప్రజా భద్రత.. మా పోలీస్ బాధ్యత

- బతుకమ్మ, దుర్గామాత నవరాత్రి వేడుకలకు ముందస్తు భద్రతా ఏర్పాట్లు పూర్తి
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ



**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల్ జోన్‌ల పరిధిలో రామగుండం పోలీస్ శాఖ మహిళలు బతుకమ్మ ఆడేటువంటి ప్రాంతాల్లో, దుర్గామాత అమ్మ వారు ఏర్పాటు చేసిన ప్రాంతాలలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ, పెట్రోలింగ్, విషబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది అని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి ఆటంకాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడటం మహిళ రక్షణ పోలీసుల బాధ్యత. పోలీసులు ప్రత్యేకంగా నిఘా, పర్యవేక్షణ నిర్వహించడంతో పాటు, ప్రజల భద్రతకు సంబంధించిన సమస్యలపై అవగాహన కల్పిస్తాం అన్నారు. ముఖ్యంగా సాయంత్రం పూట బతుకమ్మలు ఆడే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు నిఘా పెట్టి, ప్రజలకు, ముఖ్యంగా మహిళలు, పిల్లలకు ఏవైనా అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు, పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తూ, విజిబుల్‌గా ఉంటూ వెంటనే స్పందించి సహాయం అందిస్తారు. బతుకమ్మ పండుగ సంబరాల సమయంలో మహిళల, ప్రజల భద్రతను పర్యవేక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత, ప్రజలు సురక్షితంగా పండుగను ఆనందించేలా చూడటానికి పోలీస్ కృషి చేస్తుందని తెలిపారు.దుర్గామాత నవరాత్రి వేడుకలను రామగుండం కమిషనరేట్ వ్యాప్తంగా శాంతియుత వాతావరణంలో నిర్వహించడం కోసం అన్ని ముందస్తు భద్రతా ఏర్పాట్లు పూర్తి చేయబడ్డా యని సీపీ అన్నారు. దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో నిర్వాహకులు తప్పనిసరిగా భద్రతా నిబంధనలు పాటించాలని పోలీస్ కమిషనర్ సూచించారు. వేడుకల సమయంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తే, కఠినమైన చర్యలు తీసుకోవబడతాయని హెచ్చరించారు.ఏమైనా సమస్యలు గమనించిన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లేదా డయాల్ 100 ద్వారా సమాచారం అందించాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు, వదంతులను నమ్మవద్దన్నారు. పండగ ఉత్సవాలను సురక్షితంగా జరుపుకోవడంలో పోలీస్ అధికారులకు సహకరించండి. ప్రజల సహకారంతో ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీస్ నిఘా కొనసాగుతుందని కమిషనర్ తెలిపారు. పండుగ సెలవులను పురస్కరించుకొని సొంత ప్రాంతాలకు, బంధువుల ఇండ్లకి, విహార యాత్రలకు వెళ్లే ఆయా గ్రామాల, కాలనీ ల ప్రజలు తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరి స్థానిక పోలీస్టేషన్ లో సమాచారం ఇవ్వండి. వారి వివరాలు నమోదు చేసుకొని వారి ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తాం అన్నారు. అదేవిదంగా మీ గ్రామం, పట్టణం, కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసు స్టేషన్‌కు తప్పనిసరిగా సమాచారం ఇవ్వండి. డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాలని సీపీ సూచించారు.

# సైబర్ వారియర్స్‌తో సమావేశం నిర్వహించిన సీపీ

- ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో రామగుండం పోలీస్ కమిషనర్ పరిధిలోని పోలీస్ స్టేషన్లో సైబర్ వారియర్స్‌తో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ సైబర్ వారియర్స్ సిబ్బందితో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు.టీజీసీఎస్‌బీ హైదరాబాద్ పంపిం చిన టీషర్ట్‌లను సైబర్ వారియర్స్‌కు అందజేశారు.ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ సైబర్ వారియర్స్‌గా పని చేస్తున్నటువంటి వారి పనితీరు గురి ంచి అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు వేగంగా పెరుగు తున్న క్రమంలో ప్రజలకు సైబర్ క్రైమ్ సెక్యూరిటీపై అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని మీమీ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలలో అవగాహన కల్పించాలి చైతన్య పరచాలని సూచించా రు. సైబర్ వారియర్స్‌కి అప్పగించిన బాధ్యత ని సక్రమంగా నిర్వహిస్తూ విధులలో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా ఇన్వెస్టిగేషన్ నిర్వహించి సైబర్ బాధితులకి న్యాయం చేసే విధంగా కృషి చేయాలనీ సీపీ సూచించారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో ఇటీవల తేదీ:-13-09-2025 రోజున నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా మొత్తం 134 సైబర్ కేసులలో 41,81,824/- రూపాయలు బాధితులకు డబ్బులు వారి సంబంధి త అకౌంట్‌లకు రిఫండ్ కావడం జరిగింది.లోక్ అదాలత్ సంబంధించి అధిక కేసులు రిఫండ్ అయ్యేలా కృషి చేసిన ఉత్తమ ప్రతిభ కనబర్చిన నలుగురు సైబర్ వారియర్ పోలీస్ కానిస్టేబుల్‌లకు ప్రశంసాపత్రాలను ఇవ్వడం జరిగింది.ఈ సమావేశంలో సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీనివాస్, సీసీపీఎస్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, సీసీ హరీష్, సైబర్ వారియర్స్, ఇతర పోలీస్ సిబ్బంది హాజరయ్యారు.



# బతుకమ్మ విశిష్టతను చాటి చెప్పిన అల్ఫోర్స్ బతుకమ్మ మహోత్సవ్





- అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఆకాశమే హద్దుగా బతుకమ్మ సంబరాల వేడుకలు
- ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి, డా.వి.వనజా రెడ్డి

**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి గొప్ప నిదర్శనమని పండుగ ద్వారా సమాజంలో సుఖసంతోషాలతో పాటు మహిళలకు సౌభాగ్యం సిద్ధిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి వారి సతీమణి డాక్టర్ వి.వనజా నరేందర్ రెడ్డి తో కలిసి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్ మైదానంలో వైభవంగా నిర్వహించినటువంటి "అల్ఫోర్స్ బతుకమ్మ మహోత్సవ్" వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో అందంగా ఏర్పాటు చేసినటువంటి నవదుర్గ విగ్రహానికి పూజ కార్యక్రమాన్ని నిర్వహించి బతుకమ్మకు పూజ చేసి వేడుకలను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ.. బతుకమ్మ వైభవాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకో వాలని, తెలుసుకోవడం ద్వారా తెలంగాణలో నెలకొన్నటువంటి పరిస్థితులను చక్కగా అర్థం చేసుకుంటారని వారు చెప్పారు. బతుకమ్మ పండుగ ద్వారా ప్రకృతిని ఆరాధిస్తామని, ప్రకృతిలో నెలకొన్నటువంటి పలు రుగ్మతులను తొలగించడానికి ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని, కృషి చేయాలని వారు సూచించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చడమే కాకుండా వారి విషయాలను బతుకమ్మల ద్వారా దుర్గాదేవికి విన్నవించడం జరుగుతు ందని వారు తెలిపారు. చిన్నా పెద్ద తేడా లేకుండా మహిళలందరూ ఉత్సాహంగా కోలాహలం నడుమ బతుకమ్మ వేడుకలను చాలా ఘనంగా జరుపుకోవడం చివరి రోజున సద్దుల బతుకమ్మ పేరుతో సామూహికంగా నిర్వహించడం ద్వారా సమాజంలో కళా వైభవం కనబడు తుందని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి గొప్ప వైభవాన్ని తెచ్చిపెట్టే పండుగ బతుకమ్మ అని ఈ పండుగ మన దేశంలోనే కాకుండా విదేశాల్లో సైతం చాలా ఉత్సాహంతో జరుపుకుంటారని వారు తెలిపారు. బతుకమ్మ వైభవాన్ని చాటి చెప్పేందుకు ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో ఆకాశమే హద్దుగా వేడుకలను నిర్వహించుకోవడం హర్షించదగ్గ విషయమని వారు చెప్పారు. వేడుకుల సందర్భంగా ప్రదర్శించినటువంటి పలు నృత్యాలు, కోలాటలు, పాటలు ప్రత్యేక ఆకర్షణగా ఉండడమే కాకుండా బతుకమ్మ వైభవాన్ని చాటి చెప్పాయి. ఈ కార్యక్రమం లో వివిధ పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, అధ్యాప కులు, శ్రేయోభిలాషులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జమ్మికుంటలో టిబి చాంపియన్స్ శిక్షణా కార్యక్రమం

- జిల్లాలో టీబీ రహిత గ్రామాలే లక్ష్యం
- హుజురాబాద్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ చందు

**జమ్మికుంట, సెప్టెంబర్ 22 (జనం సాక్షి):** కరీంనగర్ జిల్లా డిఎం అండ్ హెచ్ఓ, డిటిసిఓల ఆదేశాల మేరకు క్షయ నివారణ విభాగం ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ - టీబి అలర్ట్ ఇండియా వారి సహకారం తో వావిలాల, ఇల్లందకుంట,చల్లూరు పీహెచ్‌సిల వైద్యధికారుల ఆధ్వర్యంలో సోమవారం జమ్మికుంట వర్తక సంఘం భవనంలో టీబి చాంపియన్స్ శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హుజురాబాద్ డిప్యూటీ. డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్.చందు, ఇల్లందుకుంట పిహెచ్‌సి మెడికల్ ఆపిసర్ డాక్టర్ తులసిదాస్, రోసోర్స్ పర్సన్ డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ మేనేజర్ సురేందర్,హెల్త్ ఎడ్యుకేటర్స్ పంజాల ప్రతాప్ గౌడ్,మోహనరెడ్డి హాజర య్యారు. అనంతరం హుజురాబాద్ డిప్యూటీ. డిఎంఅండ్‌హెచ్ ఓ డాక్టర్ చందు మాట్లాడుతూ క్షయ వ్యాధితో బాధపడేవారు తగు జాగ్రత్తలు వహించడం వల్ల ఇతరులకు వ్యాధి సంక్రమించకుండా ఉంటుందని సూచించారు. ప్రభుత్వం క్షయ వ్యాధికి ఉచిత వైద్యం అందిస్తుందని లక్షణాలు ఉన్నవారు అశ్రద్ధ చేయకూడదని వెంటనే నిర్ధారణ పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు.డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ మేనేజర్ సురేందర్ మాట్లాడుతూ భారత ప్రధాని ఆదేశాల మేరకు 2025నాటికి మన దేశంలో టీబి ని లేకుండా చేయడానికి అందరు టిబి వ్యాధి పైన అవగాహన కలిగి వుండాలని మంచి ఆహారం తీసుకొవాలని వ్యాధి నివారణలో అందరూ భాగస్వాములు కావడం ద్వారా భారత దేశంలో టీబి వ్యాధిని అంతమొందించవచ్చని సూచించారు.



ఈ టీబి ఛాంపియన్ శిక్షణా కార్యక్రమం కొరకు హెల్త్ సబ్ సెంటర్ వారీగా పిహెచ్‌సి సిబ్బంది సహకారంతో క్షయ వ్యాధితో పోరాడి గెలిచిన వారిని ఎంపిక చేసి వారికి క్షయ వ్యాధి నివారణ పై శిక్షణ ఇస్తున్నామన్నారు.శిక్షణ అనంతరం వారిచే గ్రామాలలో టిబి వ్యాధి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు.జిల్లా క్షయ నివారణ విభాగం, జనరల్ హెల్త్ సిబ్బంది ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ సమన్వయంతో ఈ టీబి ఛాంపియన్ /కమ్యూనిటీ ఎంగేజిమెంట్ కార్యక్రమాల ద్వారా ప్రజలలో టీబి వ్యాధిపైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ కరీంనగర్ జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా మార్చడమే ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశం అని ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ప్రభాకర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట సబ్ సెంటర్ 2 ఎం ఎల్ హెచ్ పి డాక్టర్ మహోన్నత పటేల్, హెల్త్ ఎడ్యుకేటర్స్ పంజాల ప్రతాప్ గౌడ్,మోహన్ రెడ్డి,టి యు ఎస్ టి ఎస్ దేవేందర్ రెడ్డి, ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ సిబ్బంది గీతాంజలి, తిరుపతి, ఏఎన్ఎం లు,ఆశా వర్కర్స్ లు తదితరులు పాల్గొన్నారు.

# పేషెంట్ కేర్ వర్కర్ల పాత్ర అత్యంత కీలకం

- క్వాలిఫైడ్ పర్సన్స్ మాత్రమే ఉండాలి
- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- ప్రభుత్వ హాస్పిటళ్ల నిర్వాహణపై సమీక్ష



హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రభుత్వ హాస్పిటళ్ల నిర్వాహణలో సానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ వర్కర్ల పాత్ర అత్యంత కీలకమైనదని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఈ మూడు వ్యవస్థలతో పాటు, పేషెంట్లకు అందించే డైట్ విధానంలో తీసుకురావాల్సిన మార్పులు, ఆయా వ్యవస్థలను బలోపేతం చేయడానికి కొత్త పాలసీల రూపకల్పనపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సోమవారం, జూబ్లిహిల్స్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, డైట్ పాలసీల్లో ఉన్న లోపాలను, ఆ లోపాల వల్ల ఎదురవుతున్న సమస్యలను డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్ మంత్రికి వివరించారు. సెక్యూరిటీ టెండర్ నిబంధనల్లో సరియైన నియమాలు లేకపోవడంతో సెక్యూరిటీ గార్డులుగా వృద్ధులను, ఫిజికల్ ఫిట్‌నెస్ లేని వారిని కాంట్రాక్టర్లు నియమిస్తున్నారని.. ఈ అంశంలో మార్పు తీసుకురావాలని అధికా రులు మంత్రిని కోరారు. మొత్తం సెక్యూరిటీ సిబ్బందిలో కొంత శాతం మేర ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారిని నియమించాలని, ఇందుకు అనుగుణంగా నిబంధనలు మార్చాలని అధికారులకు మంత్రి సూచించారు. ఫిజికల్ ఫిట్‌నెస్ ఉండి, 50 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్నవారినే నియమిం చుకునేలా టెండర్ కండీషన్ ఉండాలన్నారు. సెక్యూరిటీ సూపర్‌వైజర్ పోస్ట్ ఉండాలని, ఈ పోస్టులో తప్పనిసరిగా రిటైర్డ్ ఆర్మీ పర్సన్ ఉండాలని మంత్రి ఆదేశించారు. పేషెంట్ కేర్ వర్కర్లుగా క్వాలిఫైడ్ పర్సన్స్ మాత్రమే ఉండాలని మంత్రి సూచించారు. ఏఎన్‌ఎం, తదితర సూటబుల్ క్వాలిఫికేషన్లు ఉన్న వారికి అవకాశం ఇవ్వాలన్నారు. తద్వారా వారికి ఉద్యోగ అవకాశాలు దక్కడంతో పాటు, పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. పేషెంట్ కేర్ వర్కర్లలో కనీసం 60 శాతానికి తగ్గకుండా మహిళలు ఉండాలని మంత్రి సూచించారు. సానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ వర్కర్లకు కూడా ఆధార్ బేస్‌డ్ బయోమెట్రిక్ అటెండెన్స్ విధానం ఉండాలన్నారు. మూడు షిఫ్టుల్లో సిబ్బంది పని చేయాలని, హాస్పిటల్ అవసరాలకు అనుగుణంగా ఏ షిఫ్ట్‌లో ఎంతమంది ఉండాలో స్పష్టమైన నిబంధనలు ఉండాల న్నారు. వర్కర్ల వేతనాల చెల్లింపులో కాంట్రాక్టర్ల అక్రమాలకు అవకాశం ఉండొద్దని, క్యాష్ పేమెంట్ సిస్టమ్ పూర్తిగా ఎత్తివేయాలని మంత్రి ఆదేశించారు. బ్యాంకు ఖాతాలోనే వేతనాలు జమ చేసేలా టెండర్ కండీషన్ ఉండాలని సూచించారు. ఆయా వర్కర్ల ఈపీఎఫ్, ఈఎస్‌ఐ ఖాతాల్లోకి నేరుగా డబ్బు జమ చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. సమావేశంలో టీజీఎంఎస్‌ఐడీసీ ఎండీ ఫణీంద్ర రెడ్డి, ఐపీఎం (ఫుడ్ సేఫ్టీ) డైరెక్టర్, డాక్టర్ శివలీల, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌తో ట్రిపుల్ ఆర్ బాధితుల భేటీ

- స్థానిక ఎన్నికలు బహిష్కరించాలని పిలుపు



హైదరాబాద్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : ట్రిపుల్ ఆర్ కారణంగా అన్యాయం జరిగితే నిలదీయాలని, స్థానిక ఎన్నికలను బహిష్కరించాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ సూచించారు. నల్గొండ, సూర్యాపేట జిల్లాకు చెందిన ఆర్‌ఆర్‌ఆర్ బాధితులంతా ఐకమత్యంగా ఉండాలని కేటీఆర్ సూచించారు. నల్గొండ, సూర్యాపేట జిల్లాల ట్రిపుల్ ఆర్ బాధితులు సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీ సమస్య పరిష్కరించకపోతే త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు బహిష్కరించాలని సూచించారు. స్థానిక ఎన్నికలు బహిష్కరించడం వల్ల మీ సమస్య దిల్లీకి వెళుతుంది. అసెంబ్లీలో మాకు మైక్ ఇవ్వట్లేదు. మైక్ ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం భయపడుతోంది. కత్తి వాళ్ల చేతిలో పెట్టారు.. మమ్మల్ని యుద్ధం చేయమంటున్నారు. కాంగ్రెస్ నేతల భూముల్లో రోడ్డు వెళ్లకుండా అలైన్‌మెంట్ మార్చడం కొత్తేంకాదు. గతంలో ఔటర్ రింగ్ రోడ్డు వేసినప్పుడు కూడా అష్ట వంకర్లు తిప్పారు. గతంలో ఓఆర్‌ఆర్‌కు భూసేకరణ సమయంలో భూమికి బదులు భూమి ఇచ్చారు. ట్రిపుల్ ఆర్ వల్ల భూమి కోల్పోతున్న రైతులకు భూమి కావాలంటే పోరాటం చేయొచ్చు. అలైన్‌మెంట్ శాస్త్రీయంగా ఉండాలని ఉద్యమం చేద్దాం అని కేటీఆర్ అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు జగదీశ్‌రెడ్డి, కర్నె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద ఉద్రిక్తత

- అడ్డుకోబోయిన పోలీసులపై కార్మికుల దాడి



సూర్యాపేట, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : జిల్లాలోని పాలకీడు మండలం దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఫ్యాక్టరీపై, అడ్డుకోబోయిన పోలీసులపై బిహార్ కూలీలు దాడి చేశారు. ఇటీవల కంపెనీలో ఓ బిహార్ కార్మికుడు ప్రమాదవశాత్తూ మరణించాడు. దీంతో అతడి కుటుంబాన్ని ఆదుకోవాలని.. పరిహారం చెల్లించాలని ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని తోటి కార్మికులు కోరారు. అయితే కార్మికుల విన్నపాన్ని యాజమాన్యం పట్టించుకోలేదు. ఈ విషయంపై పలుమార్లు ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని కలిసి వినతి చేశారు కూలీలు. అయినప్పటికీ వారు పట్టించుకోకపోవడంతో బిహార్ కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఫ్యాక్టరీ వద్దకు చేరుకుని ఫ్యాక్టరీపై దాడి చేశారు.. అంతేకాకుండా పరిశ్రమలోని అధికారులపైనా దాడికి పాల్పడ్డారు. ఫ్యాక్టరీ ఆఫీసు అద్దాలు ధ్వంసం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో విషయం తెలిసిన పోలీసులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. దాడికి పాల్పడుతున్న బిహార్ కూలీలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులతో కార్మికులు వాగ్వాదానికి దిగారు. చివరకు పోలీసులపై కూడా కార్మికులు దాడి చేశారు. పోలీసు వాహనంపై రాళ్లు రువ్వి.. వాహనం ధ్వంసం చేశారు. ఈ క్రమంలో ఫ్యాక్టరీ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# బండి సంజయ్‌వి చిల్లర మాటలు

- ఆయన ఏ షోరూంలో కొన్నారో కేటీఆర్ అక్కడే కొన్నారు
- హోం మంత్రిగా ఉండి కనిపెట్టింది ఇదేనా?
- మాజీ మంత్రి జదీష్‌రెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బండి సంజయ్‌వి చిల్లర మాటలు అని మండిపడ్డారు. ఆయన కార్లు ఏ షోరూంలో కొనుగోలు చేశారో.. కేటీఆర్ కూడా అక్కడే కొనుగోలు చేశారని చెప్పారు. సెకండ్ హ్యాండ్ కార్లు ఎవరైనా కొంటారు.. ఇదేనా బండి సంజయ్ గొప్పగా కనిపెట్టింది అని విమర్శించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసలు బ్రెయినే లేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కృష్ణానదిలో జలాల్లో వాటాలపై చర్చకు తాము సిద్ధమని ప్రకటించారు. అంతకుముందు కేటీఆర్‌పై బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ అక్రమంగా తెచ్చిన లగ్జరీ కార్లపై నడుస్తుందా? అంటూ విమర్శలు గుప్పించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా కేటీఆర్‌కి పలు ప్రశ్నలు సంధించారు. లగ్జరీ కార్ల స్కామ్ నిందితుడు బషరత్ ఖాన్ దిగుమతి చేసిన ల్యాండ్ క్రూజర్లలో కేటీఆర్ ఎందుకు తిరుగుతున్నారని బండి సంజయ్ నిలదీశారు. ఆ కార్లు కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన కంపెనీల పేర్లతో ఎందుకు రిజిస్టర్ అయ్యాయని ప్రశ్నించారు. మార్కెట్ ధర చెల్లించారా? లేక తక్కువగా చూపించి కొనుగోలు జరిగిందా? అని బండి సంజయ్ అన్నారు. పేమెంట్లు బినామీ పేర్లతో ఉన్నాయా? నకిలీ ఆదాయమా? లేక మనీలాండరింగ్ ద్వారానా? అని ప్రశ్నించారు. ఇందులో నిజాలు బయటకు రావాలని, సంబంధిత శాఖలు విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తాజాగా బండి సంజయ్ కామెంట్స్‌కు జగదీష్ రెడ్డి స్పందిస్తూ కౌంటర్ ఇచ్చారు.

# నళినికి అండగా ఉంటాం

- సీఎం రేవంత్ ఆదేశాలతో కలెక్టర్ పరామర్శ



హైదరాబాద్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : మాజీ డీఎస్పీ నళిని తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావును నళిని ఇంటికి పంపించారు. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ డీఎస్పీని యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు కలిశారు. నళినిని కలెక్టర్ కలిసి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సాయం కావాలన్నా..ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు– కలెక్టర్ ఆమెకు వివరించారు. సర్వీసు ఇష్యూలు ఏం ఉన్నా నిబంధనల మేరకు త్వరలోనే పరిష్కరిస్తామన్న సీఎం సందేశాన్ని నళినికి తెలియజేశారు కలెక్టర్ హనుమంతరావు. సోషల్ మీడియా పోస్టులో నళిని ఇలా రాసుకొచ్చారు.. ఒక అధికారిణిగా, ఉద్యమకారిణిగా, రాజకీయవేత్తగా, ఆయుర్వేద ఆరోగ్య సేవిక గా, ఆధ్యాత్మిక వేత్తగా సాగిన నా జీవితం ముగియబోతోంది. నాఆరోగ్య పరిస్థితి నెల రోజులుగా సీరియస్ గా ఉంది. ప్రస్తుతం క్రిటికల్ పొజిషన్ లో ఉన్నాను. మూడురోజుల నుండి నిద్ర లేదు. రాత్రంతా మహా మృత్యుంజయ మంత్రాన్ని జపిస్తూ గడుపుతున్నాను. ఎనిమిది ఏండ్ల క్రితం సోకిన విలక్షణ కీళ్ల జబ్బు గత రెండు నెలలుగా టైఫాయిడ్ , డెంగ్యూ, చికెన్ గున్యా వైరస్‌ల వల్ల తీవ్ర స్థాయికి చేరింది. కనకణం పేలిపోతున్నట్లు, ఏ కీలుకా కీలు విరిచేసినట్లునొప్పి తట్టుకోలేక పోతున్నాను అంటూ తన బాధను వెల్లడించింది.

# జీఎస్టీ సంస్కరణలతో అనూహ్య పరిణామం

- అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరణ
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



భువనగిరి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : జీఎస్టీలో తీసుకువచ్చిన సంస్కరణలతో ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించబోతోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. మోడీ సాహసోపేత నిర్ణయానికి ఇది నిదర్శనమన్నారు. దీంతో పేదలకు గణనీయంగా భారం తగ్గగలదని అన్నారు. జీఎస్టీ సంస్కరణలను అమలు చేసినందుకు కృతజ్ఞతగా భువనగిరి పట్టణంలోని వర్తకులు స్థానిక గంజి మార్కెట్ యార్డులో ప్రధాని మోదీకి కృతజ్ఞతగా ఏర్పాటు– చేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్థిక సంస్కరణలు చేపట్టిన ఏ దేశంలోనూ ఆ ప్రభుత్వం రెండోసారి అధికారంలో లేదని, ప్రజా ఆమోదయోగ్యంగా జీఎస్టీని అమలు చేసిన మోదీ రెండోసారి అధికారంలోకి వచ్చిన విషయాన్ని రామచందర్‌రావు గుర్తు చేశారు. పన్నులు తగ్గించడం ద్వారా ఉత్పత్తులు పెరగడంతోపాటు– సామాన్య ప్రజలకు భారం తగ్గుతుందని తద్వారా కొనుగోలు శక్తి పెరిగి ఎక్కువ స్థాయిలో పన్నులు వసూలు అవుతాయని ఆయన అన్నారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తాము కొనుగోలు చేసిన వస్తువులకు రసీదు తీసుకోవాలని అప్పుడే బ్లాక్ మార్కెటింగ్‌ను నిరోధించిన వారమవుతామన్నారు. స్వదేశీ వస్తువులను వినియోగించి దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచేందుకు కృషి చేయాలన్నారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి చంద మహేందర్ గుప్తా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, కాసం వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్, స్థానిక వ్యాపారులు పాల్గొన్నారు. ఇదిలావుంటే అనారోగ్యంతో బాధపడుతూ 'మరణ వాంగ్మూలం' పేరుతో బహిరంగ లేఖ రాసిన మాజీ డీఎస్పీ దొనకొండ నళినిని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు సోమవారం సాయంత్రం పరామర్శించారు. భువనగిరిలోని ఆమె నివాసానికి వెళ్లారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర నాయకులు వేముల అశోక్, డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, డాక్టర్ బూర నరసయ్య గౌడ్, పీఎస్ రవీందర్, ఊట్కూరి అశోక్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# దమ్ముంటే బిల్డర్లు.. నాయకులు ఆక్రమణలు కూల్చండి

- పేదల ఇల్లను కూల్చి వారిని రోడ్డున పడేస్తారా?
- ఇందిరమమ రాజ్యం అంటూ పేదల గూడును కూలుస్తారా?
- పేదల జోలికి వస్తే మాడి మసి అవుతారు జాగ్రత్త
- గాజుల రామారంలో పర్యటించి బాధితులను పరామర్శించిన ఈటెల



మేడ్చల్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : హైడ్రా అధికారులకు దమ్ముంటే ప్రభుత్వ స్థలంలో బిల్డర్లు, నాయకుల ఆక్రమణలు తొలగించాలని బీజేపీ మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ సవాల్ విసిరారు. హైడ్రా అధికారులు పేదల ఇల్లు కూలగొట్టి వారి జీవితాలతో చెలగాటమాడవద్దని హితవు పలికారు. కూడు, గూడు, గుడ్డ ఇవ్వాలని రాజ్యాంగం చెప్పిందని.. కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం పేదల జోలికి రావడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్న డబుల్ బెడ్ రూం ఏమోకానీ.. 40 ఏళ్లుగా ఇక్కడే బతుకుతున్న పేదల ఇళ్లు కూల్చారని ధ్వజమెత్తారు. గాజుల రామారంలో బ్రోకర్లు ఉంటే అరెస్ట్ చేయండి.. డబ్బులు రికవరీ చేయండి... కానీ పేదల జీవితాలతో ఆడుకోవద్దని కోరారు. పేదల మీద కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతాపం చూపొద్దని హితవు పలికారు. సోమవారం ఈటెల కూలిన ఇళ్లను పరిశీలించి బాధితులను పరామర్శించారు. బస్తీలన్నీ కలియ తిరిగి బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే బాధితులకు కరెంటు–, నీళ్లు అందించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల జోలికెళ్లడమేనా అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్నా రూ.2500, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదు కానీ పేదల గూడును మాత్రం చెదరగొడుతున్నారని మండిపడ్డారు. పేదల జోలికి వస్తే మాడి మసి అవుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరి మీదనో కోపంతోని పేదల ఇళ్లను కూల్చవద్దని హితవు పలికారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే కూలగొట్టిన వారికి ఇళ్లు కట్టించి ఇవ్వాలని ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని గాజులరామారంలోని ఐదు బస్తీల్లో ఉన్న పేదల ఇళ్లను హైడ్రా కూలగొట్టింది. 300 ఎకరాల ప్రభుత్వ భూమిలో తాతలు, తండ్రులు, ఇప్పుడు పిల్లలు ఉంటు–న్నారని చెప్పుకొచ్చారు. గుట్టలు, పుట్టలు ఉండి మనిషి ఉండే దిక్కులేనప్పుడు రూ. 5 వేలకు ఎకరం ఉన్న దగ్గరి నుంచి వీరు ఇక్కడ ఉంటు–న్నారని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా కంకర మిషన్ ఫ్యాక్టరీల్లో పనిచేయడానికి వడ్డెరలు వచ్చారని ఎంపీ ఈటల రాజేందర్ చెప్పుకొచ్చారు. కంకర మిషన్ ఫ్యాక్టరీల్లో పనిచేసి కాళ్లు, చేతులు పోగొట్టు–కొని మరీ పేదలు ఇక్కడ బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 60 గజాల గుడిసెల్లో ఉండే వారి మీదనా హైడ్రా ప్రతాపమని హెచ్చరించారు. దేశం ఇంకో దేశం మీద దాడి చేసినట్లుగా.. దొంగ దెబ్బ తీసినట్లు–.. పదుల సంఖ్యలో జేసీబీలు పెట్టి ఆదివారం వచ్చి పేదల ఇళ్లను కూలగొట్టారని ఫైర్ అయ్యారు. ఇళ్లను కూలగొట్టడంతో నిన్న రాత్రి అంతా ఆ పిల్లలతో వర్షంలోనే తడుస్తూ ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు– స్తంభాలు కూలగొట్టి, కరెంటు లేకుండా, తాగడానికి నీళ్లు లేకుండా చేశారని మండిపడ్డారు. ఇక్కడి పేదల దీనాస్థితి చూసైనా కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించాలని హితవు పలికారు. బ్రోకర్లను ఉరి తీయండి, అరెస్ట్ చేయండి.. కానీ 40 ఏళ్ల నుంచి ఇక్కడ ఉంటు–న్న పేదల ఇళ్లను కూలగొట్టి ఆడబిడ్డలకు బతుకమ్మ సంబరాలు లేకుండా చేసి వారి కన్నీటిని చూశారని ధ్వజమెత్తారు. రూ. 15 వేల కోట్ల స్థలాలు కాపాడామని హైడ్రా అధికారులు అంటు–న్నారని.. కానీ ఇక్కడ ఉంది 300 గుడిసెలు, పేదల ఇళ్లని చెప్పుకొచ్చారు. పేదల ఇళ్లని కూలగొట్టి రూ.15 వేల కోట్ల స్థలాలు కాపాడామని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడానికి సిగ్గు ఉందా అని ఫైర్ అయ్యారు. ఇప్పటికైనా బస్తీ వాళ్లతో ప్రభుత్వం మాట్లాడాలని సూచించారు. నరసింహ బస్తీ, బాలయ్య బస్తీ, గాలిపోచమ్మ బస్తీలో ఉన్నవారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పిల్లల పుస్తకాలు, ఇంట్లో సామాన్లను సైతం తొక్కించడంతో కన్నీరు మున్నీరవుతున్నాహైడ్రా అధికారులు కనీసం కనికరించడం లేదని మండిపడ్డారు.

# డివైడర్‌ను ఢీకొన్న కారు




## ఇద్దరు మృతి

జడ్చర్ల, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. 44వ జాతీయ రహదారిపై రాజాపూర్ వద్ద రెండు కార్లు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. డ్రైవర్ నిద్రమత్తులో జారుకోవడంతో కారు డివైడర్ ను ఢీకొని అనంతరం మరో కారుపై ఎగిరిపడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు దుర్మరణం చెందారు. మృతులు వనపర్తి ప్రాంతానికి చెందిన వ్యక్తులుగా గుర్తించారు. వాహనదారుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ట్రాఫిక్ జామ్ కావడంతో క్రేన్ సహాయంతో వాహనాలను పక్కకు తొలగించారు.

# గిజిగా(గూ)డు...!

చెన్నారావుపేట, సెప్టెంబర్ 22 (జనం సాక్షి): పిచ్చుకలు కట్టే గిజిగాడు గూళ్ళు ఎంతో ప్రత్యేకమైనవి. గట్టి పరకలను ఒక్కొక్కటిగా నోటితో సేకరించుకుని వస్తూ గూడును కట్టే విధానం ప్రతి ఒక్కరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి వెళ్లే రహదారి పక్కన ఓ వ్యవసాయ బావి ఒడ్డున ఉన్న తుమ్మ చెట్టుకు పిచ్చుకలు కొమ్మ కొమ్మకు ఒక గూడును కట్టుకొని అందులో నివాసం ఉంటున్నాయి. మరికొన్ని పిచ్చుకలు నివాసం ఉండడానికి గూడును అల్లుకుంటున్నాయి. ఈ దృశ్యాలను సోమవారం జనం సాక్షి క్లిక్ మనిపించింది.






Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370